
ఓం భూర్భువః స్వః తత్సవితుర్వరేణ్యం భర్గోదేవస్య ధీమహి ధియోయోనః ప్రచోదయాత్



# యుగశక్తి



# గాయత్రి



ఓం వందే భగవతీం దేవీం శ్రీరామంచ జగద్గురుం
పాదపద్మే తయోః శ్రిత్వా ప్రణమామి ముహుర్ముహుః

ప్రఖర ప్రజ్ఞ    మాతృ దేవోభవ ! పితృ దేవోభవ ! ఆచార్య దేవోభవ ! అతిథి దేవోభవ !    సజల శ్రద్ధ

సంకల్పం - సంరక్షణ
వేదమూర్తి, తపోనిష్ఠ, పండిత
**శ్రీరామ శర్మ ఆచార్య**
శక్తి స్వరూపిణి
**మాతా భగవతీ దేవి శర్మ**

ప్రధాన సంపాదకులు
డా॥ ప్రణవ్‌పండ్యా
సంపాదకులు
బి.సి.హెచ్.వి. సుబ్బారావు
(అశ్విని)
ఉప సంపాదకులు
ముక్కామల రత్నాకర్
సంపాదక మండలి
సాధన నరసింహాచార్య
శ్రీమతి లక్ష్మీరాజగోపాల్
డి.వి.ఆర్. మూర్తి

సంపుటి 20 - సంచిక 07
డిసెంబర్ 2015

పత్రిక అందనివారు మరియు పత్రికకు సూచనలు, సలహాలు ఇవ్వదలచినవారు ఈ క్రింది ఫోన్ నంబర్లలో సంప్రదించగలరు
040-23700722
99491 11175
94407 69798

## అసంతృప్తి

అసంతృప్తితో రగిలిపోతున్న ఒక వ్యక్తి ఒక స్వామీజీ దగ్గరకు వచ్చి 'నా ఈ అసంతృప్తి ఎలా శమిస్తుంది? నేను తృప్తి యొక్క అనుభూతిని ఎలా పొందగలను?' అని అడిగాడు. అప్పుడు ఆయన 'అరే! ఇందులో ఏమున్నది? నేను నీళ్ళు తోడుకునేందుకు బావి దగ్గరకు వెళుతున్నాను. నువ్వూ నాతోపాటు రా. నేను విడమర్చి చెప్పాల్సిన అవసరం లేకుండానే అక్కడ నీ ప్రశ్నకు సరైన జవాబు లభిస్తుంది. జరుగుతున్న దానిని గమనిస్తే విషయం నీవే అర్థం చేసుకొనగలవు' అని అన్నారు.

స్వామీజీ అడుగులేని ఒక బొక్కెన తీసుకుని, నీళ్ళు చేదటానికి దానిని బావిలోకి వేసినప్పుడు ఆ వ్యక్తి చాలా ఆశ్చర్యమునకు గురయ్యాడు. స్వామీజీ బావిలోని నీటిలో ఆ బొక్కెనను లోతుగానే ముంచాడు. అప్పుడు పెద్ద చప్పుడు కూడా వచ్చి బొక్కెన నీటిలో మునిగింది. అసలు అది నీటిలో మునగటానికి క్షణం కూడా పట్టలేదు. ఎందుకంటే దానికసలు అడుగు భాగమే లేదు కనుక. ఇలా ఎన్నిసార్లు నీళ్ళు తోడినా ఖాళీ బొక్కెనే పైకి వస్తున్నది. ఒకసారి, రెండుసార్లు... పదిమార్లు నీటిని చేదినా ఖాళీ బొక్కెనే పైకి వస్తున్నదితప్ప నీళ్ళు రావటం లేదు. ఇక చివరకు ఆ మనిషి ఆగలేక 'స్వామీజీ! మీరేం చేస్తున్నారు? ఆ బొక్కెన ఎప్పటికీ నీటితో నిండదు' అని అంటూ తన అసహనమును వ్యక్తపరచాడు.

అప్పుడు స్వామీజీ నవ్వి ఇలా అన్నాడు. 'ఈ బొక్కెనను నీకోసమే బావిలో వేసి నీరు చేదుతున్నాను. మనిషిలోని వాసనలు సైతం ఈ అడుగులేని బొక్కెన వంటివే. దానిలో నీరు నిలువదు. అలాగే వాసనలు ఎన్నడూ తృప్తిచెందవు. వాసనలను తృప్తిపరచాలనే జంజాటంలో చిక్కుకుంటే విషాదమే మిగులుతుంది. బావిలో వేసినప్పుడు బొక్కెన ఎన్నోమారులు నీటిలో లోతుగా మునిగింది, కానీ పైకి వచ్చేటప్పటికి బొక్కెన ఖా ళీ అయిపోతున్నది. మళ్ళీ మళ్ళీ అదే జరిగింది. పైగా నీకు 'ఇలా ఎందుకు జరుగుతున్నది? నేను ఎందుకు ఇలా చేస్తున్నాను? అన్న ఆశ్చర్యం కలుగలేదు మొదట్లో. అయితే నీవు ఇప్పుడు విషయమును సరిగానే అర్థము చేసుకున్నావు. వాసనల అసంతృప్తి ఎన్నడూ ఉపశమించదు అన్న విషయము నీకు గమనికలోకి వచ్చినది కదా! సంవేదనల రహదారిలో నడచినప్పుడు మరియు సేవ చేయుట వలన తృప్తి లభిస్తుంది. ఈ రాజమార్గమున పయనించినవారందరికీ తృప్తి, తుష్టి, శాంతి అనే మూడు అనాయాసముగానే లభిస్తాయి.

*– అనువాదం: శ్రీమతి లక్ష్మీరాజగోపాలు*

**క్రమశిక్షణ అంటే ఆదర్శానికి ప్రతీక**

# విషయసూచిక


1. **సంపాదకీయం :** అసంతృప్తి 3
2. **విషయసూచిక-సద్గురువాణి :** ఆత్మోన్నతి 4
3. **వేదమంత్రం:** సత్యాచరణ 5
4. **యుగనిర్మాణ చిత్రావళి-8 :** ఉపగుప్తుని యొక్క ఆత్మానుగత ప్రేమ 6
5. **గాయత్రీ విద్య-55:** గాయత్రీ మహాశక్తి యొక్క స్వరూపము, రహస్యము 7
6. **అశ్వమేధం-10 :** రాష్ట్రము, దిగ్విజయము - రాజనీతిక శబ్దములు కావు సాంస్కృతిక శబ్దములు 10
7. **పరమపూజ్య గురుదేవుల సుదీర్ఘయాత్ర - 42 :** విశ్వానికి ఆశ్రయం ఆ ఆశ్రమం-2 12
8. **జ్యోతిర్విజ్ఞానమునకు పునర్ వైభవం తీసుకురావల్సిన సమయం ఆసన్నమైనది - 2** 15
9. **సూక్ష్మీకరణ సాధన-1:** భూమిక 18
10. **కర్మకాండ ఎందుకు ఎలా?-7:** గాయత్రీ సాధనా విధానము 21
11. **అతీంద్రియ విజ్ఞానం-7:** సత్యదర్శనము 23
12. **పరమపూజ్య గురుదేవుల అమృత వచనాలు - 4:** ఆలోచనల గొప్పతనం మరియు వాని స్వరూపము 26
13. **నాదబ్రహ్మ - శబ్దబ్రహ్మ:** శబ్దమునకున్న గొప్ప (మహా)శక్తి 28
14. **మనము - మన ఆరోగ్యం :** దీర్ఘకాలిక రోగములు - వాటి నివారణ 30
15. **పూజ్య గురుదేవుల అమృతవాణి:** ఆధ్యాత్మిక ఔన్నత్యమునకు సోపానాలు యోగము మరియు తపస్సు - 4 32
16. **నా వారితో నా మాట:** కుటుంబ సమేత పిక్నిక్‌గా జరుపుకునే పండగ దీపావళి 35
17. **ఆయుర్వేదవైద్యం-8 :** ఆయుర్వేదగుణ పత్రాలు-2 48
18. **స్ఫూర్తిదాయక గాయత్రీపరివార్ సభ్యులు-19** 40
19. **వార్తలు :** రాష్ట్రంలో జరిగిన వివిధ కార్యక్రమాలు 42
20. **గో ఆధారిత వ్యవసాయంతో "రైతేరాజు"** 46
21. **గాయత్రీ వ్యాప్తికై కోనసీమలో అవిరళకృషి చేసిన శ్రీరామానందస్వామి** 48




## సద్గురు వాణి

### ఆత్మోన్నతి

ఆత్మోన్నతి కొరకు జీవితాన్ని సేవా మయం చేసుకోవాలి, సేవ చేసేం దుకు ఉత్సాహం పెంచుకోవాలి. ఎల్లప్పుడు ఇతరులకు ఉపయోగపడుతుండాలి. మీరు అలా చేయాలనుకుంటే మీ మనస్సును నిర్మలం చేసుకోవాలి. మీ ఆచరణ దివ్యంగా, ఆదర్శవంతంగా ఉండాలి. సానుభూతి, ప్రేమ, ఉదారత, స్నేహశీలత, నమ్రత పెంచుకోవాలి.

*- అనువాదం: ముక్కామల రత్నాకర్*


## యుగశక్తి గాయత్రి

**విడి ప్రతి రూ॥ 15/-** **సం॥ చందా రూ॥ 150/-**
**3 సం॥ చందా రూ॥ 420/-** **10 సం॥ చందా రూ॥ 1300/-**

చందా రుసుమును ఎట్ పార్ చెక్ ద్వారా (at par cheque) లేక డి.డి.ద్వారా కాని పంపగలరు. యం.ఒ. ద్వారా కూడా పైకం పంపించవచ్చు. కానీ యం.ఒ. ద్వారా వచ్చినప్పుడు పూర్తి అడ్రస్సు ఉండుట లేదు. అందువలన యం.ఒ. ద్వారా పైకం పంపినప్పుడు క్రింద ఇచ్చిన ఫోన్ నంబర్లను సంప్రదించి మీ వివరాలు అన్నీ ఇవ్వ ప్రార్థన. రూ. 5,000 లేక అంతకన్నా ఎక్కువ పంపదలచుకున్నప్పుడు ఆన్‌లైన్ ద్వారా పంపవచ్చును. దీనికన్నా తక్కువ పంపే వారు, రూ. 50/- అదనంగా చేర్చి పంపాలి.

ఖాతాపేరు: **శ్రీ వేదమాత గాయత్రీ ట్రస్టు**
బ్యాంకు పేరు: **స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా**
**ఎర్రగడ్డ శాఖ, హైదరాబాద్**
ఖాతా నెం.: **32506416087**
IFSC Code: **SBIN-0013272**

ఆన్‌లైన్‌లో పంపినప్పుడు బ్యాంక్ చలానా జిరాక్సు కాపీని మీ చిరునామా తెలుపుతూ తప్పక మాకు పంపించాలి.

**"శ్రీ వేదమాత గాయత్రీ ట్రస్టు"**
**గాయత్రీ చేతనా కేంద్రము,** హెచ్.పి. రోడ్, మూసాపేట
అశ్విని హౌస్ దగ్గర, హైదరాబాదు - 500 018.
ఫోన్: 040-23700722, సెల్: 9949111175

యుగశక్తి గాయత్రి మాసపత్రిక 'e' పుస్తకం వార్షిక చందా రూ.100/- NEFT ద్వారా మా బ్యాంక్ ఖాతాలో జమచేసినచో మీకు 'e' పుస్తకాన్ని మీ E-mail ఐ.డి.కి. పంపించెదము.


**నేర్చుకోవాలనుకునేవారికి అడుగడుగునా నేర్పేవారు దొరుకుతూనే ఉంటారు**

వేద మంత్రం

# సత్యాచరణ

**సుగః పన్నాథ అనృక్షర ఆదిత్యాస ఋతం యతే ।**
**వాత్రావఖాదో అస్థి వరి ॥ (ఋగ్వేదం 1/41/4)**

**భావార్థం:** సత్యమార్గం ముళ్ళు లేనిది, సరళము, తేలికగా దాటగల్గినది. అందువలన అందరు సత్యాన్ని ఆచరించాలి.

**సందేశము: సత్యం వద, ధర్మం చర, స్వాధ్యాయాన్మా ప్రమదః** – ఇది భారతీయ సంస్కృతి సారము. దీనిలో సత్యమునకు ధర్మముకన్నా మొదటి స్థానం ఇవ్వబడింది. మనం ఎల్లప్పుడు సత్యాచరణ చెయ్యాలి. సత్యమనగా లోపల బయట ఒకటిగా ఉండుటయే. ఇది మనుష్యత్వంలోని మొట్టమొదటి గుణం. మనసులో ఏమున్నదో అదే చెప్పాలి, అదే ఆచరించాలి. 'మనసా, వాచా, కర్మణా' ఏకరూపం ఉండాలి. ఈ విధంగా చేయడం వలన అంతరాత్మ నిర్మలం అవుతుంది. చిత్తం వికసిస్తుంది. ఈ విధమైన శుద్ధ అంతఃకరణలో శాంతి ఉంటుంది, ఈశ్వరీయ ప్రకాశ కిరణాలు వెల్లువెత్తుతాయి.

మనం పరస్పరం విశ్వాసంతో ఉంటే పరస్పర సద్భావనతో ఉండగలం. పరస్పర విశ్వాసం మీదనే సామాజిక వ్యవస్థ అంతా ఆధారపడి ఉంది. ఈ విశ్వాసం నశిస్తే ఒకరి మీద ఒకరు భరోసా ఉంచలేరు. సమాజ పరిస్థితులు స్థిరంగా ఉండవు. ప్రేమ, స్నేహం, సహకారం, సహాయములకు ఆధారము సత్యమే.

అసత్య వ్యవహారము, అసత్య భాషణం, తన నమ్మకము లకు విరుద్ధముగా చెప్పుట, వాస్తవ స్థితిని మరుగుపరచుట, తన ఆలోచనలు దాచుట ఇవన్నీ అసత్య భాషణలే. కేవలము అబద్ధము ఆడుట ఒక్కటియే అసత్యం కాదు. ఇతరులను భ్రమలో ఉంచుట వంటి కార్యకలాపములన్నీ అసత్యం క్రిందే లెక్కే. దీనిని మోసం, కపటం అని అనవచ్చు. ఇతరుల డబ్బు అపహరించకపోవచ్చు, ఇతరుల నమ్మకాన్ని వమ్ము చేసినా ఆ పాపమేమి తక్కువ కాదు.

విశ్వాసం పోగొట్టుకొనుట, సందిగ్ధంగా నిజాయితి లేకుండా ఉండుట ఇవన్నీ మనుష్యుని పతనమే. విశ్వసించదగిన వారిదే ప్రతిష్ఠ. విశ్వాసం పోగొట్టుకొన్నవారు సమాజంలో నికృష్ట స్థాయివారే. అసత్య భాషణ వలన సందేహం, అపనమ్మకం, అవిశ్వాసం ఏర్పడతాయి. మనసులో ప్రేమ, మైత్రి, ఉల్లాసం అంతరించి పోతాయి. అపనమ్మకం ప్రతి విషయంలోను, ప్రతి వ్యక్తి పట్ల సందేహాన్ని, అవిశ్వాసాన్ని ప్రేరేపిస్తుంది. అటువంటప్పుడు శ్రద్ధ ఎలా నిలవ గల్గుతుంది? అందరిలో ధూర్తత్వం, అసహ్యం ఏర్పడుతాయి. జీవన నిర్వహణ కఠినమే కాదు అసంభవమై పోతుంది.

అబద్ధం చెప్పే వ్యక్తి స్వయంగా ఎప్పుడు భయపడుతు ఉంటాడు. వాస్తవం దాగదు. నేడు కాకపోతే రేపు తెలుస్తుంది. అబద్ధం ప్రభావం తాత్కాలికమే. ఒక అబద్ధాన్ని దాచటానికి వేయి అబద్ధాలు ఆడవలసి వస్తుంది. కానీ ఎప్పుడో ఒకప్పుడు అది బయటపడకమానదు. సత్యం మేరు పర్వతంవలె ఎప్పుడు స్థిరంగా ఉంటుంది. మనసుమీద ఏ భారమూ ఉండదు. సత్య ప్రకాశంతో మనుష్యుని వ్యక్తిత్వం వెలిగిపోతుంది.

శ్రీ సత్యనారాయణుని కథ కేవలం వినుటయేకాక మన జీవితంలో ఆచరించుదాం.

★★★

## పండుగలు

**డిసెంబర్ 2015**

| | |
|---|---|
| 21-12-2015 | గీతా జయంతి<br>ముక్కోటి (వైకుంఠ) ఏకాదశి |
| 25-12-2015 | దత్తాత్రేయ జయంతి<br>క్రీస్తు జయంతి |

**జనవరి 2016**

| | |
|---|---|
| 12-01-2016 | స్వామి వివేకానంద జయంతి |
| 15-01-2016 | మకర సంక్రాంతి |
| 23-01-2016 | సుభాష్ చంద్రబోస్ జయంతి |
| 26-01-2016 | గణతంత్ర దినోత్సవం<br>(రిపబ్లిక్ డే) |

**మనిషి బుద్ధి బలంతో సుఖ సాధనలతోపాటు అనర్థాలను కూడా తెచ్చుకుంటున్నాడు**

యుగనిర్మాణ చిత్రావళి-8

# ఉపగుప్తుని యొక్క ఆత్మానుగత ప్రేమ



ఆ రోజులలో మధురా నగరం లోని వధువు వాసవదత్త రూప లావణ్యాల గురించి యావత్ భారతావనిలో చర్చ జరుగుతుండేది. మరోప్రక్క అదే సమయంలో ఉపగుప్తుని యొక్క తపస్సు, సేవ మరియు శీల స్వభావాలు కూడా సూర్య-చంద్రుల కాంతివోలె నలుదిశలా తళుకులీనుతూ ఉండేవి.

వాసవదత్త ఒక అద్వితీయ సౌందర్యరాశి! ఆమెను పొందుటకై గొప్ప గొప్ప రాజకుమారులు, సామంతులు మరియు సామ్రాట్టు వరకు ఉవ్విళ్ళూరుతుండేవారు. కానీ వాసవదత్త మనస్సు ఉపగుప్తుని యొక్క గుణగుణాల పట్ల ఆకర్షింపబడింది. ఆమె ఉపగుప్తుని పట్ల తనకు గల అవ్యాజమైన ప్రేమను వెల్లడిస్తూ ఆయనను వివాహమాడుటకై తన సంసిద్ధతను తెలుపుతూ ఇలా అన్నది. ఉపగుప్తా! నీకు తెలుసు గదా! గొప్ప గొప్ప పేరుప్రఖ్యాతిగాంచిన సామ్రాట్టు నన్ను వివాహమాడుటకై వారి యావత్ సంపదలను నా పరం చేయుటకు సంసిద్ధంగా ఉన్నారు. కాని నేను మాత్రం కేవలం మిమ్ములనే ప్రేమిస్తున్నాను. ఏమి మీరు నన్ను స్వీకరించి, నేను మీతో సహజీవనం చేయుటకు అంగీకరించరా?"

ఉపగుప్తుడు గంభీర స్వరంతో బదులు పలుకుతూ "భద్రే! ప్రేమ అనేది ఆత్మతత్వమునకు చెందినది. నిజమైన ప్రేమ శరీరతత్వానికి లోనై దానికి బందీకాజాలదు. అది సర్వ ప్రాణులలో విస్తరించి ఉంటుంది. అన్నింటికి సేవలందిస్తూ తృప్తిని చెందుతుంది. నాకు కూడా మీ పట్ల ప్రేమ ఉంది, దీనిని తెలుపుటకు నిన్ను వివాహమాడవలసిన పని లేదు. ఆధ్యాత్మిక శక్తితో జోడింపబడిన ప్రేమ శరీర సుఖంతో జోడింపబడితే దాని మహత్తును కోల్పోతుంది."

ఉపగుప్తుని దృఢ చిత్తాన్ని చవి చూచిన వాసవదత్త మిగుల నిరాశకు లోనైంది. ఆమె తన శారీరక సౌందర్యాన్ని వలగా విసరక, ఉపగుప్తుని ఉన్నత గుణాల గౌరవిస్తూ ఆయనను చేరుటకై తన ప్రయత్నాలను కొనసాగించుతూ ఉంది. ఉపగుప్తుడు వాసనలతో కూడిన క్రియాకలాపాల పట్ల విముఖుడై కన్నులు మూసుకొనేవాడు. ఆయన తన వ్రతానికి భంగం కలుగని విధంగా మసలుకుంటూ ఉండేవాడు. ఈ విధంగా ఇంద్రియ సంయమనాన్ని పాటిస్తూ తన కోర్కెల జయించాడు.

ఇంద్రియాలు అదుపులోనున్నంత వరకు, శరీరం శక్తిని కూడి ఉంటుంది. ఒక పర్యాయం ఇంద్రియ సంయమనాన్ని కోల్పోయినంతనే శరీరం తన కాంతిని, తేజస్సును నష్టపోతుంది. అప్పుడు మనుష్యునికి దుర్గతి ప్రాప్తిస్తుంది. యుక్తవయస్సులో పంచరంగులలో మరియు వాసనలతో కూడి సుఖాలకు లోనై భోగిస్తూ ఉన్న వాసవదత్త కూడా అట్టి కష్టాలనే అనుభవించ వలసి వచ్చింది. ఇంద్రియ సుఖాలకులోనై రోగాలబారినపడగా శరీరమంతా ఒడిలిపోయి వికారంగా మారి శరీరంలో వ్రణాలు పుట్టుకొచ్చాయి. నిన్నటివరకు ఆమె చుట్టూరా తిరిగి ఆమె పొందుకై ఆరాటపడిన రాజకుమార ధనికులు నేడు ఆమెను కన్నెత్తి కూడా చూడకున్నారు. కనీసం ఆమె త్రాగుటకు ఒక గ్లాసు నీళ్ళు కూడా అందించుటకు ఒక్కరు కూడా లేరు.

ఆమెను కనీసం తాకుటకు, ఆమెకు సహాయమందించుటకు ఏ ఒక్క ప్రేమికుడు సిద్ధంగా లేరు. ఇట్టి సమయమందు ఉపగుప్తుడు ఆమెను సమీపించి ఆమెకు సపర్యలు చేయసాగాడు. ఆమె ఆఖరి శ్వాస వదిలేవరకు ఉపగుప్తుడు ఆమెను వీడక ఆమెకు కడవరకు సేవలందించాడు.

ఒకరోజు వాసవదత్త, తనకు సేవలనందించుచున్న ఉపగుప్తుని ఇలా ప్రశ్నించింది. "ఆనాడు నేను స్వయంగా నీ వద్దకు వచ్చి నా సర్వస్వాన్ని నీ స్వాధీనం చేస్తాను నన్ను స్వీకరించమని కోరగా నిరాకరించావు. ఆనాడు నా వద్ద లావణ్యము, రూపము, డబ్బు ఉన్నాయి. నేడు ఏమి లేవు. పై పెచ్చు నా శరీరమంతా వ్రణాలు వచ్చి చూచుటకే అసహ్యంగా ఉన్న నాకు ప్రేమపూర్వకంగా సేవచేస్తున్నావు. ఎందుకు నా వద్దకు వచ్చావు?"

చెమర్చిన కన్నులతో ఉపగుప్తుడిట్లు జవాబిచ్చాడు. "ప్రేమ యొక్క వాస్తవిక రూపం వాసన లేక కోర్కెలతో కూడినది కాదు. అది సేవకు ప్రతిరూపం. ఆత్మతత్వంతో కూడినదే నిజమైన స్వచ్ఛమైన ప్రేమ-అదియే మనుష్యుని అంతఃకరణలో జాగృతమవుతుంది, మేలుకొంటుంది. మరోచోట కానేరదు.

వాసవదత్త తన ఆలోచన రీతిలోనే ప్రేమను వెల్లడిస్తుండగా ప్రేమను కోర్కెలకతీతంగా కూడా వ్యక్తపరచవచ్చు అని ఉపగుప్తుడు తన సేవలద్వారా నిరూపించి ఆమెకు కనువిప్పు కలిగించాడు. ఉపగుప్తుని ప్రేమయే అత్యంత సఫలతను చేకూర్చుతుంది మరియు సార్థకతను సిద్ధింపజేస్తుంది.

*- హిందీమూలం: యుగనిర్మాణ చిత్రావళి*

*- అనువాదం: పార్థసారథి*

**ఆత్మలో రసం ఉద్భవించనిదే సిద్ధి కలుగదు**

**గాయత్రీ విద్య-55**

# గాయత్రీ మహాశక్తి యొక్క స్వరూపము, రహస్యము



అణుసమూహముల కదలికల వలన భౌతిక జగత్తు యొక్క మొత్తం క్రియా కలాపములు నడుస్తుంటాయి. అదేవిధముగా సూక్ష్మజగత్తు యొక్క మహాదాకాశంలో చేతనత్వం యొక్క ఒక అవిచ్ఛిన్నధార ప్రవహిస్తుంటుంది. ఫలస్వరూపంగా జీవితంలో కనిపించే ఎన్నో వికసించిన, వికసించని జీవులు ఆ దివ్యచేతనత్వం యొక్క కార్యకలాపాల ప్రదర్శనయే. ఆ అచింత్య, అగోచర, అనుపమ విశ్వబ్రహ్మాండంలో వ్యాపించి ఉన్న చేతనత్వం పేరే బ్రహ్మ. బ్రహ్మ ఈ సమస్త విశ్వబ్రహ్మాండంలో వ్యాపించి ఉన్నాడు. ఒక్క కణం కూడా ఆ బ్రహ్మ యొక్క ఉపస్థితి లేకుండా ఉండజాలదు. భౌతిక జగత్తు యొక్క కార్యకలాపాలకు ప్రేరణ ఈ బ్రహ్మ నుంచి లభిస్తుంది. "ప్రకృతిని సక్రియంగా ఉంచే అణువుల కదలిక వస్తుతః ఏదో అజ్ఞాత చేతనాశక్తి నియంత్రణలో పనిచేస్తుంది. ఆ శక్తి యొక్క అనుదానం తీసుకుని నిర్జీవ ప్రపంచం సజీవంగా తయారయింది" అని ఐన్‌స్టీన్ అంటాడు. ఈనాటి వైజ్ఞానికులు ఈ బ్రహ్మచేతనత్వ స్వరూపం సవ్యంగా అర్థం చేసుకునే పరిస్థితి లేదు. కానీ దాని అస్థిత్వం భావనాక్షేత్రంలోనే ఉండక స్థూల జగత్తులోనికి కూడా రాబోతున్న రోజులు ఎంతో దూరంలో లేవు. భారతీయ తత్వదర్శులు ఈ బ్రహ్మచేతనత్వం యొక్క సత్తాను (శక్తిని) ఎప్పుడో అనాదికాలంలో తెలుసుకున్నారు. ఆ శక్తిని మానవ జీవనంలో ఉపయోగించే ప్రక్రియను ఒక పద్ధతిగా అందించారు. ఈ విధానంతో నగణ్యమైన అస్థిత్వము ఎంత మహత్వస్థితిలోనికి పరిమితి చెంది తనకు తానుగా బ్రహ్మ భూతం అవవచ్చు. ఈ విజ్ఞానమును "ఆధ్యాత్మికత" అని అన్నారు.

నగణ్యముగా దృష్టిగోచరమయ్యే అణవు ఏ ప్రక్రియ ద్వారా విభువు అవగలదో ఆ విధంగా నరుడు నారాయణుడుగా వికసించగలిగితే; ఆత్మ-పరమాత్మ అవగలిగే విద్యకు ఆధ్యాత్మిక విద్య లేక బ్రహ్మవిద్య అనే పేరు పెట్టారు. బ్రహ్మ తనకు తాను ఒక ద్రష్ట మాత్రమే. ఆయన అలా ఉండగిలిగితేనే అన్నింటిపై తన మహాత్యము, స్థాయి అనురూపంగా ఉత్పాదన, వ్యవస్థ యొక్క ప్రక్రియను కూడా నిర్ధారించగలడు.

పురాణములలో గాయత్రీ మహాశక్తి యొక్క నిరూపణ బ్రహ్మ యొక్క పత్నిగా జరిగింది. బ్రహ్మపత్ని, అర్ధాంగి అంటే క్షమత. పౌరాణిక వ్యాఖ్యాలలో బ్రహ్మ యొక్క ఇద్దరు పత్నులు గాయత్రీ, సావిత్రిగా వర్ణించారు. గాయత్రి అంటే చేతనత్వ జగత్తులో పనిచేసే శక్తి సావిత్రి అంటే భౌతిక జగత్తును సంచాలనము చేసే శక్తి, భౌతికవిజ్ఞానవేత్తలు సావిత్రీ ఉపాసన యొక్క విధానమును పాటిస్తున్నారు. విభిన్న రకాల వైజ్ఞానిక ఆవిష్కరణలు, ఉపకరణములు సావిత్రి శక్తి యొక్క ప్రతీకలే. ప్రాణులలో కనిపించే రకరకాల ప్రతిభలు, విశేషతలు, మహత్తులు గాయత్రీశక్తి యొక్క ప్రభావమే. ఎవరైనా ఈ శక్తిని ఉపయోగించుకోగలిగే విధానమును, విజ్ఞానమును సవ్యంగా అర్థం చేసుకోగలిగితే భౌతికజగత్తులో వైజ్ఞానికులు తమ ప్రయోగశాలలో మెషిన్లు ద్వారా పొందే లాభమును పొందగలరు.

సామాన్యస్థితిలో ఉన్న నరపశు వ్యక్తిత్వము, (కోరికలతో బంధింపబడిన వ్యక్తిత్తము) మానవునిగా, మహామానవునిగా, అతి మానవునిగా అవటానికి చైతన్య సాగరంలో కల్లోలం సృష్టించే ఈ బ్రాహ్మీశక్తి ఆశ్రయం పొందవలసి వస్తుంది. ఆకాశవాణి యొక్క విభిన్న రేడియో కేంద్రములు విభిన్న ప్రసారాలు చేస్తుంటాయి. మన రేడియో నిష్క్రియంగా పడి ఉంటే ఏ ధ్వనిని వినజాలము. కానీ దానిలోకి విద్యుత్తును పంపి, దాని ముల్లును నిర్ధారిత మీటర్‌పై ఉంచినప్పుడు దానికి సంబంధించిన రేడియోస్టేషన్ ప్రసారం వినగలుగుతాము. ఇదేవిధముగా బ్రాహ్మీమహాశక్తి-గాయత్రీ సర్వవ్యాపకమై నప్పటికీ కూడా సామాన్యమనుష్యులు ఎటువంటి ఉపయోగం పొందలేరు. కానీ ఎవరైతే తమ అంతఃచేతనత్వమును దానితో పాటు జోడింపగలిగితే ఆ శక్తిధార యొక్క అవతరణ తమలో చూడగలుగుతారు, దాని లాభామును పొందగలుతారు. గాయత్రీ ఉపాసన యొక్క శాస్త్రోక్త పద్ధతి ఒక వైజ్ఞానిక ప్రణాళిక. ఇది జీవుని బ్రాహ్మీశక్తితో జోడిస్తుంది, ఆ శక్తితో నింపివేస్తుంది.

**లక్ష్యప్రాప్తిలోనున్నంత ఆనందం మధ్య మజిలీలలో కూడా ఉంది**

సాధారణ ఉపాసనక్రమంలో గాయత్రిని ఒక దేవత రూపంలో ఉపాసిస్తారు. త్రికాల సంధ్యలలో బ్రాహ్మి, వైష్ణవి, శాంభవి రూపాలలో వరుసగా ధ్యానం చేస్తుంటారు. మాత రూపంలో భావన చేస్తుంటారు. నారీ ఆకృతిలో ప్రతిమకు పూజ చేస్తారు. కానీ ఇది ధ్యానం యొక్క ఏకాగ్రత కొరకు, భక్తి భావనను జాగృతము చేసుకునేందుకు ఒక పద్ధతి మాత్రమే. ఉపాసన కొరకు మానవీయ మనోభూమికి అనురూపంగా శబ్దమును, రూపమును, భావనను నిర్ధారించుకోవాలి. విద్యుత్తు మహాశక్తి యొక్క విశ్వవ్యాప్తమైన సూక్ష్మ రూపము గురించి శాస్త్రజ్ఞులకు తెలుసు. సామాన్యజనులు దానిని వెలుతురుగాను, ఫ్యాన్ మొదలైన రూపములలో పని చేయడం చూస్తుంటారు. వారి దృష్టిలో ఈ ఉపకరణములే విద్యుత్తు మహాశక్తి యొక్క ప్రత్యక్ష రూపములు. ఇదేవిధంగా ఉపాసన ప్రకరణములో గాయత్రిని మాతరూపంలో పూజ, అర్చన జరుగుతుంది. ఈ ప్రక్రియ అవసరమైనది ఎందుకంటే పాంచభౌతికమైన మనస్సు నిరాకారమైన తత్వములతో జోడింప కష్టసాధ్యము. నిరాకార ధ్యానం సంభవం కాదు, దానితో ఇటువంటి ఆత్మీయభావన కలుగదు. అందువలన బ్రహ్మీశక్తి నిరాకారమైనప్పటికి ఉపాసన కొరకు సాకారరూపమును ప్రతిష్ఠింపవలసి వస్తుంది. అందువలన గాయత్రీమాతను సాకారరూపంలో ఉపాసన చేస్తున్నప్పటికీ బ్రాహ్మీ మహాశక్తి వస్తుతః ఒక విశ్వవ్యాప్తమైన చేతనత్వమని, ప్రాణులలో ప్రాణ రూపంలో ఉంటుందని గుర్తుంచుకోవాలి. గాయత్రీ ఉపాసన ద్వారా మనము సామాన్యప్రాణమును మహాప్రాణముగా పరిణితి చేసుకోవాలి. వికసింపచేసుకోవాలి.

మానవశరీరంలో ఉండే ప్రాణశక్తివల్లనే శరీరం యొక్క మస్తిష్కం యొక్క పనులు జరుగుతుంటాయి. ప్రాణం యొక్క అంతరాళములో నుండి శక్తి కంపనములు క్షణక్షణం ఉద్భవిస్తుంటాయి, వేరే అన్య ఉపయోగము లేకపోతే శూన్యంలో సమాప్తమవుతాయి. ఇలా జరగటం వలన ఎటువంటి లాభం సూక్ష్మప్రాణధారికి లభించదు. కానీ ప్రాణతత్వం యొక్క కంపనలను ఏదైనా ఉపాయముతో సురక్షితం చేసుకోగలిగితే ఈ కోశం ఒక పెద్ద భాండాగార రూపంలో తయారవుతుంది. ఆ ప్రాణి శక్తివంతమవుతుంది.

గాయత్రీ శబ్దం యొక్క నామకరణం దాని క్రియ కలాపములు, స్వభావమును ధ్యానంలో ఉంచుకుని చేయబడింది. ఈ మహాశక్తితో సంబంధం వలన మొదటి లాభం ఏమంటే సాధకుని ప్రాణ ప్రవాహం శూన్యంలో వెదజల్ల బడటం ఆగిపోతుంది. ఈ శక్తితో ఏదైన మాహత్వపూర్ణ ప్రయోజనం సిద్ధింపచేసుకోవచ్చు. వర్షపునీరు కాలువలలో, నదులలో ప్రవహిస్తు అలా పోతూ ఉంటుంది. కానీ ఈ ప్రవాహానికి అడ్డుకట్ట వేసి ఆపగలితే విద్యుత్తు ఉత్పాదన మొదలైన పనులను సిద్ధింపచేసుకోవచ్చు. గాయత్రీ ఉపాసన ప్రాణశక్తి క్షయమును నిలువరించి దానిని పెంపొందిస్తుంది. దీనివలన ఉపాసకుడు రోజురోజుకి ప్రగతిపథంపై ఉన్నత స్థితికి చేరుతాడు.

మనిషిలో కనిపించే విశేషతలకు మూలం బ్రాహ్మీశక్తి యొక్క వైభవమే. ధనసంపత్తిని ఉచిత మరియు అనుచిత రీతులలో సంపాదించవచ్చు. శ్రీమంతుడయినప్పటికి ప్రారబ్ధం వలన మూర్ఖుడు కూడా అవవచ్చు. కానీ ఎవరి వ్యక్తిత్వం వికసించి ఉంటుందో అతని అంతరాళములో ఈ బ్రహ్మ చేతనత్వం – గాయత్రీ పని చేస్తుంది. ఏ సామర్థ్యం వలన మనుష్యులు విభిన్న ప్రకారమయిన సఫలతలు పొందగలుగు చున్నారో, ఆ శక్తి భౌతికమైనది కాదు, ఆత్మికమైనదని అర్థం చేసుకోవాలి.

ప్రకృతి జడపదార్థములను తయారుచేసింది కానీ ఈ పదార్థములను ఉపయోగించుకునే క్షమత చేతనత్వంలోనే ఉన్నది. బంగారం నేలలో ఉండవచ్చు. కానీ ఆ విషయం తెలియకపోయినా లేదా దానిని వెలికితీసే పద్ధతి తెలియక పోయినా ఆ బంగారం అక్కడే పడి ఉంటుంది. దానివలన ఎటువంటి ప్రయోజనం ఉండదు. అదేవిధంగా శరీరం వంటి బహుముఖ్యమైన యంత్రంలో మస్తిష్కం బాగా ఆలోచిస్తుంది. కాళ్ళు, చేతులు చాల పనులు చేస్తాయి. ఇంద్రియములు బాగా రసాస్వాదన చేస్తాయి. కానీ ఇవన్నీ జరగటానికి కారణం మనిషి చేతనత్వమే. ప్రాపంచిక సుఖసాధనములు ఉపయోగం వెనుక చేతనత్వం దాగి ఉన్నది.

చేతనత్వంలో అనేక స్థాయిలు ఉంటాయి. దైనందిన పనులకు తగిన చేతనత్వస్థాయి మామూలుగా లభిస్తుంది, కానీ ఉచ్చస్తరమైన క్షమత ప్రాప్తించుకోవడానికి విశేషమైన ప్రయత్నాలు చెయ్యాలి. ఈ విశేషమైన ప్రయత్నాలనే సాధన, ఉపాసన అని అంటారు. ఈ పుణ్యప్రక్రియ ద్వారా పురుషార్థ సాధకుడు తన ఆంతరికస్థితిని వికసింపచేసుకుని నిఖిల మహాదాకాశంలో వ్యాపించి ఉన్న బ్రహ్మీ మహాశక్తి–గాయత్రితో

**ఫలములోనున్న మాధుర్యం కర్మ చేయుటలో కూడా ఉంది**

సంబంధమును స్థాపించుకోగలుగుతాడు. ఈ సంబంధం ఎంత స్పష్టంగా ఉంటే, ఎంత బాగా ఉంటే అంత ఉచ్ఛస్తరీయ విభూతులు మానసిక క్షేత్రములో అవతరిస్తాయి. ఈ అవతరణే మనిషిని మహాపురుషునిగా, సిద్ధపురుషునిగా వికసింపచేస్తుంది.

లౌకిక ప్రయత్నములో మస్తిష్కమనోబలమును పెంచు కోవచ్చు, కొద్దోగొప్పో ఉన్నతి సాధించవచ్చు. ఇవి ఆత్మిక దృష్టిలో నగణ్యంగా భావిస్తారు. ఎంతటి చతురుడైనా, సురక్షితుడైనా కావచ్చు. వీటివలన గౌరవమర్యాదలు, సంతోషం పొందవచ్చు కానీ ముందున్న విభూతులు లభ్యం కావు. ఉచ్ఛస్తరీయ మహదాకాశంలో వ్యాపించి ఉన్న దివ్య బ్రహ్మీశక్తి – గాయత్రితో సంబంధం జోడించుకున్నప్పుడు మాత్రమే గొప్ప ఆధ్యాత్మిక లక్ష్యములను ప్రాప్తించుకొనగలుగుతాడు.

మోటరు ఎంత అశ్వికశక్తి కలది అనే దాని ఆధారంపై విద్యుత్తు భాండాగారం నుంచి దానికి విద్యుత్‌శక్తి లభిస్తుంది. మోటరు యొక్క పాత్రతపైనే ఎంత విద్యుత్తు ధార ప్రవేశిస్తున్నది అనేది ఆధారపడి ఉంటుంది. సాధకుడు తన సాధన ద్వారా తన ఆంతరిక స్థితి ఎంత వికసింపచేసుకున్నట్లుయితే దానికి అనుగుణంగా బ్రహ్మీశక్తి వ్యక్తీకరణ జరుగుతుంది. ఏ సాధకునిలో బ్రహ్మీశక్తి అవతరిస్తుందో అతను ధన్యుడవుతాడు. ఎవరికి గాయత్రీమాత ప్రేమ, అనుగ్రహం లభిస్తుందో అతనికి ఈ ప్రపంచంలో లభించని వస్తువు అంటూ ఉండదు. అతని లోపల దివ్యప్రేరణలు పనిచేస్తూ ఉంటాయి. ఇది సర్వసాధారణ వ్యక్తులకు కనిపించనివి, తెలియనివి సాధకునికి మాత్రమే దృగ్గోచరమవుతుంటాయి. ఇతరులు కోరుకునేవి అతని పిడికిలిలో ఉంటాయి. అతనికి లభించిన ఋతుంభరా ప్రజ్ఞతో అదృశ్యంగా ఉన్నవాటిని చూడగలడు. అలాంటి వ్యక్తి ఋషి అవుతాడు, బ్రహ్మపదం ప్రాప్తిస్తుంది.

దైవీశక్తుల స్వరూపం, క్రియాకలాపములు గురించి శాస్త్రములలో విస్తారపూర్వక వర్ణన ఉన్నది. ఆ శక్తులను ధారణ చేసినవాడు కంటికి కనిపించే వ్యక్తి కావచ్చు లేక అదృశ్య కేంద్రం కూడా కావచ్చు. సూక్ష్మజగత్తులో అటువంటి శక్తి కేంద్రాలు వెలుగొందుతున్నాయి. ఈ కేంద్రముల నుండి ఏ స్థాయి సంబంధం ఏర్పరచుకోగలిగితే అతను అంత శక్తివంతుడు అవుతాడు.

సూక్ష్మశక్తి కేంద్రాలను రుద్ర, ఆదిత్య, వసు, విశ్వదేవ, త్వష్టా, పూష, ఇంద్ర, మారుత, ఆర్యమా, అగ్ని అంటారు. దృశ్యమాన దేవమానవులను ఋషి, మనీషి, ద్రష్టా, జీవన ముక్తుడు, అర్హత్, అవతారాలు మొదలైన పేర్లతో పిలుస్తారు. ఈ రెండు వర్గాల దేవతల మహత్తుకు ఆధారం బ్రహ్మీశక్తి గాయత్రీయే. బ్రహ్మీశక్తి యొక్క అంశ ఎంత లభిస్తే అంత శక్తివంతుడు అవుతాడు.

గాయత్రిలో బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుని యొక్క మూడు శక్తులు కలగలసి ఉన్నాయి. బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు దేవజగత్తులో మూడు ప్రధాన శక్తులు, ఉత్పత్తి, పాలన, సంహారం అనెడి మూడింటి ద్వారా ప్రస్ఫుటమవుతుంటాయి. తదనుసారం ఈ సృష్టిక్రమం తన నిర్ధారిత ఇరుసుపై తిరుగు తుంటుంది. ఈ త్రిమూర్తులలో కూడా ఏ శక్తి పనిచేస్తుందో అది తత్వతః గాయత్రియే.

ఏవిధంగా చంద్రుని యొక్క వెలుగు, సూర్యకిరణములు చంద్రునిపై పడటం ద్వారా వస్తుందో, అదేవిధంగా ఈ – త్రిమూర్తుల క్షమత, క్రియాశీలత గాయత్రీ మహాశక్తి ప్రసరితం ద్వారా సంచాలితమవుతుంది.

బ్రహ్మదేవుని ద్వారా నాలుగు వేదములు తయారయ్యాయి. వేదములలో జ్ఞానవిజ్ఞానముల సమస్త సూత్రములు సంకేత రూపంలో ఇవ్వబడ్డాయి. ఈ వేదముల రచనకు బ్రహ్మదేవునికి గాయత్రీ నుండే ప్రేరణ లభించింది. సృష్టి ఆదిలో ఆకాశవాణి నిర్దేశానుసారం బ్రహ్మదేవుడు కమలపుష్పంపై కూర్చుని శత వర్షములు గాయత్రీ ఉపాసన చేసిన తర్వాత వేదజ్ఞానంలో నిష్ణాతుడయ్యాడు. గాయత్రీ కన్నా మించినది ఈ ప్రపంచంలో మరేది లేదు.

వేదములలో జ్ఞానవిజ్ఞానముల అంతులేని భాండాగారం ఉన్నది. వేదమంత్రముల ఆధారంగా జీవనాన్ని సుఖం, శాంతి, సమృద్ధిమయం చేసుకోగలిగితే శిక్షణ ప్రాప్తించుకోవచ్చు, భౌతిక జగత్తులో లభించే సమస్త సిద్ధులు, సఫలతలు పొందవచ్చు, వేదజ్ఞానము ద్వారానే ఋషులు తమ యొక్క వర్చస్సును పెంచుకున్నారు. వేదజ్ఞానమంటే గాయత్రీ మంత్రం యొక్క 24 అక్షరముల వాఖ్యయేనని మరేది కాదని చెప్పనవ సరం లేదు. ఎవరు గాయత్రిని అర్థం చేసుకున్నారో, ఎవరికి గాయత్రీ ప్రాప్తించిందో వారు ఇక పొందవలసినది ఏమి ఉండదు.

*– పూజ్యగురుదేవుల వాఙ్మయం 9 (8.9) నుండి*

*అనువాదం: ముక్కామల రత్నాకర్*

**భగవానుడు, భక్తుడు - పడుగు పేకలవలె కలిసిపోయి ఉన్నారు**

अశ్వమేధం - 10

# రాష్ట్రము, దిగ్విజయము - రాజనీతిక శబ్దములు కావు సాంస్కృతిక శబ్దములు

అశ్వమేధములో రాష్ట్ర సంఘటనము, దిగ్విజయ యాత్ర ఈ రెండు పనులు అనివార్యము. చాలాకాలము నుంచి మనము యజ్ఞీయ సాంస్కృతిక పదములు వాడుట లేదు. కనుక మన ఆలోచనాసరళి వైదిక ఆలోచనలకి అనురూపముగా రూపుదాల్చుట లేదు. రాజనీతిక సందర్భములో పై రెండు పదాలు వాడుటవల్ల మనస్సులో అనేక సందేహాలు ఉత్పన్న మవుతాయి. అశ్వమేధ ప్రయోజనము కొరకు పై శబ్దముల వాస్తవిక సాంస్కృతిక సందర్భములో వాటి అర్థాలు తెలుసుకోవాలి.

### రాష్ట్రమనగానేమి

భారతంలో "రాష్ట్రము" ఎల్లప్పుడు ఒక సాంస్కృతిక పదమేకాక దానిని రాజనీతిక పదంగా ఉపయోగించలేదు. పాశ్చాత్యదేశాలలో రాష్ట్రము రాజ్యముగా (Nation or State) మాత్రమే పరిగణిస్తారు. అక్కడ రాష్ట్రము, రాజ్యము సమానార్థ పదాలుగా వాడబడుతున్నాయి. దాని అస్థిత్వము రాజ్య సత్తామీద మాత్రమే ఆధారపడి ఉంటుంది. ఈ మధ్యనే దాన్ని Techno - Economical Unitగా గుర్తిస్తున్నారు. ఈ కారణం వల్లనే అన్ని చోట్ల స్వార్థపూర్ణ స్పర్థ, సంఘర్షమయ వాతావరణము ఉత్పన్నమవుతుంది.

భారతంలో రాష్ట్రపదము ఒక సాంస్కృతిక Unitగా పరిగణింపబడుతుంది. రాష్ట్రమే ఉపాస్యము. ఇష్టదేవత. అనేక రాజ్యాలలో విభిన్న ఉపాసనా పద్ధతులు. విభిన్న భాషలు, విభిన్న వేషధారలు అయినప్పటికి భారతం "ఒక రాష్ట్రము"గా పరిగణింపబడుతోంది. మన ఋషులు ప్రపంచములోని ప్రకృతి ప్రదత్తమైన వివిధ తలములను చాలా సహజంగా స్వీకరించారు. మనిషి అంతఃకరణములో ఉన్న వికసించిన చేతనత్వమును సాంస్కృతిక ఏకత్వము అనే భావసూత్రములతో వికసింప చేయటంలో సాఫల్యము పొందారు.

మానవీయ చేతనత్వ విజ్ఞానమర్మము తెలుసుకున్న ఋషులు కేవలము భౌతికాధారాల మీద అల్లుకున్న సంబంధాలు స్థిరముగా ఉండవని తెలుసుకున్నారు. భౌతిక ఆధారాలకు, మాన్యతలకు ప్రాధాన్యత ఇచ్చినపుడు స్వార్థము, ప్రతిస్పర్థ, ద్వేషము, శోషణ మొదలైనవి. ఎప్పుడో అప్పుడు మొలకెత్తు తాయి. అందుకే వారు రాష్ట్రీయ భావన శాశ్వతంగా ఉండటానికి సాంస్కృతిక ఆధారాలకు ప్రాముఖ్యత ఇచ్చారు. సాంస్కృతిక సూత్రాలను ప్రతివ్యక్తి భావనాత్మక స్థాయిలో చాలా లోతుగా నాటుకునేటట్లు చేసారు, ఈ కారణం వల్లనే ఎన్ని రాజనీతిక మార్పులొచ్చినా మన రాష్ట్రీయ భావనాత్మక ఏకత్వము చెదర లేదు.

భారతభూమి నిర్జీవ భూఖండము కాదు. అది "స్వర్గాదపి గరీయసి" తనలో తపోశక్తి, సద్భావనలను బీజమువలె ధారణ చేసి వికసింపచేయగలిగే సామర్థ్యము గలది. అనేక మంది ఋషుల తపస్సును ధారణ చేయగలిగే ఈ భూమిలో అటువంటి చోట్ల తీర్థస్థలాలు ఏర్పడ్డాయి. వాటిమీద ఉన్న ప్రజాదరణ, శ్రద్ధ క్షేత్రభాషా భేదాలకు అతీతముగా ఉన్నది. ఈ సాంస్కృతిక అవధారణే ప్రతి భారతీయుని రక్తంలో కలసి మెలసి నిరంతరము ప్రవహిస్తోంది.

అయోధ్యలో జన్మించిన రాముడు కన్యాకుమారిలో రామేశ్వరాన్ని స్థాపించాడు. బృందావనములోని శ్రీకృష్ణుడు ద్వారకను తన నివాసస్థానంగా ఎంచుకున్నాడు. బెంగాల్‌లో జన్మించిన చైతన్య మహాప్రభు బృందావనంలో తన ఇష్టదేవతను వెదుక్కున్నారు. కేరళలో జన్మించిన శంకరాచార్యులు. దేశం నాలుగు దిశలలో నాలుగు మఠాలను స్థాపించారు. కాశ్మీరులోని సరస్వతీ మందిర దర్శనంతో యాత్ర పరిపూర్ణమవు తుందని నమ్ముతారు. శంకరాచార్యులు తన శరీరాన్ని దక్షిణాదిలో కన్నా ఉత్తరాఖండములో విడచుటకు ఇష్టపడ్డారు. రామేశ్వరం యొక్క దాహార్తి గంగోత్రి జలము తాగితే తప్ప తీరదు. ఉత్తరాఖండంలోని దేవాలయంలోని దేవతలు దక్షిణాది పూజారులను అడుగలేరు. రామేశ్వరం, కేదార్‌నాథ్, సోమనాథ్, విశ్వనాథ్, పశుపతినాథ్, మహాకాళేశ్వర్, అమరనాథ్ మొదలైన అన్ని ప్రదేశాలలో భక్తునకు తన ఇష్టదేవతా దర్శనమే లభిస్తోంది.

**వస్తువు కన్న భావంలో ఉన్నవాడు కృతార్థుడు కాగలడు**

వైష్ణవదేవి నుంచి కన్యాకుమారి వరకు, అంబాజి (గుజరాత్) నుంచి కామాఖ్యా (అస్సాం) వరకు ఒకే మాతృశక్తిని నమస్కారాలు చేస్తుంటారు.

ఈ భావముతో నిండిన సాంస్కృతిక చేతనత్వమే కాలాన్ని జయించే "భారతము" అనే రాష్ట్రాన్ని తయారు చేసింది. ఇటువంటి రాష్ట్రాన్ని రాజనీతిక, మహత్వాకాంక్షలతో సంఘటితము చేయుట అసాధ్యం. సాంస్కృతిక సూత్రములతో పెనవేసుకొని ఉన్న ఈ రాష్ట్రము విశ్వానికి ఒకప్పుడు మకుటాయమానంగా ఉండేది, తిరిగి అయి తీరుతుంది. దీని కొరకు కావలసిన రాష్ట్రీయ ఏకత్వ లక్ష్యసాధన, అశ్వమేధములాంటి విరాట్ యజ్ఞ అనుష్ఠానాల ద్వారా మాత్రమే సుసాధ్యం కాగలదు.

## అశ్వమేధము యొక్క దిగ్విజయము

అశ్వమేధముతోపాటు అవిచ్ఛిన్నంగా దిగ్విజయయాత్ర కలసి ఉంటుంది. దిగ్విజయ యాత్ర పూర్తిచేయకుండా, అశ్వమేధ యజ్ఞానికి కావలసిన ఆధారమేలేదు.

విజయము అనే పదము వినగానే ఏదో యుద్ధములో విజయము పొందుట అనే భావము వస్తుంది. దీనికి కారణము మన ఆలోచనా విధానము దేవసంస్కృతి ఆలోచనా విధానము నుంచి దూరమయి పోవటమే. ఇక్కడ ఆత్మ విజయము - మనోజయము, సర్వశ్రేష్ఠ విజయముగా గుర్తించబడినది. "జీవితాన్నే ఒక యుద్ధముగా స్వీకరించి అసురీ పాశవిక శక్తులపై విజయాన్ని పొందుటయే నిజమైన విజయముగా గుర్తించ బడుతోంది.

అశ్వమేధ ప్రకరణములో సాంస్కృతిక దిగ్విజయ విధానమే ఉన్నది. దేశకాల పరిస్థితులకు అనురూపంగా కొన్ని సాంస్కృతిక అనుశాసనాలు అనివార్యం అని గుర్తించి వాటిని వ్యక్తి వ్యక్తి వరకు విస్తరింపజేసేవారు. పాటించవలసిన నియమాలను, నిర్ధారణలను లోహఫలకాల మీద (metal plates) చెక్కి యజ్ఞాశ్వము మీద స్థాపించేవారు. అశ్వము అన్ని క్షేత్రాలకి తిరిగేది. ఋషులు, శూరవీరుల ద్వారా ఘోషింపబడిన యజ్ఞాశ్వము మీద స్థాపించిన ఈ సూత్రాలను చదివి ప్రజలు అనుసరించేవారు. ఇది ఒక విశుద్ధమయిన సాంస్కృతిక అభియానము. శక్తిని ఉపయోగించి మనుష్యులను ఆధీనము లోనికి తెచ్చుకునే వ్యక్తికి అశ్వమేధము చేయుటకు అర్హత ఉండదు.

స్కంధపురాణములోని ఒక కథ ఇంద్రుని మీద కోపించి దేవగురువు బృహస్పతి అజ్ఞాత స్థలమునకు వెళ్ళి తపస్సు మొదలెట్టారు. ఇంద్రుడు దుఃఖితుడై వారిని వెదకటం మొదలెట్టాడు. రాజ్యము అస్తవ్యస్తమవడం మొదలయింది. సమయము చూసి పాతాళ అధిపతి అయిన బలి స్వర్గలోకాన్ని జయించాడు. స్వర్గ వైభవాన్ని తన రాజ్యానికి తీసుకువెళ్ళాడు. కాని లక్ష్మీ సహితంగా అన్ని దివ్యపదార్థాలు మాయమయ్యాయి. స్వర్గసుఖాలు లుప్తమయిపోవడం వల్ల దఃఖితుడైన బలి తన గురువైన శుక్రాచార్యుల వద్దకు వెళ్ళారు. ఆయన అశ్వమేధ యజ్ఞము చేయకుంటే నీవు స్వర్గసుఖాలను పొందలేవు. వంద అశ్వమేధ అనుష్ఠానాలు పూర్తి అయిన తరువాత నీవు ఇంద్ర సమానుడవై నీవు స్వర్గీయ సుఖములను పొందగలవు అన్నారు.

ఈ కథ ద్వారా లౌకికమైన దిగ్విజయ అర్థము తప్పు అని తెలుస్తోంది. ఎందువల్లనంటే స్వర్గమును గెలిచాక కూడా బలి ఆ లబ్ధి పొందలేకపోయాడు. యజ్ఞీయ సద్భావనల ద్వారా ప్రేరేపింపబడిన సాంస్కృతిక విజయమే స్వర్గీయ పదార్థాలను అనుభవించే పాత్రను ఇస్తుంది.

మహాభారతములోని అశ్వమేధిక పర్వము కూడా ఈ వివరణే ఇస్తుంది. యజ్ఞాశ్వముతోపాటు అర్జునుణ్ణి పంపిస్తూ యుధిష్ఠిరుడు ఈ విధముగా నిర్దేశించాడు. "ఎవరైనా రాజు అశ్వమేధ ఘోషణలను స్వీకరించకపోతే యుద్ధము చేయవద్దు వారిని సకాలంలో యజ్ఞమునకు రమ్మని ఆహ్వానించు "ఆయన నమ్మకం ఏమిటంటే ఒకవేళ ఎవరైన భ్రమ కారణంగా అసమ్మతి తెలిపినప్పటికీ యజ్ఞీయ వాతావరణములో ఋషులు వీర పురుషులు ఒప్పుకొనుటవల్ల వీరు కూడా సమ్మతి తెలుపుతారు.

అశ్వమేధానికి అనురూపమైన దిగ్విజయ యాత్ర బుద్ధ భగవానుని ధర్మచక్ర ప్రవర్తనము / ఆదిశంకరాచార్యుని శంకర, దిగ్విజయాన్ని మాత్రమే తీసుకొనగలము. ఈనాటి పరిస్థితులలో మానవాళికి స్వర్గీయ వాతావరణాన్ని తిరిగి నిర్మించగలిగే సాంస్కృతిక సూత్రాలు కావాలి. ఋషులు మనకి అందించిన దేవసంస్కృతి యొక్క సమయానుకూల వ్యావహారిక సూత్రాలను వ్యక్తి వ్యక్తికి అందివ్వటమే ఈనాటి అనివార్యమైన షరతు దీని ఆధారంగానే వ్యక్తులలో దేవత్వ వికాసము భువిపై స్వర్గావతరణ సంభవమవుతుంది, ఈ లక్ష్యముతోటే అశ్వమేధిక అనుష్ఠానాలు ప్రారంభింపబడ్డాయి.

- సశేషం

**ఆలోచనల ఆచరణ పరిష్కృతం కానిదే ఉపాసన, కర్మకాండ అంతా నిరర్థకం**


## పరమపూజ్య గురుదేవుల సుదీర్ఘయాత్ర-42

# విశ్వానికి ఆశ్రయం ఆ ఆశ్రమం-2

*(గతసంచిక తరువాయి...)*

### "సైనిక్" పత్రిక యాజమాన్యాన్ని శ్రీరామ్ స్వీకరించుట

మూడు రోజులు శాంతినికేతన్‌లో గడిపి శ్రీరామ్ తిరిగి తాను పనిచేసెడి ప్రదేశానికి చేరుకున్నాడు. అప్పటికే "సైనిక్" దినపత్రిక ముద్రణా విధానంలో కొన్ని మార్పులు చేపట్టుట ఆగ్రాలో ప్రారంభమైంది. దేశ స్వాతంత్ర్యసమరయోధులు పత్రికకై తిరిగి చందాలు చెల్లించుట ప్రారంభించారు. శ్రీరామ్ తిరిగి పత్రిక పనిలో చేరాడని తెలుసుకున్న పాలీవాల్జీ శ్రీరామ్‌ను పిలిచి "సైనిక్" పత్రికను ఎడిట్ చేసి, దాని యాజమాన్య బాధ్యతలను అప్పగించాలని ప్రతిపాదించాడు. దీనికి, స్పందిస్తూ "ఈవిధంగా అయినచో తాను తన సమయాన్నంతా దినపత్రికను తీర్చిదిద్దుటలోనే వెచ్చించి, దేశస్వాతంత్ర్యపోరాట ఉద్యమంలో పాల్గొనజాలననెడి" దానిని శ్రీరామ్ వ్యక్తపరచాడు.



పై దానికి జవాబిస్తూ పాలీవాల్జీ శ్రీరామ్‌తో "నీ సందేహాన్ని గురించి వ్యధ చెందవలదు. సైనిక్ దినపత్రిక నడుపుటే ఒక ఉద్యమం. భారత మాత కన్న బిడ్డల కష్టనష్టాలను, వ్యధలను వ్యక్తం చేయుట ప్రధానం కాదా? అని శ్రీరామ్‌ను ప్రశ్నించాడు. తదుపరి శ్రీరామ్‌ను తన గదికి తీసికొని వెళ్ళి ఏకాంతంగా ఇలా అన్నాడు - "రానున్న కాలంలో సైనిక్ కార్యాలయం స్వాతంత్ర్య ప్రధాన ఉద్యమాలకు, కార్యకలాపాలకు ప్రధాన కేంద్రం కానున్నది. స్వాతంత్ర్య ఉద్యమకారుల మధ్య వారి కార్యకలాపాలను పరస్పర సహకారం ద్వారా క్రమబద్ధీకరించి సఫలీకృతం సాధిస్తుంది. దీనికి నీవు మాత్రమే సమర్థుడవు - అందువలన నిన్ను ఎన్నుకొనుట జరిగింది" అని చెప్పాడు.

వారిద్దరి సంభాషణలో మరో నిర్ణయం తీసికొనుట జరిగింది. "ఉద్యమకారులలో నీవు "శ్రీరామ్" అని బహు కొద్దిమందికి మాత్రమే తెలుసు. అందువల్ల నిన్ను "మట్టా" అనెడి మారుపేరుతో ప్రచారంలోనికి తెస్తాం" ఇది మాకు ఎంతో సహాయపడుతుంది" అని పాలీవాల్జీ శ్రీరామ్‌తో చెప్పాడు. ఆనాటి నుండి శ్రీరామ్ తన మారుపేరు మట్టాతో సైనిక్ పత్రికలో పద్యాలు, కథలు వ్రాయసాగాడు. శ్రీరామ్‌కు పై పద్ధతి నచ్చింది. "సైనిక్" పత్రిక దినపత్రికగా ప్రచురిత మవుతూ, ఉద్యమకారులకు నిలయంగా మారినచో ఉద్యమం తీవ్రరూపం దాల్చినప్పుడు తాను స్వేచ్ఛగా పనిచేయగలనా? అనెడి సంశయం ఆయనను పీడించసాగింది.

శ్రీరామ్ వెలిబుచ్చిన సంశయం పాలీవాల్జీకి అర్థమయ్యింది. పత్రిక బాధ్యత తీసికొన్నప్పటికీ శ్రీరామ్ కేవలం పత్రిక నిర్వహణకే బందీ కాకూడదనెడి శ్రీరామ్ తలంపు. ఉద్యమ స్థితిని బట్టి తీవ్రతను బట్టి శ్రీరామ్ పత్రిక పనులకే బందీకాక, ఉద్యమంలో పాల్గొనుటకు వీలుగా, శ్రీరామ్‌కు ఒక సహాయకుని నియమించాలని నిర్ణయించుట జరిగింది. దీనికై ప్రభుదయాల్ అగర్వాల్‌ను ఎంపిక చేశారు.

రేడియోద్వారా జాతీయ అంతర్జాతీయ వార్తలు ఎప్పటికప్పుడు తెలుసుకొనుచున్నారు. నగర వార్తలు సేకరించుటకై ప్రధాన విలేకరి లేక విలేకర్లు లేరు. ఆ రోజులలో ప్రాంతీయ దిన పత్రికలకు సహాయక ఎడిటరు లేక విలేకర్లను నియమించెడి ఆనవాయితీ లేదు. జాతీయ పత్రికలు మాత్రమే విలేకర్ల సేవలు వినియోగించుకొనెడివి. వార్తా ఏజన్సీల ద్వారా మరియు రేడియో ప్రసారాల ద్వారా సేకరించెడి సమాచారాన్ని ప్రాంతీయ పత్రికలు వాడుకొనేవి. ప్రభుదాస్ అగర్వాల్‌కు రేడియో ప్రసారాల నుండి వార్తల సేకరించుట మరియు ముద్రణలోని తప్పొప్పుల దిద్దెడి పనిని అప్పగించారు.

దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో పాలుపంచుకుంటూ పత్రికకు వార్తలు వ్రాసెడి పనులలో ఒక ప్రక్క మునిగిపోతూ, మరోవైపు తీవ్ర తపోసాధనల చేస్తూ మట్టాజీ (శ్రీరామ్) ఆత్మ శోధన చేసికుంటూ ఉండేవాడు. శాంతినికేతన్ నుండి తిరిగి వచ్చిన

**సంకల్ప బలం దృఢంగా ఉన్నప్పుడు, శ్రద్ధ నిష్ఠలకు లోటు లేనప్పుడు ప్రశాంతత కలిగి మానసిక ఉద్విగ్నత సమసిపోతుంది**

తరువాత, దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించినంతనే శ్రీరామ్ తన పాత్ర ఏమిటి తాను ఏమి చేయాలనెడి దానిని గూర్చి తరచూ ఆలోచిస్తూ ఉండేవాడు. ఈ సందర్భంగా శాంతినికేతన్ సందర్శన సమయంలో రవీంద్రనాథ్ ఠాగూర్ దేశ స్వాతంత్ర్య పోరాటంలో క్రియాశీలక పాత్రను పోషించనందులకు ఠాగోర్‌ను తప్పుపడుతూ అమితారాయ్‌ను దీనిపై ప్రశ్నించగా, లభించిన జవాబు తనకు సంతృప్తినిచ్చింది. విద్యాసంస్థల కొరకు పనిచేస్తూ సాంస్కృతిక, నైతిక విలువలను ప్రజలలో, సమాజంలో పెంపొందించుటకై కృషి చేయుటను కూడా "రాష్ట్ర సాధన" క్రిందికి వస్తుంది. ఇది స్వాతంత్ర్య ఉద్యమ పోరాటానికి ఎంత మాత్రం తీసిపోదు అని శ్రీరామ్‌కు అర్థమయ్యింది.

జులై 1933లో ఒకనాటి ఉదయం, పట్టణంలో చాలా కోలాహలముగా ప్రజలు కనిపించుచున్నారు. ఈ వాతావరణం అంతకు క్రితము రోజు సాయంత్రం నుండి ఉంది. దేవాలయంలో వేడుకలు జరుపుటకై ఏర్పాట్లు చేయుచున్నారు. ఆరోజు శ్రావణ పౌర్ణమి శివునికి ఆ మాసమంతా పూజలు నిర్వహిస్తారు. శ్రీరామ్ కుతూహలం కొద్దీ ఆ రోజు విశిష్టతను తెలిసికోగా శ్రావణమాసంలోని ఆఖరి సోమవారమని తేలింది. ఆరోజు శ్రీరామ్ ఉపనిషత్తుల చదువుటలో నిమగ్నమైనాడు.

కఠోపనిషత్ చదువుటలో లీనమైన శ్రీరామ్‌నకు నచికేత పాత్రపై మక్కువ పెరిగింది. యజ్ఞానంతరము నచికేతుని తండ్రియైన ఉద్ధాలక ముని ముసలి ఆవులను దక్షిణగా దానం చేస్తున్నాడు. తండ్రి చర్యల గమనించుచున్న నచికేతుడు "నాన్న! నేను కూడా నీ ఆస్తిలో ఒక భాగాన్ని నన్ను ఎవ్వరికి దానమిస్తావు?" అని ప్రశ్నించాడు. దీనికి ఉద్దాలకుడు ప్రతిస్పందించనందున, నచికేతుడు తిరిగి అదే ప్రశ్నను వేయగా తండ్రి విసుగుజెందాడు. యజ్ఞము చేసిన వ్యక్తి దక్షిణగా ముసలి ఆవులనిచ్చుట ద్వారా తగిన యజ్ఞ ఫలితాన్ని పొందజాలడని తలంచిన నచికేతుడు తండ్రిని హెచ్చరింపనెంచి, యువకుడు ఉత్సాహవంతుడైన తనను యజ్ఞ దక్షిణగా ఇచ్చిన సత్ఫలితాలు కలుగునని కావున తనను ఇమ్మని తండ్రిని స్వచ్ఛందగా కోరాడు. దీనికి కూడా తండ్రి సమాధానమివ్వలేదు. దీనితో కోపగించు కొన్న ఉద్దాలకుడు, కుమారుడైన నచికేతుని యమునికి దక్షిణగా ఇచ్చెదనన్నాడు.

ఉద్దాలకుని నోటివెంట వెలువడిన పై మాటలకు వెను వెంటనే నచికేతుని శరీరము నిర్జీవంగా మారింది. సూక్ష్మ రూపియై నచికేతుడు, యముని ఇంటిగుమ్మం వద్ద నిలచాడు. యముడు అచ్చట లేనందున, యముడు వచ్చేటంత వరకు, నచికేతుడచ్చటే నిలబడ్డాడు. మూడు రోజుల అనంతరం నచికేతుడు, యముని కలిసికోగా వారి మధ్య ఈ సంభాషణ సాగింది. ఈ కథ సాగుతున్న కొలది శ్రీరాముడు తన బాహ్య చైతన్యాన్ని కోల్పోయాడు. శ్రీరామ్ కన్నుల ముందు మరో ప్రపంచం దృగ్గోచరం కాసాగింది. శ్రీరామ్‌కు, తాను నచికేతుడుగా మారినట్లు, మూడు వరాల కోరుకొమ్మని యముడు తనను అడుగుచున్నట్లు కనపడసాగింది. ఎందుకు మూడు వరాలు అడగమన్న దానికి కారణం, బ్రాహ్మణ బాలుడైన నచికేత కుమారుని మూడు దినాలు తన వాకిలివద్ద నిలిపి ఉంచి నందులకు ప్రాయశ్చిత్తంగా యముడు నచికేతుని మూడు వరాలు కోరుకొమ్మన్నాడు. యముడు ఈ రీతిగా చెప్పసాగాడు. "ఓ! అగ్ని దేవతా! నాకు అతిథిగా ఇచ్చటికి వచ్చావు. నిన్ను మూడు రాత్రులు బయట నిలిపి ఉంచినందులకు నేను చింతిస్తున్నాను. ఒక్కొక్క రాత్రికి ఒక్కొక్క కోరికను అడుగు – నీకు మూడు వరాలనిచ్చుటకు సంసిద్ధంగా ఉన్నాను.

## తానే నచికేతునిగా అనుభూతికి లోనైన శ్రీరామ్

శ్రీరామ్ క్రమంగా తానే నచికేతునిగా అనుభూతి చెందుతూ, సినిమాలో నచికేతుని పాత్రను తాను పోషించు చున్నట్లుగా భావానుభూతికి లోనుకాసాగాడు. ఎటువంటి మూడు వరాలను అడగాలని అని శ్రీరామ్ తీవ్రంగా ఆలోచించసాగాడు. మూడు వరాలు తన అంతఃకరణలో మెదలుతూ ఉండగా దేనిని ముందు అడగాలి అనెడి సందిగ్ధానికి లోనయ్యాడు. అప్పుడు యముడు ఇలా అన్నాడు – "మొహమాటపడకు బ్రాహ్మణకుమారా! నీవు ఏది అడిగితే దానిని ఇచ్చుటకు సిద్ధంగా ఉన్నాను"

శ్రీరామ్ వెనువెంటనే "నా మాతృదేశాన్ని ముష్కరులు పాలిస్తున్నారు. వారిపాలన అంతమై నా పుణ్యభూమి భారతదేశం స్వతంత్ర దేశమవ్వాలి అన్నాడు."

"తథాస్తు" అన్నాడు యముడు. "ఇచ్చట నుండి నీవు తిరిగి వెళ్ళేసరికి దేశబానిస సంకెళ్ళు తొలగిపోనారంభిస్తాయి. ఇండియా శక్తివంతమవుతుంది. తన కాళ్ళపై తాను నిలబడితే

**మనలోని ప్రసన్నత, సంతుష్టి ఇతరుల ప్రభావితం చేస్తాయి - విరోధులను మిత్రులను చేస్తాయి**

ప్రతిది అప్రయత్నంగా ఒనగూడుతుంది. దైవీ ప్రణాళిక అనుసారము ఇండియా స్వాతంత్ర్యాన్ని పొందుతుంది అనెడి దానిని ప్రజలు తెలుసుకోలేరు. ఇప్పుడు రెండవ వరాన్ని కోరుకో!" అన్నాడు యముడు.

శ్రీరామ్ అడగసాగాడు. స్వర్గనివాసులకు ఎటువంటి భయం ఉండరాదు. చివరకు యముని గురించి కూడా! వారంతా ఆనందంలో మునిగిపోయి విచారాలు తొలగి, ఆకలి దప్పులు లేనివారవ్వాలి. మీకు అగ్ని విద్య తెలుసు. ఈ విద్యద్వారా అటువంటి ఆనందమయస్థితిని పొందవచ్చు ఆ జ్ఞానాన్ని నాకు బోధించండి."

యముడు ఆ విద్యను బోధించాడు. దీని ద్వారా స్వర్గీయ వాతావరణాన్ని అనుభవంలోనికి తెచ్చుకోగలం. ఈ విద్య వ్యాప్తి ద్వారా ధర్మార్థ కామ మోక్షాలసాధన ద్వారా మనుష్యులలో దైవత్వాన్ని నింపి, భూమిపై స్వర్గావతరణను గావింపవీలున్నది. యముడు సూచించిన సిద్ధాంతాన్ని శ్రీరామ్ తిరిగి చెప్పాడు. భవిష్యత్‌లో ఎదుర్కొనబోయెడి సమస్యలన్నింటి పరిష్కారానికి ఈ సిద్ధాంతం సహాయకారిగా ఉంటుంది అన్నాడు యముడు. ఈ సూత్రాలు కారుచీకటిలో కూడా వెలుగు మార్గాన్ని చూపిస్తాయి అని చెప్పాడు.

యముడు మాట్లాడుతూ "ఇప్పుడు మూడవ వరాన్ని అడుగు" అన్నాడు. శ్రీరామ్ బదులిస్తూ "మీ మూడవ వరం ఆశీర్వాదంగా వచ్చి నాకు ఆత్మ విద్య తెలియజెప్పాలి. (తనను తాను తెలిసికొనెడి జ్ఞానం) తద్వారా నాలోని అనుమానాలన్నీ మాయమవుతాయి. ఈ ప్రపంచంలోని సత్యమేమిటి? ప్రాణమనగానేమిటి? పదార్థానికి మరియు చైతన్యానికి గల తేడా ఏమిటి?" అని ప్రశ్నించాడు. యముడు బదులిస్తూ "ఈ జ్ఞానం నిగూఢమైనది మరియు విశ్లేషణకు అందనిది. కావున ఇది తప్ప మరో విషయాన్ని అడుగు. భోగభాగ్యాలడుగు, అధికారమడుగు, అంతస్తులడుగు, కీర్తిప్రతిష్ఠలనడుగు" అన్నాడు. శ్రీరామ్ దృఢంగా పలుకుతూ "అక్కర్లేదు! ఆత్మవిద్యను తెలిసికొనుట తప్ప మరేమి వద్దు. దయతో చెప్పండి. నేను దీనికి అర్హుడను. కానిచో అర్హతను పొందుతాను" అన్నాడు.

బ్రాహ్మణ కుమారా! ఈ విద్య తెలియకుండా కూడా నీవు మోక్షాన్ని పొందగలవు. నీవు కావాలన్నచో మోక్షాన్ని అడుగు- ఆత్మ విద్య గురించి మరచిపో అన్నాడు యముడు. కాని శ్రీరామ్ తన పట్టువీడలేదు. దృఢంగా అడిగాడు - "నాకు మోక్షం కలిగినా కలుగకపోయినా, నాకు ఆ విద్యను నేర్చుకోవాలనెడి కోర్కె తీవ్రంగా ఉంది. సామాన్య జనులకు ఈ విద్యనందిస్తాను. ఈ విద్యను నేను బహిర్గతం చేస్తాను. దీనిని వందల సంవత్సరాల నుండి రహస్యంగా ఉంచి సామాన్యులను ఈ విద్యకు దూరం చేశారు"

శ్రీరాముని దృఢ సంకల్పాన్ని విన్న యముడు మెట్టు దిగి వచ్చి శ్రీరాముని కోర్కె తీర్చుటకు తన సుముఖతను తెలుపుతూ "నేను జన బాహుళ్యానికి ఈ మహావిద్యను, సంజీవని విద్యను నిన్ను మాధ్యమంగా చేసికొని అందిస్తాను" అన్నాడు.

## తాయిజీ సందేశము

శ్రీరాముడు తెలివిలోనికి తిరిగివచ్చాడు. కఠోపనిషత్తు పుస్తకం తన ముందు తెరచి ఉంది. కాని దానిని తాను చదువుట లేదు. తన కన్నులను నులిమాడు, అప్పుడు మాయమైన దృశ్యాన్ని వీడి పుస్తకం మూశాడు. తాను కూర్చున్న చోటు నుండి లేస్తూ ఉండగా మూసి ఉన్న గది తలుపును తట్టిన శబ్దం వినపడింది. తలుపు తెరచాడు. ఊరి నుండి వచ్చిన మామను గౌరవంగా పలుకరించగా "మీ అమ్మ నిన్ను తరచుగా తలచుకొనుచున్నది. ఈ పనులన్నింటిని విడచి పెట్టేయ్" అన్నాడు.

"మామయ్యా! ఈ పనుల్లో నేను పూర్తిగా లీనమైపోయాను. నేను వీటిని విడిచిపెట్టాలనుకొనుట లేదు. ఒకవేళ అనుకున్నా వీనిని విడచిపెట్టుట నా వల్ల కానిది" అని బదులిచ్చాడు శ్రీరామ్.

మామయ్య తన స్వంత పనిపై ఆగ్రా వచ్చాడు. "మత్తావాలా" (శ్రీరామ్) సమాచారాన్ని తెలిసికొని రమ్మని కోరింది తాయిజీ!" అంటూ "నీ కుమారుడు ఓంప్రకాష్ సంవత్సరం పిల్లవాడయ్యాడు. వాడి భవిష్యత్తును గురించి ఆలోచించవా?" అన్నాడు.

తాయిజీ పిల్లవానిని తన వద్ద తాను ఇష్టపడినంతవరకు ఉంచుకొనవచ్చును. ఆ పిల్లవాని చదువు పట్టణంలో కొనసాగించదలచినదా తగిన ఏర్పాట్లు చేయబడతాయి.

*- అనువాదం: వేణుగోపాలరెడ్డి*

*(సశేషం)*

**ఎవరు స్వంతం? ఎవరు పరులు? ఈశ్వరుని దృష్టిలో అంతా స్వంతమే**

# జ్యోతిర్విజ్ఞానమునకు పునర్ వైభవం తీసుకురావల్సిన సమయం ఆసన్నమైనది-2

*(గత సంచిక తరువాయి...)*

అంతరిక్షగ్రహాల ప్రభావమును అధ్యయనము చేస్తున్న క్రమములో 'బోస్ ఇన్స్టిట్యూట్ కలకత్తా'లో పనిచేస్తున్న మైక్రో బయాలజి శాస్త్రవేత్తలు తమ పరిశోధనా సారాంశముగా 'సౌర మండలములోని వికిరణముల చేత వాయుమండలములో కదలాడే జీవాణువులు నియంత్రించబడతాయి' అని చెప్పారు. 16.02.1980 ముందు వచ్చిన సంపూర్ణ సూర్యగ్రహణము సందర్భముగా కలకత్తాలోని ప్రఖ్యాత 'బొటానికల్ గార్డెన్'లోని వాయుమండలములో బాక్టీరియా మరియు ప్రాణాంతక క్రిములు అధిక సంఖ్యలో కనిపించాయి. సూర్యగ్రహణమునకు ముందు–ఆతరువాత విభిన్న జీవాణువుల మీద అధ్యయనము సాగించిన మీదట తేలినదేమిటంటే –సూర్యగ్రహణ వేళ వీటి సంఖ్య ఇబ్బడిముబ్బడిగా పెరగటమే కాదు, ముందుకన్నా కూడా వాటిలో చంపగలిగే సామర్థ్యము బాగా వృద్ధిచెందినది. రీవావిశ్వవిద్యాలయములోని 'విక్రమ్‌ఫిజిక్స్ సెక్టర్ ఆఫ్ ఎన్విరాన్‌మెంట్ బయాలజీ' సాగించిన వైజ్ఞానిక పరీక్షల ద్వారా వెల్లడైన ఫలితములు ఈ విషయమును మరింత బలపరిచాయి. సూర్యగ్రహణ కాలములో నీటిమీద మూతపెట్టకుండా ఉన్నచో విభిన్నరకములైన విషాణువులు మరియు జీవాణువులు ఆ నీటిలోకి చేరి నీటిని విషమయముగా మార్చివేస్తాయి అని కనుగొన్నారు ఆ శాస్త్రవేత్తలు.

మన భారతీయ ఋషులు ఈ తథ్యమును అలనాడే ఎఱుగుదురు. సూర్య–చంద్రగ్రహణవేళ సంభవించే ఈ పరిణామములను దృష్టిలో పెట్టుకుని వారు సూర్యగ్రహణ లేదా చంద్రగ్రహణ కాలములో ఎట్టి ఆహారమునూ భుజించ రాదనే షరతును పెట్టారు. ఆనాడు ఉపవాసము ఉండాలనే ఒక పరంపరను స్థాపించారు. తత్త్వవేత్తలైన ఋషిగణము సౌర మండలములోని గ్రహములు భూమి మీద చూపించే పరిణామ ములను గురించి తెలిసిన విజ్ఞులు!! గ్రహణ కాలములో అన్నపానాదుల స్వీకరణ శరీరమునకు చేటు చేస్తుందని ఋషిసముదాయమునకు తెలుసు! అంతరిక్షము నుండి వచ్చే దుష్ప్రభావములను తప్పించుకునేందుకుగానూ వ్యక్తిగత–సామూహిక స్థాయిలో ఉపాసన–సాధనలను చేపట్టేవారు. ఈనాడు కూడా వ్యక్తిగత స్థాయిలో అవన్నీ చెయ్యటము రివాజుగా ఉన్నది. సూర్యచంద్ర గ్రహణాల సందర్భముగా నదీస్నానము చెయ్యటము అన్నది ఒక ఆచారముగా వస్తున్నది. ప్రవహిస్తున్న నీటిలో ప్రాణశక్తి మెండుగా ఉంటుందని వైజ్ఞానికులు విశ్వసిస్తారు. గ్రహణకాలములో వాయు మండలములోని విషాణువులు శరీరము మీద దాడిచేస్తాయి. నదీస్నానము చెయ్యటము వలన నీటిలో ఉండే ప్రాణశక్తి ఆ విషక్రిములను చంపివేస్తుంది.

గ్రహణకాలములో చేసే ఉపవాసము–స్నానము–ఉపాసనలను కొంతమంది అజ్ఞానులు లెక్కచెయ్యకపోగా వృథా అని భావిస్తారు. అయితే ఆధునిక వైజ్ఞానిక తథ్యములు **'ఋషి గణము అందించిన ఆ సమగ్ర క్రియలన్నీ వైజ్ఞానికమైన రీతిలో శారీరిక సంరక్షణ చేయుటకు–ఉపచారము నొనర్చుటకు తగిన శక్తి గల మాధ్యమము'**లని నొక్కిచెపుతున్నాయి. అందుచేత భౌతిక అధ్యయనము–విశ్లేషణ–ఉపచారము కొరకు చెయ్యబడే ఆ ప్రయత్నములతో పాటు ఖగోళములోని గ్రహాల ప్రభావమును గూర్చిన జ్ఞానసముపార్జన, ఔపచారిక ఉపాయముల అన్వేషణ కూడా తప్పకుండా సాగాలి. జ్యోతిర్విజ్ఞానము ద్వారానే ఈ జ్ఞానమంతా బోధపడుతుంది అని వేరుగా చెప్పనవసరము లేదు కదా! మానవుడి ప్రకృతి, అతని స్వభావము జ్యోతిర్వి జ్ఞానముతో చాలా గాఢముగా ముడిపడి ఉన్నాయి. దీనిద్వారా పిండాండ–బ్రహ్మాండము; వ్యష్టి–సమిష్టి; ఆత్మ–పరమాత్మల సంబంధమును సమ్మిళితముగా అధ్యయనము చేయుట జరుగుతుంది.

విశ్వములో ఉండే గ్రహనక్షత్రములు, తారలు, రాశులు, మందాకినులు, నీహారికలు మరియు మానవులు, ప్రాణికోటి, వృక్షములు, కొండలు మొదలైనవన్నీ ప్రత్యక్ష–పరోక్ష రూపములో ఒకదానినొకటి ప్రభావితము చేసుకుంటాయి, ఆకర్షించు కుంటాయి. మనిషి జీవితము మీద ఈ గ్రహ నక్షత్రముల సమ్మిళిత ప్రభావము పడుతుంది. ఇవి ఒకసారి కష్టములను తెచ్చిపెడతాయి. మరొకసారి కష్టమును తొలగిస్తాయి. మానవుడు చేసే శుభాశుభకర్మల ఫలితముగానే ఇదంతా జరుగుతున్న ప్పటికినీ, ఆ కర్మఫలము ఏదో ఒకనాడు తప్పకుండా వచ్చే

**ఆత్మజ్ఞానం ప్రకాశిస్తే అజ్ఞానాంధకారం పటాపంచలవుతుంది**

తీరుతుంది. జ్యోతిర్విద్యను అభ్యసించి, దానిని వినియోగించుకునే దైవజ్ఞులకు మానవ జీవితములోని అన్ని రంగములను గురించిన లోతైన అంతర్దృష్టి ప్రాప్తిస్తుంది.

కాలక్రమములో జ్యోతిర్విద్యకు పట్టిన దుర్గతి అని అనండి లేదా స్వార్థపరుల స్వార్థము అనైనా అనండి. ఏదైనాసరే మహోన్నతమైన జ్యోతిర్విద్య, అద్భుతమైన విజ్ఞానము యొక్క ఔన్నత్యము మసకబారింది. అది ఆటుపోట్లకు గురై ఎన్నో ఎదురు దెబ్బలు తిన్నది. అల్పజ్ఞులు అంటే మిడిమిడి జ్ఞానమున్న వారు, స్వార్థపరుల చేతిలోపడి జ్యోతిర్విద్య యొక్క వన్నె తగ్గింది. **జ్యోతిర్విద్య యొక్క మూలభూతమైన సిద్ధాంతము కర్మఫల విధానము మరియు ఆధ్యాత్మికతత్త్వదర్శనము!!** ఈ రహస్యము బోధపడని అజ్ఞానులు దీని నిజస్వరూపమును మార్చివేశారు. తత్కారణముగా నేడు జనులు జ్యోతిర్విద్య పేరు చెపితేనే భయపడుతున్నారు. లాభపడటానికి బదులు కష్టములను ఎదుర్కొంటున్నారు.

గడచిన కాలములో జ్యోతిర్విద్య యొక్క సిద్ధాంతపరమైన జ్ఞానము-విజ్ఞానము ప్రపంచములో మూలమూలలా ప్రాచుర్యమును పొందినది. ఈక్రమములో ప్రపంచములోని పలు ప్రదేశములలో ఖగోళములోని గ్రహనక్షత్రముల కదలికలను అధ్యయనము చేసి, పరిశీలించుటకుగానూ విలక్షణమైన అంతరిక్షపరిశోధనాశాలలు నిర్మించ బడినాయి. అలనాడు నిర్మించిన ఆ ప్రయోగశాలల నిర్మాణశైలి, వాటిలో ఉన్న ప్రత్యేకతలు నేడు కూడా వైజ్ఞానికులకు అంతుచిక్కని రహస్యములుగానే మిగిలి ఉన్నాయి. గణితమును ఆధారముగా చేసుకుని ఈజిప్ట్‌లోని పిరమిడ్‌లు సూర్యచంద్రగ్రహ నక్షత్రముల పరిశోధనా శాలలుగా నిర్మించబడినాయి అన్న దానికి అనేక ఋజువులు లభించాయి. ఇంగ్లండ్‌లోని స్టోన్‌హేన్ నుండి మొదలై బర్ముడా వరకూ 2,500 కి.మీ మేర వ్యాపించి ఉన్న ప్రాంతము ఏవో అంతరిక్షశక్తులకు కేంద్రమని భావించ బడుతున్నది. అక్కడున్న అత్యంత విశాలమైన తొమ్మిది పెద్ద పెద్దరాళ్ళు సూర్యుని యొక్క విభిన్న అంశములకు సంకేతములుగా ఉంటాయి. ఒకానొకనాడు ఇది ఖగోళపరిశోధనాశాలగా ఉండేదని విశ్వసిస్తున్నారు. ఆ రాళ్ళ ఆధారముగా ప్రతి 9 సంవత్సరములకు సౌరమండలచక్ర గమనమును అధ్యయనము చెయ్యవచ్చు.

భారతదేశములో కూడా చాలాచోట్ల అటువంటి అంతరిక్ష ప్రయోగశాలలు (నక్షత్రశాలలు) ఎన్నో స్థాపించబడినవి. అయితే **విదేశీయులు ఆక్రమణ చేసి దేశములో ఉన్న ఎన్నెన్నో గొప్ప గొప్ప సాంస్కృతిక కేంద్రములను, వారసత్వసంపదను ధ్వంసము గావించారు. ముఖ్యముగా అంతరిక్ష పరిశోధనా శాలలను నేలమట్టము చేశారు. ఢిల్లీలోని కుతుబ్‌మీనార్ అతి ప్రాచీనకాలములో విశ్వవిఖ్యాత అంతరిక్షపరిశోధనాశాలగా పేరుగాంచి మొగలులు దానిని ముట్టడించి ధ్వంసము చేశారని అనేకమంది పరిశోధకులు, చారిత్రక రచయితలు తమ పరిశోధనలసారముగా దేశమునకు ఎలుగెత్తి చాటి చెపుతున్నారు.** ఈ అంతరిక్ష పరిశోధనా శాలకు మేరుస్తంభము వంటి కుతుబ్‌మీనార్ మాత్రమే నేడు మనకు మిగిలింది. విక్రమాదిత్య చక్రవర్తి సభలోని నవరత్నములలో ఒకరైన విశ్వ విఖ్యాత జ్యోతిర్విద్యా ఆచార్యుడు వరాహమిహిరుడు ఖగోళ పరిశోధన నిమిత్తము ఈ ఎత్తైన స్తంభమును చక్రవర్తి సహాయముతో కట్టించాడు. ఢిల్లీకి దగ్గరలో గల మిహిరావళి (మహారౌలీ) గ్రామము మిహిరాచార్యులవారి పేరుమీద నిర్మించబడినది.

సుమారు 2,200 సంవత్సరములకు పూర్వం వరాహ మిహిరుడు 27 నక్షత్రములు-ఏడు గ్రహములు-ధ్రువతారను గూర్చి తెలుసుకునే నిమిత్తము మరియు వాటికి సంబంధించిన విషయములను చెప్పేందుకు ఒక సువిశాల సరోవరం మధ్యన నీటిలో ఈ మేరుస్తంభమును నిర్మించాడు అని భావిస్తున్నారు. మేరుపర్వతము ఎత్తుతో సరిసమానముగా ఉండేలాగున మేరు స్తంభమును కట్టించాడు మిహిరుడు. ఏడు గ్రహములకు సూచనగా ఏడు ద్వారములు; 27 నక్షత్రముల కదలికలను చూచేందుకు క్రింది నుండి పైవరకు 27 కిటికీలు అమర్చబడ్డాయి. మేరువును నిర్మిస్తున్నప్పుడు లోపల అంతా చిమ్మ చీకటి ఉండే రీతిలో నల్లరాతిబండలతో కట్టుబడి చేశారు. ఈ స్తంభమునకు ముఖ్యమైనటువంటి 'ధ్రువద్వారము' ఉత్తరము వైపుకు ఉంటుంది. పునాది 16 అడుగులు. ఎత్తు 84 అడుగులు. ఈ స్తంభము $5^0$ దక్షిణ-అక్షాంశము వైపుకు వాలి ఉంటుంది. ఆంగ్లేయులు పైన వంగి ఉన్న $5^0$ భాగమును కొంతమేర ఖండించివేయుట వలన ఇప్పుడది 76 అడుగులకే పరిమితమైపోయింది. జూన్ 21వ తేదీనాడు మధ్యాహ్నం 12 గంటల వేళ మేరుస్తంభము నీడ భూమిమీద పడదు. ఇదే దీనికి గల మరో ప్రత్యేకత! 21 వ తేదీన సూర్యుడు భూమధ్యరేఖ నుండి $23.5^0$లు ఉత్తర-అక్షాంశము వైపుకు పయనిస్తాడు.

**మనం శత్రువుగా భ్రాంతి చెందే వస్తువు మన స్వస్వరూపం మాత్రమే**

ఈ కారణముగానే 21వ తేదీన స్తంభము యొక్క నీడ భూమిమీద పడదు.

దేశ రాజధాని ఢిల్లీ భూమధ్యరేఖకు $28.5^0$ ఉత్తర–అక్షాంశము వైపుగా ఉంటుంది అన్నది సర్వవిదితమే. ఈ రెండింటి అక్షాంశముల మధ్య $5^0(28.5^0\text{-}23.5^0=5^0)$ వ్యత్యాసము ఉంటుంది. ఈ తథ్యమును దృష్టిలో పెట్టుకునే **జ్యోతిష్య గణననుసరించి మేరుస్తంభ నిర్మాణములో పైభాగము $5^0$ దక్షిణము వైపు వాలి ఉండేలా నిర్మించబడినది. ఆంగ్లేయుల పాలనాకాలములో ఇంజనీర్లకు ఈ వంపుకు గల కారణము తెలియరాలేదు.** పునాది క్రుంగుట వలన స్తంభము పట్టుతప్పి ప్రక్కకు ఒరగటం చేత అది కూలిపోయే ప్రమాదముందని భావించిన ఆ ఇంజనీర్లు స్తంభ బరువును తగ్గించటానికి పైభాగమును కొంతమేర తొలగించివేశారు. **వరాహమిహురుని కాలములో ఈ స్తంభమునకు నలువైపులా మరో 27 అంతరిక్షప్రయోగశాలలు ఉండేవి. వాటిని 27 మందిరములుగా నిర్మించారు. ముస్లిం ఆక్రమణదారుడైన కుతుబుద్దీన్ ఈ మందిరములను కూల్చివేసి వాటి స్థానే మసీదులు స్థాపించి అన్నింటిమీద తన పేరును వ్రాయించుకున్నాడు.** కుతుబుద్దీన్ దుర్బుద్ధితో వాటి నామ రూపాలను మార్చివేసినప్పటికినీ మేరుస్తంభము యొక్క ధ్వంసావశేషములను చూసినచో **'ఒకనాడు అక్కడ అంతరిక్షప్రయోగశాల ఉండేది' అన్న విషయము ఈనాడు కూడా సుస్పష్టముగా తేటతెల్లమౌతుంది.** అంతేకాకుండా మేరుస్తంభము తన విచిత్రమైన ప్రత్యేకతల కారణముగా శాస్త్రవేత్తలను ఆకర్షిస్తున్నది.

వాస్తవం తెలియకుండా అల్పజ్ఞానముతో ప్రాచీన భారతీయ మహోన్నత జ్ఞానమైన జ్యోతిర్విజ్ఞానమును ఎగతాళి చేసే అల్పుల కళ్ళు తెరిపించటానికి ఈ సత్యము ప్రపంచము ముందుంచుట జరిగినది. భారతభూమిలో పుట్టిన జ్యోతిర్విద్య విశ్వమంతటికి వ్యాపించినది అన్నది నిర్ద్వందమైన, నిర్వివాదమైన సత్యము!! ఈ మహావిద్య ఎంతో పురాతనకాలములోనే వికాసం చెందిన దన్నదానికి ఋజువులు ఒక్క భారతదేశములోనే కాక; విశ్వములోని విభిన్న ప్రదేశములలో ఎన్నెన్నో భాషలలో లిపి బద్ధము గావించబడినాయి. అవన్నీ కూడా జ్యోతిర్విద్య యొక్క ఔన్నత్యమును చాటిచెపుతున్నాయి. గౌరవోపేతమైన ఈ మహా విజ్ఞానము యొక్క వైజ్ఞానికతను పునర్జీవింపజేసి, ఆనాటి వైభవమును పునఃప్రతిష్ఠించే ప్రయత్నం చెయ్యవల్సిన ఆవశ్యకత భారతీయ సంతతి పైన ఎంతగానో ఉన్నది.

ఈ మహోన్నత విజ్ఞానమును గురించి ఇక్కడ మరొక విషయము కూడా చెప్పుకోవాలి. జ్యోతిషశాస్త్రములో వర్ణించబడిన గ్రహనక్షత్రములు ఎవ్వరి సుఖదుఃఖములకు కారణము కావు. అవి కేవలము సుఖదుఃఖాలు రాబోతున్నాయి అని సూచిస్తాయి. అంతే! భగవతిపార్వతీదేవి అడిగిన ప్రశ్నకు, సందేహమునకు శంకరభగవానులు ఈవిధంగా జవాబిచ్చారు. మహాభారతములోని అనుశాసనపర్వములో ఈ వ్యాఖ్య మనకు కనబడుతుంది. అందులో ఇలా ఉంది.

**'స్థానే సంశయతిం దేవి శృణు తత్త్వవినిశ్చయమ్ ।**
**నక్షత్రాణిగ్రహాశ్చైవ శుభాశుభనివేదికాః ॥**
**మానవానాంమహాభాగేన తు కర్మకరాః స్వయమ్ ।**
**ప్రజానాం తు హితార్థాయ శుభాశుభవిధిం ప్రతి ।**
**అనాగత మతిక్రాన్తం జ్యోతిశ్చక్రేణబోధ్యతే ॥ కిన్తు తత్ర శుభంకర్మ సుగ్రహైస్తు నివేద్యతే ॥ దుష్కృతస్యాశుభైరేవ సమవాయో భవేదితి ॥ కేవలం గ్రహనక్షత్రం న కరోతి శుభాశుభమ్ । సర్వమాత్యకృతం కర్మ లోకావాదో గ్రహ ఇతి ॥ (మహాభారత, అనుశాసనపర్వం అం. 145)**

భగవాన్ శివుడు ఇలా అన్నాడు. 'హే దేవి! నీ ప్రశ్న మరియు సంశయము ఉచితమైనవే. ఓ పార్వతీ! జ్యోతిష పరమైన సిద్ధాంతమును చెపుతున్నాను. సావధానముగా ఆలకింపుము! గ్రహనక్షత్రములు కేవలము మానవుల యొక్క శుభా శుభములను సూచిస్తాయంతే! అవి స్వయముగా ఏమీ చెయ్యవు. మానవుని మేలు కొరకు జ్యోతిర్చక్రం ద్వారా భూత–భవిష్యత్తుల శుభాశుభ కర్మఫలము వివరించబడుతుంది. సత్కర్మల ఫలితము శుభగ్రహముల ద్వారా; దుష్కర్మల ఫలము చెడుగ్రహముల ద్వారా సూచించబడుతుంది. గ్రహ నక్షత్రములు ఎవ్వరికి శుభాశుభ ఫలితములను ఇవ్వవు. మనిషి తన కర్మకు తానే కర్త! మానవుడు స్వయముగా తాను చేసిన సత్కర్మ–దుష్కర్మల వలననే సమస్త కర్మల యొక్క శుభాశుభ ఫలితములను పొందుతాడు. గ్రహములు ఏదో చేశాయి అన్న కథనము జనుల మిథ్యాప్రచారము(గాలివార్త).' కనుక మనిషి పైన చెప్పబడిన సత్యమును గ్రహించి జ్యోతిషశాస్త్ర ప్రకాశములో సదాసర్వదా శుభకర్మలలో ఉద్యుక్తుడై ఉండాలి.

– *అఖండజ్యోతి,*
*అనువాదం: శ్రీమతి లక్ష్మీరాజగోపాలు*

**సత్క్రియతలోనే ఆనందం ఉన్నది**

సూక్ష్మీకరణ సాధన - 1

# భూమిక

ఈ కాలంలో దేవతలుకూడా ప్రపంచ చరిత్రలో ఇదివరకు ఎన్నడు జరగని గొప్ప మహత్తరమైన మార్పుల కొరకు ఎదురు చూస్తున్నారు. మరి మనిషి, అతను దేనికొరకు ఎదురుచూడాలి? అతను దానికొరకు ఏమి చేయాలి? అన్నదే ఈ పుస్తకం యొక్క ముఖ్య ఉద్దేశ్యము.

దీనికి మొదట వ్యక్తి తన దృష్టిని అంతర్ముఖం చేసుకోవాలి. ఇప్పటి వ్యక్తికి తనగురించి 1/10 వంతు కూడా తెలియదు. తన వ్యక్తిత్వపులోతులను తరచి, తరచి తనలోని ఒక దివ్యమైన శక్తి కేంద్రాన్ని గుర్తించాలి. అది ఈ అనంత అవిరామ క్రియా కలాపాలకు సాక్షిగా ఉంటుంది, మార్గదర్శనము చేస్తూ ఉంటుంది (కూటస్థ చైతన్యం). ఇక్కడ నుండి ఆ వెలుగులో తన సంపూర్ణ, సమగ్ర వ్యక్తిత్వాన్ని 'దాని' నిర్దేశాలకు మాత్రమే స్పందించేటట్లు మలచుకోవాలి. ఆ తర్వాత ఆ కేంద్రంలో ఉంటూ ప్రతిప్రాణిలో, అణువులో ఉన్న ఆ కేంద్రమును స్పర్శిస్తూ, ఆ సార్వత్రిక శక్తిధారకు అనురూపంగా పయనిస్తూ వారిలో కూడా ఈ మార్పు తేవడానికి 'సూక్ష్మ' ఒత్తిడిని తేవాలి.

చాలారోజుల క్రిందట శ్రీఅరవిందో ఇలా వ్రాశారు. హిమాలయాలలో ఒక యోగి ఒక కల కన్నాడు. ఆధ్యాత్మిక కల కన్నాడు. తన సమాధిస్థితిలో Liberty (స్వేచ్ఛ), Equality (సమానత్వము), Fraternity (సౌభ్రాతృత్వము) యొక్క స్వప్నం చూశాడు. అది ఐరోపాలో ఫ్రెంచి విప్లవంగా కొన్నిరోజుల తర్వాత రూపుదాల్చింది. ఆలోచనాతరంగాలు, ఆలోచన శక్తి, ఆత్మిక చేతనత్వము మిధ్యకాదు. Ideals (ఆలోచనలు) శక్తివంతమైనవి. ఆధ్యాత్మిక సత్యాలకు రూపమైన, ఆలోచనలు ఇంకా శక్తివంతమైనవి. ప్రపంచములోని కొన్ని కేంద్రాలలో ఈ సూక్ష్మీకరణ సాధన వేరువేరు స్థాయిలలో అభ్యసించబడితే నరపశువు (Animal man), దేవమానవుడి (Divine man) గా మారే ప్రక్రియ చాలా తొందరగా జరిపించవచ్చు.

అనేకమంది మేధావులు, మహనీయులు భారతదేశం యొక్క భవిష్యభూమికను అద్భుతంగా ఊహిస్తున్నారు. దీని కొరకు మొదట వారందరి లక్ష్యం 1857 నుండి ఈ పుణ్యభూమి యొక్క రాజనీతిక స్వాతంత్ర్యము. భారతదేశము రాజకీయంగా స్వాతంత్ర్యము అగుటకు 1857లో రొట్టె-కమలము గుర్తుగా ఏర్పడిన స్వాతంత్ర్య సమరబీజాలు, 1905లో శ్రీరామకృష్ణ పరమహంస, వివేకానంద, యోగి అరవిందుల తపశ్శక్తితో, దీనికి స్పందించగలిగిన వ్యక్తుల బృహత్తర క్రియాకలాపాల ద్వారా ప్రోదిచెంది, చివరకు 1947 ఆగష్టు 15 నాటికి స్వాతంత్ర్యము సిద్ధించినది. కానీ ఇది కూడా పాక్షికమే. ఆగష్టు 15 యోగి అరవిందుల జన్మదినం కాకతాళీయం కాదేమో!) సమగ్రమైన అఖండ భారతం ఏర్పాటు, తద్వారా దేవసంస్కృతి దిగ్విజయము, భారతదేశము తిరిగి జగద్గురు పీఠాన్ని అధిరోహించడము అనే ఋషుల దర్శనమును ప్రచండ సాధనా పురుషార్థము చేయగల వ్యక్తులకు, సమూహాలకు అంద జేయటమే 1984 నుండి జరుగుతున్న పూజ్యగురుదేవుల సూక్ష్మీకరణ ప్రక్రియ. దీనినే 'పంచవీరభద్ర సాధన' అంటారు. మనకు తెలిసినంతవరకు ఈ సాధన ఒకప్పుడు కుంతీదేవి మహాభారత సమరసాధనములను తయారుచేయుటకు చేసినది. తిరిగి మహాభారత నిర్మాణముకొరకే, ఈవిశిష్ట సూక్ష్మీకరణ సాధన చేయబడుతున్నది. ఆధ్యాత్మికత యొక్క వైజ్ఞానికతను అర్థము చేసికొని ఎలా ఉపయోగించుకోవాలో తెలుసుకొన దలచినవారికి ఈ పుస్తకము ఒక కరదీపికయై, కనువిప్పు కాగలదు.

### సందేశము

పరమపూజ్యగురుదేవుల ఆధ్యాత్మిక జన్మదినమైన వసంత పంచమినాటికి 13 అశ్వమేధ యజ్ఞములు పూర్తైనాయి. మొదట ప్రారంభించిన 10 అశ్వమేధముల శృంఖల ముందుకు సాగి, అర్థ పూర్ణాహుతినాటికి భారతదేశములో ప్రపంచమంతట జరుగబోయే 24 అశ్వమేధయజ్ఞములు, 21వ శతాబ్దపు బ్రహ్మ ముహుర్తము లోపల 108 అశ్వమేధ యజ్ఞములు, సంస్కార మహోత్సవములు సంపన్నమైనప్పుడు, విధ్వంసకారి ఆసురీ

**తృష్ణ ఉంటే తృప్తి ఉండదు**

శక్తులను నాశనము చేయటానికి జరుగుతున్న విశ్వవ్యాప్తమైన ఈ సాధనాపరాక్రమము ఎంత అనివార్యమో అర్థమౌతుంది. సంపాదకీయంలో 'కుండలినీకేంద్రము యొక్క పరస్పర సహకారి' ప్రకరణములో ఈ విశిష్ట యుగసంధియొక్క ఐతిహాసిక సమయమునందు సాధన ప్రక్రియ ఇంకను తీవ్రతరము చేయబడినదని పేర్కొన్నారు. రాష్ట్ర దేవాత్మశక్తి యొక్క మహాకుండలిని జాగరణ దీనియొక్క ఒక స్వరూపమే. దీనిలో కర్తయొక్క మనోరథము ఏమీ లేదు. ఇది స్పష్టంగా యుగపరివర్తన కొరకే. ఈ అదృశ్యకార్యములు దృశ్య రూపములో ప్రతిభలను మేలుకొలిపేటందుకు, అధిక ప్రఖర ఆత్మబల సంపన్నులుగా తీర్చిదిద్దేందుకు, సాధారణ స్థాయినుండి అసాధారణ స్థాయికి తీసికొని వెళ్ళుట చూడవచ్చు.

విశ్వవ్యాప్తముగా జరుగుతున్న అశ్వమేధయజ్ఞములు 'మేధా' (ఇన్‌ట్యూషన్) విజ్ఞానమయకోశ జాగరణకొరకు జరుగుతున్న విలక్షణమైన ప్రయోగములు. 21 వ శతాబ్దిలో భారతదేశము అతి ఉచ్చస్థాయికి చేరుకొనుటకు భారతీయ సంస్కృతి-దేవసంస్కృతి -విశ్వసంస్కృతిగా రూపొందటానికి ఏ ప్రతిభలు అవసరమౌతాయో వారు ప్రజ్ఞాపరివారంలో ఉన్నారు. ప్రజ్ఞాపరివారము ఒక బహుమూల్యమైన మణిహారము. ఈ మణిహారంలోని మణులకొరకు చాలా లోతుగా వెదకి వెదకి ఏకత్రితము చేసి సుదృఢ రత్నమణిసూత్రంగా రూపొందించబడినది. పరమపూజ్య గురుదేవుల తపస్సు వారిని వెదికేందుకు సవ్యమైన దిశలో వినియోగించేందుకు ఉపయోగించబడినది. పూర్వము త్రేతాయుగంలో విశ్వామిత్ర ఋషి అసురత్వ నాశనము కొరకు, సత్యయుగస్థాపన ఉపక్రమించిన విధంగానే; ఇప్పుడు 'సూక్ష్మశరీరధారి గురుసత్తా' 1984వ సంవత్సరంలో పూజ్యగురుదేవుల ద్వారా ప్రారంభించ బడిన సూక్ష్మీకరణ సాధన 1990 గాయత్రీ జయంతినాటికి సుసంపన్నమై, పరమపూజ్య గురుదేవుల స్థూలశరీరము, సూక్ష్మ జగత్తులో సంవ్యాప్తమైనది. గత 3 సంవత్సరాలుగా పరిజనులు దీని ప్రభావమును చూస్తున్నారు. వీరి సూక్ష్మశరీరసత్తాయే విశ్వంలో మారుమూలలకు కూడా దేవసంస్కృతియొక్క నిర్ధారణను పంపేందుకు, జనుల మనస్సులలో సత్ప్రవృత్తులపై అనురాగము పెంచేటందుకు జరుగుతున్న ప్రయత్నములుగా క్రియాశీలమగుట కనిపిస్తుంది. పూజ్యగురుదేవులు స్వయంగా ఇలా వ్రాశారు. 'నేను 1985 నుండి 90 వరకు చేసిన 5 సంవత్సరముల సాధనలోని ఒక అంశమును సంపన్నము చేయటానికి సామాన్య సాధకులకు కనీసము 50 సంవత్సరాలు పడుతుంది. ఇంత సమయము, ధైర్యము ఎవరి దగ్గరా లేవు. సమయము కూడా ఆపదలతో కూడుకుని ఉన్నది.

విశ్వస్థాయిలో జరిగిన కుండలినీ జాగరణయొక్క తీవ్ర పురుషార్థము ముందుముందు అతి వ్యాపకమై, అనేకానేకమంది వ్యక్తులు నేను వితరణ చేస్తున్న అనుదానము (Blessings) లను గ్రహించి లాభాన్వితులౌతారు. **ఈ ఉచ్చస్తరీయ తపశ్శక్తి వితరణను గ్రహించేందుకు వసంతపర్వమునుండి సూర్యోదయానికి ఒక గంట ముందునుండి సూర్యోదయానికి ఒక గంట కాలం తర్వాత కనీసము కనీసము 15 నిమిషముల సాధన వీలైనప్పుడు చేయవలసి ఉంటుంది. సవిత యొక్క ప్రఖర తేజమును ధ్యానిస్తూ, ప్రాణాయామము ద్వారా ప్రాణ ఊర్జాను రోమరోమమునందు గ్రహిస్తున్నట్లు భావనతో గాయత్రీ మంత్రమును మనస్సులో జపించాలి.** ఆత్మబల జాగరణకొరకు పరిజనులకు ఈ సాధన అనివార్యము. అనేక స్థానములలో జరుగుతున్న శక్తిసాధనలు, భూమిపూజలు, సంస్కార మహోత్సవములు, అశ్వమేధ మహాయజ్ఞములలో ఉత్పన్నమవు తున్న తపశ్శక్తికి మూలము గురుసత్తాయొక్క సూక్ష్మశరీర తపస్సాధన మాత్రమే. ఇది ఆధ్యాత్మిక ధృవకేంద్రమైన హిమాలయాలలో నిరంతరము జరుగుతున్నది. రాబోయే రోజులలో దేవసంస్కృతి దిగ్విజయము అంచలంచలుగా ముందుకు సాగుతూవుంటే సమర్పిత ప్రజ్ఞావంతులు కార్యక్షేత్రం లోకి దిగుతారు. వీరి జాగృతమైన బ్రహ్మవర్చస్సు వల్ల యుగ పరివర్తన యొక్క రెండువిధములైన ప్రయోజనములు పూర్తవుతాయి. 1) సత్ప్రవృత్తి సంవర్ధన, 2) దుష్ప్రవృత్తి నిర్మూలన. బాధలు పెడుతున్నవారి దమనము, బాధపడేవారికి సంరక్షణము ఈ రెండు పనులు అనివార్యమే.

అశ్వమేధ యజ్ఞములద్వారా ఆవిర్భవిస్తున్న చక్రవాతములు (Tornados) వాతావరణ పరిశోధన చేసి సూక్ష్మ ప్రకృతి ప్రవాహములు ప్రకృతిలో తెస్తున్న సక్రియ (Dynamic) మార్పుల్ని మెల్లమెల్లగా సంపూర్ణ విశ్వములో మారుతున్న

**సదుపాయాలు ఏమీ లేని గిరిజనులు సుఖ సంతోషాలతో జీవిస్తుంటే అన్నీ ఉన్న పట్టణవాసులు అసంతృప్తితో దుఃఖిస్తుంటారు**

విలువల ఆలోచనల రూపంలో గమనించవచ్చు. అర్థపూర్ణాహుతి 1995 నవంబరులో జరుగుతుంది. అప్పటికి ప్రపంచములో వచ్చిన మార్పులు అశ్వమేధ పరాక్రమ పురుషార్థముగా స్పష్టముగా గుర్తించగలుగుతారు. ఈనాడు సర్వమును తన ప్రవాహ వేగముతో త్రోసివేస్తున్న అవినీతి శక్తిధారలు సమసి పోయి, నీతిని, సత్ప్రవృత్తులను పాటించేవారిమీద లోకులకు నమ్మకము పెరుగుతుంది. ధర్మం యొక్క విజ్ఞానసమ్మత స్వరూపమును తెలుసుకొని ప్రచ్ఛన్న నాస్తికులు (ఈనాడు భక్తి ముసుగులో ఉన్నవారు) ఆస్తికులుగా మారటం చూస్తాము. మనలోనుంచే ప్రఖర మేధాసంపన్నులు లోకనేతృత్వమును చేపట్టుతారు. సకాలములో ఈ విషయమును గుర్తించనివారు పశ్చాత్తాపపడతారు. ఎవరు శాస్త్రోక్తమైన, విజ్ఞానసమ్మతమైన అశ్వమేధ పరాక్రమము గురించి టీకాతాత్పర్యములు, వాదోప వాదములు చేస్తూ కూర్చుని ఉంటారో, వారు తరువాత పశ్చాత్తాపపడతారు. సమయం ఉండగానే మేలుకొన్న ప్రజ్ఞా వంతులు, దూరదర్శులు జాగృతమైన మేధ కలవారుగా శ్రేయస్సును ఆర్జించుకుంటారు.

ప్రతి సంవత్సరము వసంతపర్వము, నూతన సందేశము అందజేస్తుంది. అది గురుసత్తా నిర్ధారణల ప్రకారము నడుచు కొనుటకు, అందివ్వబడిన ఆదర్శాలను పాటించుటలో ఎవరు ఎంత ఉత్సాహముతో పోటీపడ్డారో ముఖ్యపాత్ర వహిస్తుంది. తమ ప్రతిభ, కాలము, రాష్ట్రం యొక్క నవ నిర్మాణము కొరకు ఇచ్చిన వ్యక్తే వరిష్ఠుడు అనిపించుకుంటాడు. 2001 AD నుండి 2005 AD వరకు పూజ్యగురుదేవుల సూక్ష్మసత్తా మన మధ్య సక్రియముగా ఉంటుంది. ఆ తరువాత ఆయన కారణసత్తా సక్రియమవుతుంది. దానికి తగిన సాధనాలను, ప్రతిభలను ఉత్పాదన చేయుటయే ఈరోజులలో మన కర్తవ్యము. బద్ధకము దరిరానీయకుండా ఈ వసంత పర్వమునాడు ఈ లక్ష్యసాధనకు ఉల్లాసముగా పనిచేస్తాము అని ప్రతిజ్ఞ తీసుకోండి.

*– ప్రజ్ఞా అభియాన్, 18 ఫిబ్రవరి 1994*

## సంస్కృతి విలువలు

*కలకత్తా హైకోర్టు జడ్జి శ్రీగురుదాస్ బెనర్జీగారు; ఇంగ్లీషు ప్రభుత్వ వైస్రాయ్‌తో కలిసి 'కాన్పూరు' నుండి కలకత్తాకు యాత్ర చేయసాగాడు. కలకత్తా విశ్వవిద్యాలయం సంబంధంగా, ఒక అత్యవసర చర్చ నిమిత్తం వైస్రాయి, జడ్జిగారిని తన పెట్టెలోకి పిలవటం జరిగింది. మాటల మధ్యలో భోజన సమయం కావటంతో, వైస్రాయి వారిని కూడా తనతో భోజనం చేయమని కోరాడు. బెనర్జీగారు జవాబిస్తూ – "నేను రైలు ప్రయాణంలో ఏదీ తినను... నా వద్ద కొద్దిగా గంగాజలముంది. దానిని త్రాగుతాను" అన్నాడు.*

*వైస్రాయికి విశ్వాసం కలగలేదు. ఇంతటి ఆధునాతన వ్యక్తి కూడా ధార్మిక ఆచరణ విషయంలో ఇంత నిక్కచ్చిగా ఎలా పాలించగలుగుచున్నాడనే సందేహం కలిగింది. ఆయన తిరిగి ఇలా జడ్జిగారిని – "అలా అయితే సరే! మీ పిల్లవాడినైనా నాతో భోజనం చేయమని చెప్పండి!' అని అన్నాడు. అయితే పిల్లవాడు కూడా అందుకు అభ్యంతరం చెపుతూ – "నా వద్ద ఇంట్లో తయారుచేసిన మిఠాయి 'తిన్నందున, ఇక మరేమి తిననని' చెప్పాడు!*

*వైస్రాయికి ఎంతో ఆశ్చర్యమేసింది. ఆయనిలా అన్నాడు. 'మీరంతా ఉపవాసం చేస్తున్నందున నేను మాత్రం ఎలా తినగలను? వైస్రాయిగారి ఆజ్ఞతో 'అలహాబాద్'లో రైలును ఆపటం జరిగింది? అక్కడ బెనర్జీగారు తన కుమారునితో కలసి త్రివేణీ సంగమంలో స్నానం చేసి వచ్చిన తరువాత తిరిగి రైలు బయలుదేరింది. వెనుదిరిగి వచ్చిన తరువాత వైస్రాయికి ధన్యవాదాలు తెలుపుతూ జడ్జిగారిలా అన్నారు – "ఏదైనా తిని త్రాగడంలో ఏ జాతి వారి సంబంధ విషయంలో నేను ఏ విధమైన తర్కం చేయను. కానీ నియమపాలనలో ఆత్మ సంయమనం – క్రమశిక్షణ లభిస్తాయి. మా ధర్మంలో సంస్కృతిలో అటువంటి విషయాలున్నందున, వాటిని నేను హృదయపూర్వకంగా ఆచరిస్తూ ఉంటాను" అని నమ్రతతో తెలిపాడు.*

*– అఖండజ్యోతి, ఫిబ్రవరి 1990*

*అనువాదం: జి. చెన్నకేశవరావు*

**నాగరికత ఉప్పెనలో ఖర్చు పెరిగి అసంతుష్టి మిగులుచున్నది**

కర్మకాండ ఎందుకు? ఎలా?-7

# గాయత్రీ సాధనా విధానము

*(నవంబర్ 2015 సంచిక తరువాయి...)*

## సాధన

సాధనా మర్మమును తేటతెల్లము చేస్తూ గురుదేవులిలా చెప్పారు. 'సాధన కొరకు ఆత్మచింతన, ఆత్మశోధన, ఆత్మ వికాసము అనే సోపానములను అధిరోహించటము ద్వారా ముందుకు సాగుతాము. ఉపాసన-గంగ అయితే, సాధన-యమున, ఆరాధన-సరస్వతి. వీటి సంగమము జరిగి తీరాలి. పుత్రా! ఒక కోతి పలురకముల విన్యాసములను ప్రదర్శించి గారడీవాని కుటుంబమును పోషించటానికి కావలిసిన ఆదాయమునకు మూలకారణమవుతుంది. ఈ చమత్కారము సాధనదే. కోతి ఇటు-అటు దూకుతూ ఉంటుంది. అయితే సాధన చేయింబడిన కోతి సర్కస్‌కి, గారడీ వానికి చాలా ఉపయోగపడుతుంది. వేలాది రూపాయలను సంపాదించి పెడుతుంది. ఇదేవిధముగా ఏనుగు, ఎలుగు బంటు, పిల్లి, కుక్క మొదలయినవాటిచేత కూడా సాధన చేయించినప్పుడు అవి సంకేతానుసారము ఆజ్ఞలను పాటిస్తాయి. సింహము మనుష్యులకు మృత్యుసమానము, కానీ అభ్యాసము చేయించబడినప్పుడు ఆ సింహమే రింగ్‌మాస్టర్ యొక్క సంకేతానుసారము తోలుబొమ్మవలె విన్యాసములు చేస్తుంది. వినోదము కలిగిస్తుంది, ఆదేశములను పాటిస్తుంది.

నిరుపయోగమైనదానిని-సుయోగ్యముగా చేసే ప్రక్రియే సాధన. కుసంస్కారిని -సంస్కారవంతునిగా మలచేదే సాధన. ముడిఇనుమును పోతపోసినచో యంత్రము తయారౌతుంది. అసంభవకార్యమును కూడా చేసిచూపిస్తుంది. దోషదుర్గుణముల నివారణయే సాధన. దశరథమహారాజు సంతానాభిలాషియై కులగురువైన వశిష్ఠులను చేరి పుత్రేష్ఠియజ్ఞమును చేయించమని ప్రార్థించాడు. వశిష్ఠులవారు ఈ యజ్ఞమును చేయుటకు లోమశమహర్షి పుత్రుడైన శృంగిఋషిని ఆహ్వానించి తీసుకు రమ్మని చెప్పారు. ఒక బాలుని ద్వారా పుత్రేష్ఠియజ్ఞమును చేయించడమనే విషయమును గురుదేవులు ఎందుకు చెపుతున్నారు అని దశరథమహారాజుకు చాలా ఆశ్చర్యము కలిగినది. సందేహనివారణ కొరకు ఆ విషయమునే ప్రశ్నించాడు. 'ఆ బాలకునిలో సంయమశీలత మరియు సాధన ద్వారా పొందిన అపరిమితశక్తి ఉంది' అనే ప్రత్యుత్తరము లభించినది. ఆ శృంగిఋషి ద్వారానే పుత్రేష్ఠియజ్ఞము సుసంపన్నమైనపుడు రామ-లక్ష్మణ-భరత-శత్రుఘ్నుల వంటి మహాపురుషులు జన్మించారు అన్న విషయము నీకు తెలుసు.

గురుదేవులు తమనే ఉదాహరణనే చెప్తూ 'మేము స్వయముగా 24 సంవత్సరములపాటు కేవలము ఆవుపాలు, వాటి నుంచి వచ్చిన మజ్జిగ మరియు బార్లీరొట్టెలను ఆహారముగా స్వీకరించి 24-24 లక్షల 24 మహాపురశ్చరణలు పూర్తి చేశాము. ఆ సాధన ద్వారానే మాకు ఇంత శక్తి లభించినది. ఎంతోమందికి నూతన జీవితమును ప్రసాదించాము. ఎంతో మంది ఏడుస్తూ వచ్చి-నవ్వుతూ వెళ్ళారు. ఎవ్వరినీ రిక్త హస్తము లతో వెనక్కు పంపలేదు. ఇదంతా సాధన యొక్క చమత్కారమే! సాధనా పరిపక్వతయే రిద్ధి-సిద్ధులను ప్రసాదిస్తుంది' అన్నారు.

## ఆరాధన

గురుదేవులు ముందుకు కొనసాగిస్తూ ఇలా అన్నారు. 'మూడవధార ఆరాధన, అదే సరస్వతి. గంగ-యమున-సరస్వతుల సంగమముతోనే త్రివేణి ఏర్పడుతుంది. ఆవిధము గానే ఉపాసన, సాధన, ఆరాధన అనే త్రివేణీసంగమము ఆవశ్యకము. అప్పుడే జీవితము సఫలమౌతుంది. సమాజ సేవను ఆరాధన అంటారు. భగవంతుడైన కృష్ణుడు యశోదకు తన విరాట్ స్వరూపమైన విశ్వబ్రహ్మాండమును దర్శింపజేసి 'ఈ ప్రపంచము నా స్వరూపమే' అని బోధించాడు. భగవంతుడు రాముడు కౌసల్య మరియు కాకభుశుండులకు 'కణకణము లోను నా శక్తే నిబిడీకృతమైయున్నది' అని తన విరాట్ స్వరూప మును చూపించాడు. ఈ సమాజమునకు సేవ చేయుటయే భగవంతుని నిజమైన పూజ-ఆరాధన. భగవంతుడైన రాముడు సైతము సమాజసేవ చేశాడు. అసురులను వధించి ఈ పృథ్వికి దుష్టులనుండి ముక్తిని ప్రసాదించాడు. రావణ-కుంభకర్ణుల వంటి రాక్షసులను వధించాడు. ప్రజలకు సుఖ-సంతోషములను అందించుటకు నవసమాజ నిర్మాణము కావించాడు. శ్రీరాముడు ఋషుల-మునుల యొక్క ఎముకల-అస్థి పంజరముల గుట్టలను చూసే 'నిసిచర్ హీన్ కరౌ: మహి' అనే సంకల్పమును తీసుకున్నాడు. **భూమాతకు అసురత్వము**

**మనిషి జీవితంలో కష్టాలు ఎదురైనప్పుడు మాత్రమే ఘర్షణ ఉత్పన్నమై శక్తి పుడుతుంది**

**నుండి ముక్తి కలిగించుటకు తీసుకున్న ఈ సంకల్పముతోనే రామరాజ్యము స్థాపించబడినది. ఆ రామరాజ్యము కోసమే ఈనాడు మనము పరితపిస్తున్నాము.** బుద్ధభగవానుడు, మదన మోహనమాలవ్యా, వివేకానంద – వీరందరు సమాజమునకు సంపూర్ణముగా సేవ చేశారు. బుద్ధుడు–భిక్షువుల; గాంధీ–స్వతంత్ర్యసేన; రాముడు–కోతులు, ఎలుగుబంట్లు; శ్రీకృష్ణుడు–గోపబాలుర యొక్క ఐక్యతను సాధించి సమాజసేవ చేశారు. ఈ భూమిమీద ఒక్క ప్రాణి కూడా ముక్తిని సాధించకుండా ఉన్నంతవరకు నేను ముక్తిని కోరుకోను అని బుద్ధభగవానుడు సెలవిచ్చాడు. మానవులలో ఉన్న మాధవుడి యొక్క సేవ, లోకమంగళ కామనయే సమాజసేవ. ఈశ్వరచంద్ర విద్యాసాగర్‌కు 450 రూపాయముల నెలసరి జీతము లభించేది. ఆయన కేవలము 50 రూపాయలు మాత్రమే స్వంత ఖర్చులకు కేటాయించేవారు. మిగిలిన 400 రూపాయలను పరోపకార కార్యములలో వెచ్చించేవారు. ఇదే నిజమైన ఆరాధన.

ద్రౌపదిని ఉదహరిస్తూ గురుదేవులు ఇలా అన్నారు. 'ద్రౌపది ఒకసారి యమునానదీ స్నానానికీ వెళ్ళినప్పుడు అక్కడ నది నీటిలో కూర్చుని ఉన్న ఒక స్వాములవారిని దర్శించినది. స్వామి! మీరెందుకు ఇలా కూర్చున్నారు? అని ద్రౌపది ప్రశ్నించినది. 'అమ్మా! నా లంగోటీ నీటిలో కొట్టుకుపోయింది' అని స్వాములవారు ప్రత్యుత్తరమిచ్చారు. ద్రౌపది వెంటనే 'స్వామీ! మీరు నాకు పితృసమానులు' అని అంటూ వెంటనే తన చీరలోని ఒక భాగమును చింపి స్వాములవారికి సమర్పించింది. భగవంతుని పొలంలో ఈ సేవ, త్యాగము, దానముల భావన నాటబడినది. ఆనాటి దాన ఫలితముగానే దుశ్శాసనుడు వస్త్రాపహరణము చేస్తున్న తరుణములో; భగవంతుడు ఆమెకు వందలాదిరెట్లుగా చీరను పెంచాడు. ఇదంతా ఆరాధనా చమత్కారమే!

గురుదేవులు బాగ్దాద్‌లోని ఒక వృద్ధముసల్మాను స్త్రీ యొక్క ఉదాహరణ సైతము వినిపించారు. ఆ వృద్ధురాలు హజ్‌యాత్ర చెయ్యటానికి ఏర్పాట్లు చేసుకున్నది. అయితే ఆ సంవత్సరం గొప్ప అకాలము దాపురించినది. ఈ సమయములో నా ప్రథమ కర్తవ్యము ఆకలిగొన్నవారికి సేవ చేయుట. హజ్‌యాత్ర తరువాత అయినా చేయవచ్చును అని ఆమె భావించినది. ఆమె అకాలపీడితులకు సహాయమునందించుటయే ప్రథమకర్తవ్యముగా భావించి సేవా కార్యములలో మునిగిపోయినది. అల్లా ఆ రోజుననే ఈ వృద్ధురాలికి హజ్‌యాత్ర పుణ్యమును ప్రసాదించాడు అని చెప్తారు. దీనిమీదట దేవదూతలు 'మక్కాయాత్ర చేసినవారికి వారి హజ్‌యాత్ర మంజూరు చెయ్యబడలేదు కానీ ఈ వృద్ధురాలికి ఎందుకు చేశారు?' అని ఆక్షేపణను తెలిపారు. దీనికి అల్లా సమాధానమిస్తూ అన్నాడు 'ఇతర యాత్రికులు కేవలము మార్గ యానమును పూర్తిచేశారు, కానీ ఈ వృద్ధురాలు నిజమయిన సేవచేసినది. హజ్‌సిద్ధాంతమును ఆమె అర్థము చేసుకున్నది, ఆచరణలోపెట్టింది.'

ఉపాసన–సాధన–ఆరాధనల త్రయమును విస్మరించి మనము ఒక్క ప్రవాహధారనే పట్టుకొన్నాము. దీనితో పని ఎలా జరుగుతుంది? కేవలము మంత్రజపము చేసినంత మాత్రమున పూర్తి లాభము లభించదు. ఈనాడు సమాజములో ఎన్ని చెడు సంప్రదాయములు ఉన్నాయి? కట్నమనే రాక్షసుడు ఏవిధముగా వ్యాపిస్తున్నాడు? వందలాది మంది మహిళలు (కుమార్తెలు) మృత్యువాతపడుతున్నారు. బాల్యవివాహముల పేరిట ఎంతమంది 'చిన్నారికన్యల'మీద గృహస్థాశ్రమధర్మ భారమును మోపి; శారీరిక మరియు మానసిక వికాసముల లోనే కాక, ప్రగతి విషయములో కూడా వారిని ఆటబొమ్మలను చేస్తున్నారో తెలియదు. అవిద్య, నిరుద్యోగము, భిక్షావృత్తి మొదలయినవి చిన్న సమస్యలు కాదు. వీటితో దేశము–సమాజము డొల్లవుతున్నది. జాతివాద, భాషావాద, ప్రాంత వాద, సంప్రదాయవాదముల సమస్యలు ఉన్నాయి. మరణించిన తరువాత ఇచ్చే విందుభోజన సంప్రదాయము ఎంత హేయమైనది? శోక–వాతావరణములో మునిగి ఉన్న గృహములో ధరలు ఆకాశమునంటుతున్న ఈ కాలములో కష్టసాధ్యమైన విందుభోజన సంప్రదాయము ఎంత క్రూరమైనది? మద్యపానము పెరుగుతున్నది. సమాజములో పాశ్చాత్య నాగరికతా ప్రభావము పెచ్చు పెరిగి పోతున్నది. మన సంస్కృతి రూపమైన సీత అపహరించబడినది.

**ఆరాధన అనగా సమాజసేవ చేస్తూ నేటి కాలములో ఉన్న సమస్యలను నివారించేందుకు యుగపిలుపును ఆలకించి ముందుకు రావలసి ఉంటుంది. మీ శ్రమ, సామర్థ్యము, సాధన, సమయము మరియు ప్రతిభలను దీనికై వెచ్చించాలి. అదే నిజమైన సేవ అవుతుంది. త్రిపదాగాయత్రి పట్ల చూపవలసిన భక్తి ఇదే! ఇంతవరకు సాధించగలిగితే ఇదే నిజమైన ఆధ్యాత్మికతగా తెలుసుకొనవలెను.**

*– అనువాదం: శ్రీమతి లక్ష్మీరాజగోపాలు*

**శక్తిని ఒకే దిశలో కేంద్రీకరిస్తే ఉన్నత లక్ష్యం వైపుకు దూసుకుపోవచ్చు**

## అతీంద్రియ విజ్ఞానం-7

# సత్యదర్శనము

*(గత సంచిక తరువాయి...)*

పైన చెప్పిన లాంటి సంఘటనలను గురించి తెలుసుకున్నప్పుడు 'మానవుడి నేత్రాలు ఎదురుగానున్నవాటిని మాత్రమే చూడగలవా?' అన్న ప్రశ్న తలెత్తుతుంది. సాధారణ స్థితిలో అయితే అంతే సాధ్యమవుతుంది. మానవనేత్రములు రెండూ కూడా కేవలము ఎదురుగానో లేదా కొంచెము కుడి ఎడమల వైపు కొంత దూరం వరకు మాత్రమే చూడగలవు. అదికూడా నేత్రాలలోని దృశ్యశక్తి, పదార్థములలోని ధ్వనితరంగాల సంయోగముతో ఒక నియమితమైన మాధ్యమంగా పనిచెయ్యడము వల్ల మాత్రమే జరుగుతుంది. కంటిచూపు మందగించినా లేదా ఎదుటనున్న పదార్థములు జీవాణువు, పరమాణువుల వంటి అత్యంత సూక్ష్మమైన ఆకృతి కలవియైనా సూక్ష్మదర్శిని(మైక్రోస్కోపు) లేదా దూరదర్శిని (టెలిస్కోపు) వంటి విస్తృతస్థాయి సమాచార మును అందించగలిగే యంత్రముల సహాయము తీసుకుంటేనే నేత్రములు పనిచేస్తాయి. అదికూడా వర్తమాన కాలమునకు చెందిన దృశ్యాలను మాత్రమే చూడగలవు. భూత-భవిష్యత్ కాలములకు చెందిన దృశ్యములు అందుబాటులోకి రావు. ఫోటోగ్రఫీ, చిత్రకళ, ఫిల్మ్‌టెలివిజన్ వంటి మాధ్యమాల ద్వారా భూతకాలమునకు చెందిన దృశ్యములను కూడా చూడగలము. ప్రస్తుతానికి మానవుడు వీటితో సంతృప్తి చెందవల్సినదే.

ప్రాచీనకాలములో కేవలము ఆధ్యాత్మికవిజ్ఞానవేత్తలకు మాత్రమే సాధ్యమైన అద్భుతాలను కూడా ఈ నేత్రాలతోటే చూడగలిగే అవకాశము సమీప భవిష్యత్తులోనే ఉన్నది. భూతకాలములోని సంఘటనలను ఎప్పటికీ సురక్షితముగా ఉంచుకొనగలము. ఫిల్మ్ టెలివిజన్ మీద క్షణమాత్రపు మెఱుపు వంటి దృశ్యము వలె కాక; మామూలుగా మనం కళ్ళతో చూసిన రీతిలోనే చూడగలము. అలాంటి పరిస్థితులలో ఆ చూడబడుతున్న దృశ్యము అసలైనదా లేక నకిలీదా అన్న సందేహము కలిగి తీరుతుంది. భూతకాలమును మనము వర్తమానకాలములో, సంపూర్ణముగా అప్పుడే అది నిజముగా జరుగుతున్నదా అన్న రీతిలో అచ్చుముగా అసలైన రూపములో చూడగలుగుతాము. బాగా అభివృద్ధిచెందిన త్రీడైమెన్షనల్ ఫోటోగ్రఫీ సహాయముతో మాత్రమే ఇలాంటిది సాధ్యమవుతుంది.

దుర్యోధనుడు పాండవుల గృహమునకు వెళ్ళినప్పుడు నేలను చూసి నీళ్ళుగానూ; నీళ్ళను చూసి నేలగానూ భ్రమ చెందాడు. పోనీ అది అద్దము చేసిన అద్భుతమూ కాదు. అద్దములో ఆవిధముగా కనపడాలంటే అక్కడ నేల, నీళ్ళూ రెండూ ఉండాలికదా! కానీ అక్కడ నేలమాత్రమే ఉన్నది, నీళ్ళు లేవు. వినీలాకాశము క్రింద కూర్చుని ఎలాంటి సహాయమూ లేకుండా కోరుకున్న దృశ్యములను చూడగలగటము నిస్సందేహముగా ఎంతో అద్భుతమైన విషయము. మొదటి సారిగా అలాంటి అవకాశము వచ్చినవారు నిజముగా అవాక్కైపోవటమే కాదు తమ కళ్ళను తామే నమ్మలేరు. సంజయుడు ఇంట్లోనే కూర్చుని మహాభారతయుద్ధమును వీక్షిస్తూ; ఆయా సంఘటనలను ఒక క్రమపద్ధతిలో ధృతరాష్ట్రునికి వివరించేవాడట! టెలివిజన్ దీనిని సమర్థిస్తుంది. అంతో ఇంతో మిగిలి ఉన్న సందేహమును ఇప్పుడు హోలోగ్రఫీ పూరించింది. ఇప్పుడు ఆ విజ్ఞానము ఆధారముగా మనము దేశకాల పరిధులన్నింటినీ దాటుకొని ఏ సంఘటననైనా అసలేదో-నకిలీదేదో కూడా గుర్తించలేనంత స్పష్టముగా చూడగలుగు తున్నాము.

విజ్ఞానవేత్తయైన ఐన్‌స్టీన్ 'దేశకాలపరిస్థితులు' అనే అంశమును భ్రాంతి అనీ, అవాస్తవికమైనవనీ నిరూపించాడు. వేదాంతదర్శనములో జగత్తును మాయ అనీ, భ్రాంతి అనీ మనము చూస్తున్నదేదైతే ఉన్నదో అది నిజమైనది కాదనీ, భ్రాంతి మాత్రమేననీ చెప్తూ ఇదంతా తాడు-పాము కథ ఉదాహరణ ద్వారా చెప్పటము జరిగినది. అణువిజ్ఞానవేత్తల దృష్టిలో ఈ ప్రపంచము అణుకణముల భయంకరమైన తుఫానుతో నిండిన ఆవరణ మాత్రమే! ఇందులో తుఫానులు, సుడిగుండాలు వస్తూపోతూ ఉంటాయి. అవికూడా ఆయా పదార్థముల రూపములో కనపడుతుంటాయి. మనకు కనిపించేది అంతా శూన్యముతో నిండిన ఆవరణ మాత్రమే. దాని లోపల అణువుల కదలికలతో కూడిన తుఫానులు నిండి ఉంటాయి. మన మెదడు, కన్నుల నిర్మాణమూ తమ యొక్క

**ఉన్నత లక్ష్యం లేని వాని మనస్సు అస్థిరంగా, చిత్తం చంచలుగా అన్ని దిశలలో పరుగెడుతూ సాఫల్యాన్ని పొందజాలరు**

అసంపూర్ణ సంరచన కారణముగా మనం యథార్థమని భావిస్తూ ఉన్న దానినే చూస్తూ ఉన్నాము. కానీ నిజానికి అసలైన సత్యము వేరొకటి ఉన్నది.

జడమైన చిత్రపటములను కదులుతూన్నట్లుగా చూపించిన 'చలనచిత్రముల' ద్వారా 'కళ్ళను ప్రామాణికసాక్షిగా భావించ లేము' అన్న సత్యమును మన ముందుకు తీసుకొచ్చారు శాస్త్రవేత్తలు. అక్కడ చూస్తూఉన్నదికానీ, అనుభూతి చెందు తున్నది కానీ అంతా యథాతథముగా యథార్థము కానేరదు. ఇప్పుడు ఆ లోటును హోలోగ్రఫీ పూర్తిచేసింది. ఆ తెరమీద కాకుండా ఆరుబయట ఆకాశము క్రింద కూర్చుని దేశకాల పరిస్థితులతో సంబంధము లేకుండా అంటే ఆ సంఘటన ఎంత దూరములో జరిగినా సరే భూతకాలమునకు చెందినదైనా సరే యథార్థముగా చూడగలము. ఆ దృశ్యావళిని ఫోటోగ్రఫీ అనడముగానీ, ఆవిధముగా అంగీకరించడముగానీ చూసేవారికి సాధ్యము కాదు.

ఆధ్యాత్మికవిద్యను ఆధారముగా చేసుకొని దేశకాల పరిస్థితులకు ఆవలనున్న దృశ్యములను చూడటము ఇదివరకే సాధ్యమైనది. దీనినే 'దివ్యదృష్టి' అంటారు. 'దివ్యదృష్టి' అనేది నమ్మరాని విషయమేమీ కాదు. ఈ సత్యము 'హోలోగ్రఫీ' రూపములో ఇప్పుడు మన ముందుకొచ్చింది. మన కళ్ళు మోసగించబడుతున్నాయి. అసత్యమును సత్యముగా భావిస్తున్నాయి' అన్న వేదాంత కథనాన్ని కూడా ప్రస్తుతము మనము కొంచెము తీవ్రముగానే ఆలోచించవలిసి ఉన్నది. మనకు సమీపములో అదీ కొంత పరిధిమేరకే మనము చూడగలము అన్న సత్యము కూడా మన ముందున్నది.

కాంతికిరణాలను ఫోటోరూపములో పట్టుకొనగలిగే కళ ఇప్పుడు టెలివిజన్‌ఫోటోగ్రఫీ వరకు మాత్రమే పరిమితము కాలేదు. మూడు ఆయామములు కలిగిన 'త్రీడైమెన్షన్' చిత్రాలను చూడగలిగే ఆధారము ప్రస్తుతము లభించినది. సాధారణముగా ఫోటోగ్రఫీలో పొడవు-వెడల్పులను మాత్రమే గణించడము జరుగుతుంది. లోతును గురించి కొంత ఊహామాత్రమే ఉంటుంది. లోతునుకూడా ప్రతిబింబించగలిగితే కంటితో చూసే దృశ్యానికీ-ఫోటోలో వచ్చిన దృశ్యానికీ తేడా ఏమీ ఉండదు. ఇలాంటి దృశ్యములను తీయడము సాధ్యమైతే ఇక చలనచిత్రములలో ప్రస్తుతమున్న అసంపూర్ణఫోటోగ్రఫీ తొలగిపోతుంది. అప్పుడు రైళ్ళు, మోటర్లు, గుఱ్ఱములు, మనుష్యులు మామూలుగా నడుస్తూ, పరిగెత్తుతూ ఉన్నట్లుగానే తెర మీద కూడా యథార్థముగా కదులుతూ మన కళ్ళముందు నిజముగా సాగిపోతున్నట్లు కనిపిస్తాయి. తత్ఫలితముగా ఒక రైలు మన ముందుకు వచ్చినా, సింహం ఎగిరి దూకినా అవి మనమీదే పడిపోతున్న అనుభూతి కలిగి చలనచిత్రము చూసేవాళ్ళు భయభ్రాంతులై తమ కుర్చీ వదిలి పారిపోయే ప్రయత్నము చేస్తారు.

కాంతివిజ్ఞానశాస్త్రవేత్త ఎర్నెస్టెయే, అతని శిష్యుడైన డీ.గైరవ్ హోలోగ్రఫీకి సంబంధించిన ఒక క్రొత్త సిద్ధాంతమును ఆవిష్కరించారు. దాని నాధారముగా చేసుకొని త్రీడైమెన్షనల్ స్థాయిలోని ఛాయాచిత్రములను కన్నులతో చూడగలము. ఇంతేకాదు భూతకాలమునకు చెందిన దృశ్యములను కూడా ఆయా సంఘటనలు ఇప్పుడే మన కళ్ళముందు జరుగు తున్నాయి అన్నంత స్పష్టముగా తిలకించగలము.

ఎలక్ట్రాన్‌మైక్రోస్కోపీ యొక్క ఈ విధి విజ్ఞానమును రష్యా శాస్త్రవేత్తయైన 'యూరీడైనిస్యూక్' నాయకత్వములో మరింత ముందుకు తీసుకొనిపోబడినది. ఈనాటి శాస్త్రజ్ఞులు సాంప్రదాయపరముగా వస్తున్న పలచని పొర కలిగిన ఫోటోప్లేట్‌ల స్థానములో మందపాటి పొరను వేసి దానిమీద కాంతికిరణములు లోతుగా ప్రవేశించగలిగేటందుకు అవకాశము నేర్పరచారు. ఫలితముగా మూడు ఆయామములు గలిగిన ఫోటోలను తీయడము సాధ్యమైనది. ఏ కోణములో నుండి వీటిని చూస్తున్నామో ఆ కోణము నుండే ఫోటో తీయబడినట్లు పూర్ణప్రతిబింబము కనపడుతుంది. దగ్గర నుండి చూస్తే అది దగ్గర నుండి తీసినట్లు కనపడుతుంది. అటునుంచీ- ఇటునుంచీ ఆవిధముగానే తీయబడినట్లు కనిపిస్తుంది.

వాస్తవానికి హోలోగ్రఫీ' అనేది లేజర్‌కిరణముల యొక్క అనేక అద్భుతములలో ఒకటి. ఐన్‌స్టీన్ లేజర్‌కిరణముల సిద్ధాంతములను కనుగొన్నాడు. క్రీ.శ 1954 లో ఛార్లెస్ అనే శాస్త్రజ్ఞుడు ఆ ఊహను సాకారము చేశాడు. ఒక ప్రత్యేకమైన విద్యుత్‌తో పరమాణువులను ఉత్తేజితము కావించి వాటినుండి మైక్రోతరంగములను వెలువరింపజేసే ఆరంభిక ప్రక్రియను 'మేజర్' అంటారు. నాలుగు సంవత్సరముల తదుపరి దానిని మరింత అభివృద్ధిచేసి 'లేజర్' అనే పేరుతో మన ముందుకు తీసుకొచ్చారు శాస్త్రజ్ఞులు.

**తనలోని శక్తిని కేంద్రీకరించకుండా చెల్లాచెదురు చేసుకోవటం వల్ల బలహీనుడుగా, విలువలేనివాడుగా మిగిలిపోతాడు**

కొన్ని పదార్థములను వేడిచేసి ఉత్తేజింపచెయ్యడము ద్వారా ఒక ప్రత్యేకవిధమైన శక్తీ, కాంతీ వెలువడతాయి. సాధారణమైన కాంతి కొన్ని రంగుల కలయిక వల్ల ఏర్పడుతుంది. ఆయా కిరణములు వేర్వేరు కొలతలతో, కోణములతో ఉంటాయి. ఇంద్రధనుస్సు ఏర్పడేటప్పుడు అందులో ఉండే కిరణములన్నీ ఒకే పొడవులో ఉండవు. వేర్వేరు కొలతలు, కోణములతో కలసిన కిరణముల వల్లే ఇంద్రధనుస్సు అంత అందముగా ఏర్పడుతుంది. లేజర్ ప్రక్రియలో పరమాణువులను ఉత్తేజ పరచటము ద్వారా ఒకే రంగు, ఒకే పరిమాణములో ఉండే కిరణములను వెలువరింపజేసి వాటిని వీలైనంత దట్టంగా ఉండేట్లు చూస్తారు. దానితో కిరణములు ప్రచండమైన శక్తితో అద్భుతముగా పనిచేస్తాయి. కొన్ని ప్రదేశములలో ఇవి అణు విస్ఫోటనము కన్నా ఎక్కువ సూక్ష్మముగా, శక్తివంతముగా ఉంటాయి. రాబోయేరోజులలో భౌతికరంగములో లేజర్ కిరణములనుపయోగించి జరుపబోయే విలక్షణమైన, విప్లవాత్మకమైన క్రియాకలాపము లెన్నో మన ముందుకు రానున్నాయి. హోలోగ్రఫీ కూడా అందులో ఒకటి.

లేజర్‌కిరణములను కనుగొన్న ప్రారంభదినాలలో వాటి ద్వారా ఒక్క రంగుమాత్రమే ఉత్పత్తి చేయబడటమనే ఇబ్బంది ఉండేది. అందుచేత ఫోటోకూడా ఒక్కటే రంగులో వచ్చేది. అలాగే ఫోటో తీసేటప్పుడు లేజర్‌కిరణముల నుపయోగించినట్లే దానిని చూసేటప్పుడు కూడా అవే కిరణములనుపయోగించ వలసి వచ్చేది. అంటే లేజర్ అత్యంత ప్రమాదకారి అని అర్థమవుతున్నది. వాటి నుపయోగించటములో ఏమాత్రము వ్యతిక్రమము (పొరపాటు) వచ్చినా సర్వనాశనము తప్పదు. ఐతే ప్రస్తుతము దీనిలో చాలా భాగము సంస్కరించబడినది. 'లిప్‌మానా' అనే శాస్త్రజ్ఞుడు త్రీడైమెన్షనల్ ఫోటోగ్రఫి కోసము తయారుచేసిన ప్లేట్లను హోలోగ్రఫీలో బిగించి ఫోటో తీయటానికి మాత్రము సాధారణమైన వెలుతురునే ఉపయోగించి పని జరిపించేశాడు. ఈ మార్పు చెయ్యటము వల్ల పని నిరాటంక మైనది. సర్వసాధారణ జనాలకు కూడా హోలోగ్రఫీ యొక్క ఆనందము అందుబాటులోకి వచ్చింది. ఇక ఇప్పుడు దానికి కావల్సిన తేలికపాటి యంత్రములను తయారుచెయ్యటమే మిగిలి ఉన్నది.

డైనిస్‌గైవర్ అనే బ్రిటీష్ పౌరుడు హోలోగ్రఫీని కనుగొన్నాడు. దీనికిగాను భౌతికశాస్త్రములో అతనికి నోబెల్‌బహుమతి ఇవ్వబడినది. అద్భుతమైన పరిశోధనలలో ఈ భౌతికపరిశోధన మరీ అద్భుతమైనదానినిగా చెప్పుకోవచ్చు. ఐతే దీని కార్యక్షేత్రము ఇంకా కొన్ని నిర్ణయించబడిన ప్రయోగశాలల్లోనే ఉన్నది. చలన చిత్రములు లేదా టెలివిజన్ వలె సామాన్యజనులు కూడా దీనివలన లాభాన్వితులు కాగలిగినంత వ్యాపకము, విస్తృతము కాలేదు కానీ; ఆరోజు ఇంకెంతో దూరంలో లేదని చెప్పవచ్చు. ఫోటోగ్రఫీకి చెందిన విజ్ఞానమును అది కొనుగొన బడిన 112 సంవత్సరముల తరువాతగానీ జన సామాన్యము నకు ఉపయుక్తము కాలేదు. అలాగే టెలిఫోన్ 56 సంవత్సరముల తరువాత, టెలివిజన్ 12 సంవత్సరముల పిదప, అణుబాంబు 5 సంవత్సరముల తదుపరి...... అంటే అవి కనుగొనబడిన పిదప అనేక సంవత్సరముల తరువాతనే అవి జన బాహుళ్యము నకు ఉపయోగములోకి వచ్చాయి. అదే విధముగా హోలోగ్రఫీకి కూడా ఇంకా కొంత సమయము పడుతుంది. కానీ అది ఉపయోగములోకి వచ్చినప్పుడు ఇంతకు ముందెన్నడూ దానిని చూడని వ్యక్తులకు ఆ అనుభవము ఎంతో ఆశ్చర్యకరముగా ఏదో గారడీ వలె అనిపించి తీరుతుంది.

– అనువాదం: *శ్రీమతి కృష్ణకుమారి*

## లిటిల్ మదర్

*డోనా థెరిసా 13 సంవత్సరాల పాప. 8 మంది సంతానంలో ఈమె పెద్దది. తల్లి మరణంతో ఈమె కుటుంబ భారాన్ని స్వీకరించింది. తనకంటే చిన్నవారినందరిని పెంచి పెద్ద చేసే బాధ్యతను స్వీకరించిన ఈ 13 సంవత్సరాల పాపను అందరూ "లిటిల్ మదర్" అని పిలిచేవారు. పరిస్థితులే ఆమెకు తల్లి హృదయం ఎలా ఉండాలో, తల్లి బాధ్యతలేమిటో నేర్పించాయి. ఈమెకు 32 సంవత్సరాలు నిండేసరికి తమ్ముళ్ళు, చెల్లెళ్ళు, ప్రయోజకులై జీవితంలో స్థిరపడ్డారు. బాధ్యతలు తీరిన ఈ లిటిల్ మదర్‌ను వివాహం చేసుకొని ఆనందంగా జీవించుమని అందరూ సలహా ఇచ్చేవారు. దానికి ఆమె 'నా మనస్సు అతి గౌరవప్రదమైన తల్లి పదవిలో స్థిరపడిపోయింది, ఇది తిరిగి దాంపత్య విలాసాల మధ్య అడుగుపెట్టజాలదని తెలియజేసింది.'*

– మూలం: *ప్రజ్ఞాపురాణ కథల నుండి*
అనువాదం: *శ్రీమతి నేమాని గౌరీ సావిత్రి*

**ఈ ప్రపంచం సౌందర్యం ముందు మోకరిల్లుతుంది**

## పరమపూజ్య గురుదేవుల అమృత వచనాలు - 4

# ఆలోచనల గొప్పతనం మరియు వాని స్వరూపము

భూతకాలంలో జరిగిన సంఘటనల గురించి విచారించుటను "చింతన" అంటారు. భూతకాలంలో జరిగిన సంఘటనలు బహిర్గతమైన విధానంపై సమీక్ష జరుపుట మంచిది. నిన్ను నీవు సమీక్షించుకొననిచో ఇతరుల సమీక్షించుట సాధ్యమా? ఇరుగుపొరుగు వారి చర్యలను సమీక్షించుతావు. భార్య దోషాలను పట్టించుకోం, పిల్లల తప్పులెన్నుతాం, యావత్ ప్రపంచాన్ని తప్పు పడతాం, భగవంతుని తప్పు పడతాం, ప్రతి వ్యక్తిని తప్పు పడతాం. మనచే తప్పు పట్టనివారు ఎవరైన మిగిలి ఉన్నారా? కాని మీ తప్పులను మీరు సమీక్షించుకొనుట లేదు. మీ తప్పులను మీరు సమీక్షించుట ప్రారంభించాలి. మీ ప్రవర్తనను మీరు సమీక్షించుట ప్రారంభిస్తే ఏ ఏ తప్పులు మీరు చేయకుండా ఉండవలసింది మీకు తెలిసి వస్తుంది. అట్లే ఏ ఏ మాటలు మీరు మాట్లాడకూడదో, ఏ ఏ పనులు మీరు చేయకూడదో కూడా మీకు అవగతమవుతుంది.

మీ మనస్సు చాలా విలక్షణతో కూడి ఉన్నది. మనదంతా మంచిది, మనము చేసేదంతా మంచిది అని మనకు మాటికి మాటికి చెప్తుంది. అట్లే మన స్వభావం మంచిది, మన అలవాట్లు మంచివి మన ఆలోచనలు మంచివి, మన భావాలు మంచివి, మనవన్నీ మంచివి అంటూ మన ఎదుట వారివి అన్నీ తప్పులే అని చెప్పుతూ ఉంటుంది. ఆధ్యాత్మిక ఉన్నతికి ఇది గొప్ప అవరోధము. దీనికి మించిన అవరోధము మరొకటి లేదు కావున మొదటి మనల మనం సమీక్షించు కొనుట నేర్చుకోవాలి.

ఏకాంతంగా కూర్చొని మీరు ఆలోచించుకున్నచో మీరు ఒంటరివారని మీకు తోడు ఎవ్వరు లేరని మీకు తెలిసి వస్తుంది. మీకు తోడుగానున్నవారిని, వారి స్థానంలో సహాయకులను, వారి స్థానంలో కుటుంబ సభ్యులను, వారి స్థానంలో సంపదలను, వాని స్థానంలో వ్యాపారాన్ని దాని స్థానంలో, మీ కార్యకలాపాలను పెట్టి కలగాపులం చేసి స్పష్టతను కోల్పోతూ ఉంటారు. కావున వీటన్నింటిని వాని వాని స్థానాల్లో ఉంచండి. మీరు మాత్రం కేవలం దీనిని గురించి ఆలోచించండి. నేను గడచిన రోజులలో ఏమేమి మరచాను? దారి తప్పిపోలేదు గదా? దారి మరువలేదు కదా? ఇందు వలననే జన్మ లభించిందా? ఏ పనిచేయుటకై ఈ జన్మ లభించింది? ఆ పనిని చేయుచున్నానా? ఆకలి తీర్చుకొనుట కెంత అవసరమో అంతకు మించి తింటున్నానా? ఏమి? కుటుంబానికై ఎంతవరకు బాధ్యతను స్వీకరించాలో, అంతకు మించి అనవసరమైన రీతిలో బరువు బాధ్యతలనెత్తికెత్తుకొనుచున్నానా? ఎవ్వరికైతే ఏ వస్తువుల అవసరం లేదో వానిని బహుమానంగా వారి నెత్తిన పెట్టుచున్నామా? దీనికి కారణం ఏమిటి? ఇవన్నీ తప్పులే!

మీ ఆరోగ్య సంరక్షణకై ఆహార పానీయాలు, ఆహార విహారాలు, ఎలా ఉండాలో అదే విధంగా ఉన్నాయా? ఆలోచన విధానంలో సరళిత నిండి ఉండాలి అలా ఉన్నదా? మన శరీరం సంరక్షణ పట్ల మస్తిష్కం పట్ల, కుటుంబం పట్ల నిర్వర్తింపవలసిన మన బాధ్యతల నిర్వర్తించలేదు. కర్తవ్యాల పూర్తిపట్ల మనం వెనుకబడి ఉన్నాం! ఎక్కడెక్కడ మనం వెనుకబడి ఉన్నామో, ఆయా రంగాల పట్ల లోతుగా ఆలోచించుట మంచిది. ఏలనన - తప్పులు లేక లోపాలు తెలిసినంతనే వానిని సవరించుకొనే మార్గం కనిపిస్తుంది. దీనికై సమీక్ష చేయుట అత్యంత అవసరం. మీకై మీరు ఆత్మ పరిశీలన చేసికోండి.

నేరాన్ని మాత్రమే పాపమని పిలవరు. జీవితాన్ని, జీవన మార్గాన్ని అస్తవ్యస్తం చేసినచో దీనిని కూడా పాపమనెదరు. దొంగతనం, బందిపోటు చర్య, హత్య, మున్నగునవి కూడా చెడ్డ పనులే. వీనితోపాటు సోమరితనం, క్రమశిక్షణా రాహిత్యంతో కాలాన్ని వృధా చేయుట కూడా చెడు పనుల క్రిందికే వస్తుంది. మీ యొక్క స్వభావాన్ని కోపభూయిష్టంగా, ఈర్ష్యతో కూడినదిగా తయారు చేసుకున్నారు. మీ చింతనను, మననలను అస్తవ్యస్త స్థితిలో ఉంచారు. ఇదంతా ధైర్యస్థులు చేసే పనేనా? ఇవన్నీ తప్పిదం వ్యక్తిగత జీవనంలో మీ యొక్క గుణాలు, పనులు, స్వభావం, మున్నగు వానికి చెందిన తప్పులు ఏమయ్యాయి! మరియు నేరము, అపరాధం, అత్యాచారం మున్నగువానికి

**కంటికి కనిపించే ప్రతిదానిని కోరుట మానవ సహజం**

సంబంధించిన వాని నుండి బయటపడుట లేదు. వీనిని గురించి మరోసారి ఆలోచించండి. ఇది అత్యవసరము. దీనిద్వారా మన తప్పులేమిటో తెలిసివస్తాయి. దీనితోపాటు మన తప్పిదాలలో ఎన్నింటికి ముగింపు పలికాం, ఇంకా ఎన్నింటికి ముగింపు పలకాలి తెలుస్తుంది, వీని పరిష్కారం తరువాత తదుపరి అడుగు ఆత్మ పరిష్కారం.

ఆత్మనిరీక్షణానంతరము ఆత్మ పరిష్కారం దిశగా రెండవ అడుగు వేయాలి. పరిష్కారం ఎలా చేయాలి? పరిష్కార ప్రక్రియ లకు ఏ మాట మాట్లాడాలి? పరిష్కారాన్ని కోరుకున్నప్పుడు, ఉదాహరణకు మీకు సారాయి త్రాగెడి అలవాటు ఉన్నచో దానిని మానుకోవాలి. మీకు అలవాటు లేదంటారా? అయితే పొగ త్రాగెడి అలవాటు ఉంది. ధైర్యంతో ఆలోచించండి. ఇప్పుడు కూడా ధైర్యాన్ని ప్రదర్శించరా? ఆత్మపరిశోధన దీని పేరు. చేసిన లేక జరిగిన తప్పులపై తిరుగుబాటు చేయండి, తప్పుల నిలువరించుటకై సంసిద్ధులు కండి. సంకల్పబలాన్ని దృఢతరం గావించుకోండి. ఇక మరచిపోవుట జరుగదు. దీనికై కార్యాచరణను రూపొందించుకోండి.

తప్పులు దొర్లకుండా ఉండే విధానమేది? ఏమి మీరు చేస్తారా? మీలో లోపాలు పొడచూపినచో ఆ లోపాలను విడచి పెట్టజాలనిచో ఒక ఉపాయాన్ని ఆలోచించండి. పక్షపాతం మరియు సంపన్నత కొరకై మీ మనస్సు ఇచ్ఛగించినచో, అప్పుడు మీరు మీ మనస్సుతో విభేదించండి. మనస్సును నిగ్రహించు కోండి, మనస్సులోని కోరికను త్రుంచి వేయండి. మనస్సుతో పోట్లాడండి. దీనినే ఆత్మ పరిష్కారమనెదరు. ఆత్మ నిరీక్షణ మరియు ఆత్మపరిష్కారం లేక పరిశోధన. ఈ రెండింటిని అనుసంధానించినచో ఆలోచన పరిపూర్ణమవుతుంది. ఈ రోజు మీతో మీరు చెప్పుకోవలసింది ఇదే.

## మానవులను ప్రేమించు

మనము ఏ భారతీయ సంస్కృతి మరియు భారతీయ ఆలోచనల ప్రచారం చేయాలని కోరుకొనుచున్నామో, వాని ద్వారా మన సమస్త కష్టాలు నివారణ అవుతాయి. రాజనీతి శక్తి ద్వారా మనకు అధికారుల నుండి రక్షణ లభించవచ్చు. కాని మన సుఖదుఃఖాలు ఏ స్థానం నుండి ఉత్పత్తి అవుతున్నాయో వానిని రాజనీతి శక్తి నియంత్రించజాలదు. ఈ పని ఒక్క ఆధ్యాత్మిక ఉన్నతి ద్వారా మాత్రమే నెరవేర్చుకోగలం.

మనుష్యుని మనుష్యునిగా తీర్చిదిద్దగల్గెడి శక్తి భారతీయ సంస్కృతికి ఉన్నది, మనుష్యుడు, మనుష్యుని ప్రేమించుటకై జన్మించాడు కాని, కొట్టుకుంటూ చంపుకొనుటకు కాదు అని భారతీయ సంస్కృతి మనకు నేర్పుచున్నది. మన అన్ని కార్యక్రమాలు సరియైన పద్ధతిలో నిర్వహింపబడుచున్నచో భారతీయ సంస్కృతి యొక్క సర్వోదయం తప్పక జరిగి తీరుతుంది.

– *తెలుగుసేత: ఎ. శారద*

## అహంకారం కళ్ళు గప్పితే - పతనమే

*ఒక చిన్న కాలువ ఉన్నది. దానిని దాటుటకు ఒక చిన్న వంతెన వంటి దానిని నిర్మించారు. ఈ వంతెనపై ఒకేసారి ఒక్కరు మాత్రమే వెళ్ళగలరు. ఎదురెదురుగా వచ్చినచో తప్పుకొని ప్రయాణించుట వీలు కాదు.*

*ఒకరోజు రెండు గొఱ్ఱెలు ఎదురెదురుగా వచ్చి వంతెన మధ్యలో నిలిచిపోయాయి. ఏ ఒక్కటి వెనుతిరిగి వెళ్ళుటకు సిద్ధంగా లేదు. అహంకారాన్ని ఎవ్వరు విడచిపెడతారు? పోట్లాడుకుంటూ చావుకైనా సిద్ధపడ్డాయి. పరస్పరం కోపంగా చూచుకుంటున్నాయి. ఈ కోపోద్రేకంతో ఢీకొట్టు కుంటున్నాయి. స్వల్ప కొట్లాటతో ప్రారంభమైనది – పెద్ద దెబ్బలాటకు చేరుకుంది. రెండు ఒకదానినొకటి నెట్టుకుంటూ నదిలో పడిపోయాయి. చావుకు తెగించి పోట్లాడుకుంటు మునిగిపోయాయి. మొండితనం త్రుతిమించగా వివేకాన్ని కోల్పోవుట సహజం.*

*ధర్మం మరియు సంప్రదాయవాదుల పరిస్థితి కూడా ఇలానే ఉంది. అన్ని ధర్మాల యొక్క మూల సిద్ధాంతం ఒక్కటే. అన్నీ ధర్మాలు మానవీయతను వల్లిస్తుంటాయి. కానీ వ్యక్తి అతని హృదయాంతరాళాల్లోనికి ధర్మ సంప్రదాయాల అసలు తత్వాన్ని చొప్పించజాలకున్నాడు. అతని మూర్ఖత్వం వలన పరస్పరం కలహించుకొంటూ తనశక్తిని నష్టపరచుకుంటూ సమాజాన్ని చెడగొట్టుచున్నారు.*

*– యుగనిర్మాణ యోజన ఫిబ్రవరి 2015*
*అనువాదం: ఎ. శారద*

**తప్పు ఒప్పులు నిర్ణయము చేసేది వివేకం**

నాదబ్రహ్మ - శబ్దబ్రహ్మ

# శబ్దమునకున్న గొప్ప (మహా)శక్తి

'మనిషి యొక్క ప్రాకృతికమైన తొలిపలుకు గద్యము కాదు-పద్యము' అని ప్రొ. డాబ్సన్‌తో పాటు అనేకమంది విద్వాంసులు విశ్వసనీయముగా పలుమార్లు నొక్కి వక్కాణించారు. డాబ్సన్ తాను చెప్పిన విషయమును సోదాహరణగా వివరిస్తూ 'నేను అనేకమార్లు జర్మన్‌భాషలో వ్రాయబడిన కవిత్వమును ఫ్రెంచ్ బాలురకు; ఫ్రెంచ్‌భాషలో వ్రాయబడిన కవిత్వమును జర్మన్ బాలురకు వినిపించినప్పుడు ఇరు దేశముల పిల్లలకు ఆయా పరభాషలు తెలియకపోయినప్పటికినీ నేను చెప్పిన కవిత యొక్క తాత్పర్యమును చెప్పగలిగారు' అని అన్నాడు. ఇలాంటి సంఘటనల వెనుక పంచతత్త్వముల (పృథ్వి-జల-అగ్ని-వాయు-ఆకాశ తత్త్వములు) ఒకానొక ధార అంతర్గతముగా పనిచేస్తు ఉంటుంది. మానవజాతికి పంచతత్త్వములతో విడదీయరాని సంబంధమున్నది. తాత్వికమైన ధారలు ఏరీతిలో ఉత్పన్నము చేయబడినప్పటికినీ తప్పకుండా తమ ప్రభావమును చూపించే తీరుతాయి. 'వాక్‌శక్తికి' పంచతత్త్వములతో గల సంబంధ మేమిటి? ముందుగా ఈ విషయమును పరిశీలించి అవగాహన చేసుకున్నచో 'కవిత్వమును చెప్పినప్పుడు ఏ రీతిలో కవిత యొక్క భావము మనస్సుకు బోధపడుతుంది' అన్న జ్ఞానము దానికదే ఆవిష్కరించబడుతుంది.

'ధ్వని అనగా ఒకవిధమైన కంపనమే!' అని విజ్ఞానశాస్త్రం చెపుతున్నది. వివిధరకములైన ధ్వనులు ఉత్పన్నమవ్వటానికి కంపనములు కూడా వేర్వేరుగా ఆవిర్భవించాలి. అనేక రకములైన కంపనములను ఆవిర్భవింపజేయుట వెనుక గల ఉద్దేశ్యము 'ఒక నిమిషం లేదా ఒక సెకెండ్‌లో భిన్నభిన్న సంఖ్యలు గల కంపనములను ఉత్పన్నము చేయుట.' ఉదా॥ పెద్ద శబ్దము వినిపించాలంటే ఒక్క సెకెండ్‌లో 112 కంపనములు వెలువడాలి అనుకుందాము. దాని తరువాత చేసే వేరొక శబ్దము వినపడటానికి ప్రతి సెకెండ్‌కు తప్పనిసరిగా 112 కన్నా ఎక్కువ లేదా తక్కువ కంపనములు ఉత్పన్నమవ్వాలి. అప్పుడే రెండు శబ్దముల మధ్య తేడా తెలుస్తుంది. అసలు కంపనము అని దేన్ని అంటారు. ఈ కంపనములను ప్రత్యక్షముగా చూడటానికి గానూ ఒక డోలును వాయిస్తున్నప్పుడు గమనించండి. చర్మంతో చేయబడిన ఆ డోలు ప్రక్క భాగమును జాగ్రత్తగా చూసినప్పుడు డోలును వాయించిన ఆ చోటునుండి కంపనములు ఉత్పన్న మవ్వటము గోచరిస్తుంది. ప్రతి నిమిషానికి అటువంటి ఎన్ని తరంగములు ఆవిర్భవించాయి అన్నదాని ఆధారముగానే శబ్ద-నిర్మాణము జరుగుతుంది. సంగీతకారులు సంగీత వాయిద్యములను పలికిస్తున్నప్పుడు సునిశితముగా పరిశీలించినచో వారు-ఒక్కొక్కసారి గాలిలోనే శబ్దములను సృష్టిస్తారు, కొన్నిసార్లు వీణలో ఉండే తీగలను సుతారముగా మీటడం ద్వారా, ఇంకొన్నిసార్లు ఫిడేల్‌వాయిద్యమును సున్నితముగా స్పృశించడం ద్వారా ధ్వనులను సృష్టించడము జరుగుతోందని మీకు తెలుస్తుంది. సితార్‌వాద్య పరికరమును వాయిస్తున్నప్పుడు ప్రతి నిమిషము ఈ కంపనముల సంఖ్యను మార్చటానికిగానూ సితార్‌ను వ్రేళ్ళతో అలవోకగా మీటుతూ విభిన్నమైన అద్భుత రాగములను ఆవిష్కరిస్తూంటారు. వేణువును నోటితో ఊదుతూ; వ్రేళ్ళతో రంధ్రములను మూస్తూ-తెరుస్తూ వేణుగానమును ఆలపిస్తారు. సంగీతవిద్వాంసులు ఈవిధముగా ఎన్నోరకములైన ధ్వనులను సృష్టిస్తుంటారు.

మానవుని కంఠము కూడా ఏ సంగీతపరికరమునకూ తీసిపోదు. అంతేకాదు మనిషి గొంతు శ్రావ్యతను ఒలికించటానికి అనువుగా యంత్రములను మించిన సాటిలేని మేటి నిర్మాణ శైలిని కలిగి ఉంటుంది. కంఠం ఎలా నిర్మించబడినది అన్న విషయము శబ్దవిజ్ఞానులకు లేదా వైద్యులకు సంబంధించిన శాస్త్రీయమైన అంశము. అయితే ఇక్కడ ఒక్క విషయమును మాత్రము తప్పకుండా చెప్పుకుని తీరవల్సిందే. చెప్పాలంటే మానవుని కంఠం ఒక ఖాళీ గొట్టము వంటిది. మనిషి కంఠమును ఒక బోలుగొట్టముతో పోల్చవచ్చు. సితార్ లేక వీణలో ఉండే తీగల వలె కంపనములను ఉత్పన్నము చేయగలిగే రెండు మందపాటి నాళములు మన కంఠములో ఉంటాయి. అవి

ఒంటరిగా వస్తాడు - శరీరమనే జైలులోనే వశిస్తాడు - ఒంటరిగానే పోతాడు

ఎంత సున్నితముగా ఉంటాయంటే సాధారణముగా వాటిలో ఎట్టి కంపనమూ ఉత్పన్నమవ్వదు. ఐతే జలతత్త్వధార వాటిని గట్టిగా ఢీకొట్టి అవి కంపించేటట్లు చేస్తుంది. శబ్దతరంగములను ఉద్భవింపజేసే జలతత్త్వధారలు కేవలము బయటినుండి మాత్రమే వస్తూండవు. మనలను కదిలించగలిగే కొన్ని గుప్తధారలు ఆత్మ నుండి మస్తిష్కము గుండా మనలోకి వస్తూంటాయి. మెదడులోకి సంప్రేషితమైన ఆ ధారలను మనం ధారణ చేసి; వాటినుండి గ్రహించిన ఆలోచనలను, భావనలను మాటల ద్వారా వెలిబుచ్చుతాము. పలికించటానికి వీలుగా ఉండేందుకుగానూ సంగీతవాయిద్యములను ఎక్కువగా 'బోలుగా ఉండే సొరకాయబుఱ్ఱ ఆకారములో లేదా పొడవాటి ఖాళీ గొట్టము వంటి ఆకారములో' తయారుచేస్తూ ఉంటారు. మన ముక్కు-నోరు ఆవిధముగానే నిర్మించ బడ్డాయి. సితార్‌ని మీటుతున్నప్పుడు తీగలు తెగినచో కర్ణ కఠోరమైన ధ్వని వస్తుంది. సరిగ్గా అలాగే మనకు జలుబు చేసినప్పుడు, దగ్గు వచ్చినప్పుడు మన మాట కూడా బొంగురు పోయి వినటానికి ఎబ్బెట్టుగా ఉంటుంది.

జలతత్త్వము నుండే ధ్వని ఉత్పన్నమౌతుంది అన్నది నిజం! ఐతే మన శరీరములో నున్న ఇతర తత్త్వములు కూడా ధ్వనిని ప్రభావితము చేస్తాయి అన్నది కూడా నిజం. దీనిని పసికట్టిన మనిషి వాటి ఆధారముతో 49 భిన్న భిన్న స్వరరాగాలను కనుగొన్నాడు. 'స-రి-గ-మ-ప-ద-ని-స' అన్నవి సప్త స్వరములు!! సంగీతములో ఉండే ఆ 'సప్తస్వరాలు' కొన్ని హెచ్చుస్థాయిలో ఉంటే, కొన్ని మంద్రస్థాయిలో ఉంటాయి. మరల ఒక్కొక్క స్వరం దేనికదే భిన్నంగా వినిపిస్తుంది. ఈ సప్తస్వరాల నుండి 8 రాగములు కూర్చబడ్డాయి. మళ్ళీ అందు లోని ఒక్కొక్క రాగం నుండి విభిన్నమైన ఉప-స్వరరాగములు అనేకము రూపొందించబడ్డాయి. పైన చెప్పిన విషయమునంతా గమనించినప్పుడు ధ్వనిలో లెక్కలేనన్ని భేదాలు కన్పట్టుతాయి అని తెలుస్తుంది. ఐతే జలతత్త్వమే వీటన్నింటికి జన్మదాత్రి అని మరువకూడదు. జలతత్త్వము శక్తి వల్లగానీ లేదా దానికి ఇతర తత్త్వములు జోడించబడినప్పుడుగానీ భిన్న భిన్న ధ్వనులు ఉద్భవిస్తాయి. శబ్దము పుట్టటానికి ఇవే ఆలంబనగా నిలుస్తాయి. అంటే వీటివల్లనే ధ్వనులు ఉత్పన్నమౌతాయి అని తెలుసుకోవాలి.

ప్రతి ఒక్క శబ్దము యొక్క తాత్త్విక ప్రభావము మన శరీరము మీద పడుతుంది. అటువంటి తాత్విక ధ్వని యొక్క ప్రభావముతో అనేక వ్యాధులను తగ్గించవచ్చు. అలాగే శబ్దము ద్వారా మంచి లేదా చెడు ప్రకృతిని కూడా నిర్మించవచ్చును. అగ్నితత్త్వముతో కూర్చబడిన ఏదైనా ఒక రాగం ఆలపించబడి నప్పుడు అది ప్రాణమును అరుణవర్ణములోకి మార్చివేస్తుంది. అదేవిధముగా ప్రాణమును -వాయుతత్త్వము నీలివర్ణము గానూ మరియు తెలుపువర్ణముగానూ; ఆకాశతత్త్వము-నలుపు రంగుగానూ, అలాగే పృథ్వీతత్త్వము-పసుపువర్ణముగానూ మార్చివేస్తాయి. అగ్నితత్త్వముతో కూర్చబడిన రాగం వేడిని రగిలిస్తుంది. కోపమును తట్టి లేపుతుంది. నిద్రను కలిగిస్తుంది. అన్నమును జీర్ణం చేస్తుంది. ఆకాశతత్త్వముతో కూర్చబడిన పాటను గానం చేసినప్పుడు అది భయమును రేకెత్తిస్తుంది. మతిమరుపు అనే జాడ్యమునకు లోనుగావిస్తుంది. పాటల ద్వారా ప్రేమ, శత్రుత్వము, భక్తి, నీతి, అవినీతి మొదలైన గుణములు తలెత్తేవిధముగా ప్రేరణను కలిగించవచ్చును.

అగ్నితత్త్వముతో కూడిన ధ్వనిశక్తి యొక్క మరో కోణమును పరిశీలిద్దాము. మనం మాట్లాడిన మాటలు అగ్నితత్త్వముతో ప్రభావితమై ఉన్నచో దాని నుండి రగిలిన వేడి మన శరీరమును దహించివేస్తుంది. మనలను నిస్సత్తువుగా, బలహీనముగా మార్చివేస్తుంది. దానితోపాటు మనమీద అనేక రోగములు దాడి చేస్తాయి. అలా కాకుండా మన మాటలో ప్రేమ, భక్తి, దయ, నీతి అనే భావనలు తొంగిచూచినచో అలాంటి మాటలు వినే వారికి ప్రసన్నముగానూ, సంతోషముగానూ ఉంటుంది. అందరూ సుమధురభాషణను అభ్యసించినచో ఈ పృథ్వి యావత్తూ తియ్యగా మాట్లాడే సజ్జనులతో నిండిపోతుంది. వాక్‌శక్తిని మంచిదిశలో ప్రయోగిస్తూండటము అనేది ఒక గొప్ప యోగాభ్యాసము కన్నా తక్కువైనదేమీ కాదు. అందుచేత మధురముగా మాట్లాడటమును అభ్యసించాలి. ఇతరులలో మంచి ప్రేరణను, ప్రోత్సాహమును కలిగించే మాటలను మాట్లాడటం ద్వారా వారు విజయమును పొందేందుకు సహాయ పడవచ్చు. కనుక అమోఘమైన వాక్శక్తిని సవ్యమైన దిశలో ఉపయోగించుకోవటమే ఎల్లవేళలా శ్రేయస్కరము!!

– *పూజ్యగురుదేవుల వాఙ్మయం (1.21) నుండి*
*అనువాదం: శ్రీమతి లక్ష్మీరాజగోపాలు*

**ఏకాంతం లేదు. సృష్టి అంతా నీ సహచరులే, బాంధవులే**

మనం - మన ఆరోగ్యం

# దీర్ఘకాలిక రోగములు - వాటి నివారణ

ఆధునిక నాగరికత పెరిగిపోయేకొద్దీ మనిషి తన సహజ జీవనానికి దూరమవుతున్నాడు. అతడి జీవనం ఎంత అసహజమై పోతూ ఉన్నదంటే అతడికి తెలిసో-తెలియకో తన శరీరములో రోగములు స్థిరనివాసము చేసుకునే రీతిలో అతడి అలవాట్లు ఏర్పడుతున్నాయి. ఆఖరుకు రోగమనేది 'అసహజ మైనది' అని కూడా అతడికి అనిపించటము లేదు. 'శరీరము ఆరోగ్యముగా ఉండటమనేది దాని సహజధర్మము' అన్న విషయమును కూడా అతడు విస్మరిస్తున్నాడు.

సంపూర్ణమైన లేదా ఒకేమాదిరియైన ఆరోగ్యముతో ఉన్న స్త్రీ-పురుషుల జీవితములను పరిశీలిస్తే ఆరోగ్యముగా ఉండటానికి వారు ఏమంత శ్రమ తీసుకోవల్సిన అవసరము లేదనిపిస్తుంది. మనస్సునూ, శరీరమునూ ఆరోగ్యముగా ఉంచుకొనే అలవాటును పెంపొందించుకొనగలిగితే ఇక రోగమునకు స్థానము ఉండదు.

జబ్బులను దూరముగా తరిమికొట్టే పద్ధతిని తెలుసు కొనడము కన్నా ముందు అసలు రోగమునకు కారణము మలినములు మాత్రమే, వాటిని వెలుపలికి నెట్టివేసి శరీరమును ఆరోగ్యముగా ఉంచుకునేందుకు శరీరము శ్రమపడుతుంది అన్న విషయమును బాగా అర్థము చేసుకోవాలి. శరీరములోని రక్తము స్వచ్ఛము, మలినరహితము అయినప్పుడు ఎలాంటి రోగమూ మన దరికి చేరలేదు. రక్తములోని జీవనీశక్తి క్షీణించి నప్పుడు, అది మలినములతో నిండిపోయినప్పుడు పలు రకము లైన రోగములు తలెత్తుతాయి. మన శరీరములో మలినము లను విసర్జించే అవయవములైన మలము, మూత్రము, చెమట, శ్వాస మొదలైనవాటిద్వారా శరీరములో పెద్ద మొత్తములో నిత్యమూ ప్రోగుపడుతూండే మలినములను సంపూర్ణముగా బయటకు నెట్టివేయబడకపోయినట్లైతే అవి రక్తమును మలినం చేస్తాయి. మలినమైన రక్తమే వివిధ రకములైన రోగములకు మూలస్థానమవుతుంది. రక్తము మలినమవుతున్నది అన్న సూచన మనకు ఏదైనా నొప్పి, దగ్గు, బాధ వంటివాటి రూపములో లభించకపోతే రక్తము మరింతగా మలినమై విషముగా మారి 'మృత్యువు తప్పనిసరి' అన్న స్థితిని మనకు కలుగజేస్తుంది.

అందుచేతనే ఫెడరిక్ 'జబ్బు అనేది భగవంతుడు ప్రసాదించిన వరం. వ్యాధి అనేదే లేకపోతే మానవ జాతి ఎప్పుడో అంతరించి పోయి ఉండేది' అని నిర్వచించాడు. వ్యాధిని మనం స్నేహితుడిగా భావించాలి. ప్రకృతి సహజముగా ఇచ్చిన ఈ హెచ్చరిక మీద మనం వెంటనే దృష్టి సారించాలి. దానిని శత్రువుగా భావించి అణచిపెట్టే ప్రయత్నము చేసేకన్నా; అసలు ఆ వ్యాధికి కారణము తెలుసుకొని దానిని తొలగించుకునే ప్రయత్నము చెయ్యటము చాలా అవసరము.

కానీ శరీరము అందించిన హెచ్చరికను మనం సరిగ్గా అర్థము చేసుకొనలేకపోవటము చేత రోగసూచనలను తొలగించుకునే ప్రయత్నము చెయ్యటానికి బదులు అణచిపెట్టే ప్రయత్నము చేస్తాము. అందుచేత హెచ్చరిక నెమ్మదినెమ్మదిగా క్షీణమవుతుంది. ఇక ఇక్కడినుండి దీర్ఘరోగము యొక్క మూలము స్థిరపడుతుంది. ఈ హెచ్చరిక అనేది మన జీవనీశక్తి (వ్యాధి నిరోధక శక్తి)ని సూచిస్తుంది. ఇది శరీరమును స్వచ్ఛపరచి రోగమును వెలుపలికి లాగే ప్రయత్నము చేస్తుంది.

దీర్ఘరోగములను తొలగించడమంటే ఈ జీవనీశక్తిని బాగా వృద్ధిచేసి ఉపయోగించి రోగమును నివారించగలిగే నేర్పు. ఈ శక్తిని బాగా ఉపయోగించుకొనగలిగే వ్యక్తి తన శరీరమును అంతే చక్కగా రోగరహితము గావించుకొనడములో సఫలీకృతు డవుతాడు.

### చికిత్సావిధానములు

చికిత్సకు ఉపయోగపడే సాధనాలు భోజనము, జలము, గాలి, **ఎండ, వ్యాయామము.** ఈ ఐదింటిని ఎంతో తెలివితో, నైపుణ్యముతో వాడుకొనవల్సి ఉంటుంది. వీటిని ఎంత ఎక్కువగా ఉపయోగించుకుంటే అంత మేలు కలుగుతుంది అని అనుకోవటం తప్పు. రోగతీవ్రత, రోగి యొక్క శారీరక స్థితిననుసరించి వీటిని చికిత్సా సమయములో ఎక్కువ-తక్కువలలో ఉపయోగించుకొనడము తెలివిగలవాళ్ళు చేసే పని. రోగి మాంసాహారియైనా, వైద్యుడు ఇచ్చిన మందులను

గంగ తన ప్రియుడైన సముద్రుని చేరుతున్న రీతిలో, మనుష్యుడు తన ప్రియతముడైన పరమాత్మని చేరుకోవాలి

అధిక పరిమాణములో వాడి ఉన్నా, అలాంటి వ్యక్తులకు చికిత్స చేసే విషయములో అప్రమత్తముగా ఉండాలి. ఎక్కువ శాతం రోగములకు మితిమీరిన లేదా అసహజమైన ఆహారమే కారణమై ఉంటుంది. కాబట్టి దాదాపు రోగులందరికీ ఆహారమును సంస్కరించడంతోనే చికిత్స ప్రారంభించాలి.

**ఆహారముః ఆహారము జీవితమును ఇస్తుంది, హరిస్తుంది కూడా!**

ఎక్కువమంది ప్రజలకు భోజనము తీసుకునే పద్ధతి వల్లనే తీవ్రరోగములు వస్తుంటాయి. అలాంటి పరిస్థితులలో ఏమీ చెయ్యకుండా ఆహారమును వదిలివేస్తే పరిస్థితి దానంతటదే చక్కబడుతుంది. దీర్ఘరోగముల విషయములో ఆహారములోని మంచి-చెడు లక్షణముల పట్ల దృష్టిని ఉంచడము చాలా అవసరము. ఉపయుక్తమైన ఆహారమును, అదికూడా తగు మోతాదులో మాత్రమే తీసుకోవాలి. ఒక కమలాపండు తీసుకొనడం వల్ల శరీరము ఎంత శుభ్రపడుతుందో; రెండు పండ్లు తీసుకుంటే అంతకు రెట్టింపుగా శుభ్రపడుతుంది అని అనుకోవటం సరికాదు. అమృతమైనాసరే అవసరమునకు మించి తీసుకుంటే అది విషముగా మారిపోతుంది.

ఆహారమును రెండు భాగములుగా విభజించవచ్చు. ఒకటి కఫకారకమైనదైతే-రెండవది కఫనివారకమైనది. కంద మినహా మిగతా అన్నిరకములైన కాయగూరలు, ఆకుకూరలు; అరటి పండు తప్ప మిగిలిన అన్నిరకముల పండ్లూ కఫనివారక భోజనము క్రిందికే వస్తాయి. అన్నం, పప్పు, మాంసం, రొట్టెలు, నూనె, నెయ్యి, బెల్లం, పంచదార, అన్నిరకములైన డ్రైఫ్రూట్స్ మొదలైనవి కఫకారక ఆహారము క్రిందికి వస్తాయి. కఫకారక ఆహారపదార్థములు రోగమును తగ్గించటములో సహాయ పడతాయన్నది వాస్తవం. అంటే మనిషికి కఫకారక భోజనము యొక్క అవసరమే లేదు అని చెప్పటము పొరపాటే అవుతుంది. ఆరోగ్యముగా ఉన్నప్పుడైనా, అనారోగ్యముగా ఉన్నప్పుడైనా కఫకారక ఆహారపదార్థములను తగు పరిమాణములో తీసుకొనుట అవసరమే!

### కఫం = జలతత్వం

మంచి ఫలితములను పొందటానికి కఫనివారకమైన ఆహార పదార్థములను చాలా జాగ్రత్తగా ఉపయోగించుకొనవల్సి ఉంటుంది. రోగియొక్క ఆహారములో నుండి కఫకారక పదార్థములను ఒక్కసారిగా తీసివేస్తే శరీరము శుభ్రపడే కార్యక్రమము అత్యంత వేగవంతమై తద్వారా ఏర్పడే ఉపద్రవ పరిస్థితులను రోగి తట్టుకొనలేకపోతాడు. ఉదా॥ డీహైడ్రేషన్ వంటివి వస్తాయి. అందుచేత కఫకారక పదార్థములను రోగి ఆహారము నుండి నెమ్మదినెమ్మదిగా తగ్గించడము మంచిది. కొంతమేరకు శుభ్రపడటము జరిగిన పిదప కేవలము కఫ నివారక భోజనము పైననే రోగి ఉండగలడు. రోగి శక్తినను సరించి కఫనివారక భోజనము పైన కొన్ని రోజులు ఉండనిచ్చి తిరిగి కఫకారక భోజనము స్వల్పముగా ఇవ్వవచ్చు. కఫకారక ఆహారములో గోధుమరొట్టె, పాలు మాత్రమే ఉచితమైనవి. దీనికి ఒక టైమ్‌టేబుల్ లాంటిది తయారుచేసుకొని ఆ ప్రకారముగా అనుసరిస్తూండాలి. ఒక నెలరోజుల కార్యక్రమాన్ని ఏర్పాటు చేసుకుంటే అందులో ఒక వారం లేదా కనీసం 3, 4 రోజులపాటు కేవలము కఫనివారకమైన ఆహారమునే స్వీకరించాలి. తిరిగి ఒక వారంపాటు మధ్యాహ్న సమయములో మాత్రమే కఫకారకమైన ఆహారమును అంటే రొట్టెలు మొదలైనవి తీసుకోవాలి. ఇక నెలలో మిగిలిన రోజులలో సాయంత్రం కూడా కఫకారకమైన పాలను తీసుకోవాలి. ఇక తరువాత పొద్దున్నే పండ్లు-మధ్యాహ్నం ఉడికించిన చిఱుధాన్యములు, రొట్టె-మళ్ళీ సాయంత్రం పండ్లు, పాలు వంటివి తీసుకోవాలి. ఈవిధముగా చేస్తూంటే శక్తి పెరుగుతూంటుంది. శరీరము శుభ్రపడుతూంటుంది. వ్యాధి నివారణ జరుగుతుంది. (సశేషం)

– అనువాదం: *శ్రీమతి కృష్ణకుమారి*

## లెనిన్

*రష్యా దేశంలో 'లెనిన్' మీద ఆక్రమణదారులు జరిపిన దాడితో గాయపడగా, హాస్పిటల్‌లో చికిత్స నిమిత్తం చేర్చారు? ఆ రోజుల్లో సమీపంలోనే ఒక రైల్వేలైను క్రొత్తగా నిర్మాణం జరుగుతుంది. లెనిన్ మౌనంగా ఎవరికి తెలియకుండా హాస్పిటల్ నుండి బయటకొచ్చి శ్రామికులతో కలసి పనిచేసి, తిరిగి హాస్పిటల్‌కి చేరేవాడు. 'సంఘర్షణ పరాయణత్వమున్న యోధుడు ఎన్నడూ విశ్రమించడు.*

– *అనువాదం:* జి. చెన్నకేశవరావు


**పరిమితి అంటే బంధం - అనంతం అంటే బంధ విముక్తి**

పూజ్య గురుదేవుల అమృతవాణి

# ఆధ్యాత్మిక ఔన్నత్యమునకు సోపానాలు యోగము మరియు తపస్సు - 4

*పరమపూజ్య గురుదేవులు తమ యొక్క అత్యంత మహత్త్వపూర్ణమైన ఈ ప్రబోధములో గాయత్రీపరివార్‌కు చెందిన నిష్ఠాగరిష్ఠులైన పరిజనులకు, కార్యకర్తలకు సందేశమిస్తూ 'అంతరంగమును యోగము-తపస్సు అనే రెండు సోపానముల సహాయముతో మాత్రమే సంస్కరించుకొనగలము' అని చెప్పినట్లు గత సంచికలో మీరు చదివియున్నారు. 'యోగము' అనేది కేవలము శారీరక క్రియలుగా మాత్రమే కాక; తమను తాము భగవంతునితో జోడించుకొనటమూ, భగవంతునితో కలిసిపోవటమూ అనికూడా వారు వ్యాఖ్యానిస్తున్నారు. ఒక నీటిబిందువు తనను తాను సముద్రములో కలిపివేసుకుంటుంది. ఒక పిల్లకాలువ తనను తాను గంగానదిలో ఐక్యం చేసుకుంటుంది. ఇలా సమర్పణ చేసుకున్న పిదప ఆ నీరు విస్తృత జలరాశి యొక్క ఒక అంగముగా తయారైపోతుంది. అలాగే మానవుడు కూడా అహంకారమును త్యజించి తననుతాను భగవంతునికి సమర్పించుకున్నప్పుడు యోగమనేది అతని జీవితములోకి ప్రవేశిస్తుంది' అని కూడా గురుదేవులు ప్రవచిస్తున్నారు. రండి! వారి అమృతవాణిని మరింతగా హృదయంగమము చేసుకుందాము!*

### మేము మా జీవితమునంతా ఆ భగవంతునికి సమర్పించుకున్నాము



'మేము మా జీవితమునంతా భగవంతుడు అని తలచే మా గురువు గారికి సమర్పించుకున్నాము. వారికి దేనినైనాసరే ఇవ్వగలగాలి' అన్న ఆలోచన ఒక్కటే సదా మా మనసులో నిండి ఉండేది. అందు కోసమై మా మహత్త్వాకాంక్షలన్నింటినీ మా గురువు గారికి సమర్పించుకున్నాము. ఫలితముగా మాకు ఎప్పుడు ఏది అవసరమో అది తప్పక లభిస్తూ ఉండేది. విద్య? మా వద్ద వేదములకు భాష్యం రచించగలిగేటంత సమృద్ధిగా ఉన్నది. సప్తర్షులు, వ్యాసుడు అందించిన వేదవాఙ్మయములతో పాటు యావత్ భారతీయ సంస్కృతికి సంబంధించిన వాఙ్మయమునంతటినీ హిందీభాషలో మీకు అందించాము. ఇదంతా కేవలము మావల్లమాత్రమే సాధ్యపడలేదు. మేము మా బుద్ధిని గురువుగారికి సమర్పించుకున్నాము. వారు తమ జ్ఞానమును మాకు అందించారు. మేమిద్దరమూ ఏకమైపోయాము.

మాకు ఎప్పుడు ఏది అవసరమైనా ఆవశ్యకత ననుసరించి అది మాకు లభ్యమౌతూండేది. మేము విదేశాలకు వెళ్ళాము. ఏ దేశమునకు వెళ్ళినా వారి మాతృభాషలోనే మాట్లాడవల్సివచ్చేది. అది ఎలా సాధ్యమవుతుంది? గురువుగారిని శరణువేడాము. వారి వాక్కు మాకు అందించబడినది. ఇక నిరాటంకముగా ప్రపంచమంతటా పర్యటించాము. గురువుగారి సంపద, వారి జ్ఞానము మాకు స్వంతమైనాయి.

### యోగము అంటేనే సమర్పణ

మేము సహస్రకుండీయజ్ఞం చేశాము. ఇందుకోసం నాలుగు లక్షల మంది పరిజనులను దేశం నలుమూలల నుండీ పిలిపించాము. వాళ్ళంతా నాలుగు రోజులపాటు ఉండవల్సివచ్చింది. అందరికి వసతి, ఆహారపానీయములకు సంబంధించిన ఏర్పాట్లన్నీ చేశాము. యజ్ఞం చేసినరోజు ఉదయం 20 లక్షలమంది - సాయంత్రం 20 లక్షలమంది వ్యక్తులు హాజరైనారు. అందరికీ విద్యుత్తుతో సహా ఉచిత భోజన, వసతులను ఏర్పాటు చెయ్యగలిగాము. ఇందుకోసము మాకు 50 లక్షల రూపాయలు ఖర్చయినాయి. ఫలితముగా మాకు కోట్ల రూపాయలు లభించాయి. ఇదంతా ఎలా సాధ్యమైంది? ఒక్కటే మార్గం. పిల్లకాలువ తననుతాను గంగానదిలో కలిపివేసుకున్న విధంగా మమ్మల్ని మేము భగవంతుడనే గంగానదిలో విలీనం

**స్వార్థం కోరికలకు పరిమితమైతే వారు క్షుద్రంగానే మిగిలిపోతారు**

చేసుకున్నాము. మావద్ద ఉన్నదేదైనాసరే స్వల్పమైనా, అధికమైనా సర్వమూ ఆ భగవంతునికే సమర్పించుకున్నాము. ఫలితముగా ఆయన తనకున్నదంతా మాకు అందించారు. ఇదే 'యోగమంటే!'

## ఇచ్ఛాపూర్వకముగా బాధను సహించగలగటమే తపస్సు!

యోగంతోపాటు తపస్సు అనే మరొక మెట్టు కూడా ఉన్నది. 'తపస్సు' అని దేనిని అంటారు. తపస్సంటే ఆహారపానీయములు మానివెయ్యటమూ, ఎండలో నిలబడటమూ, నేలపై నిద్రించడమూ మాత్రమే కాదు. దీనివెనుక ఒక రహస్యం దాగి ఉంది. ఒక లక్ష్యము ఇమిడియున్నది. అదేమిటంటే 'కష్టమును సహించటానికి ఇష్టపూర్వకముగా సిద్ధం కావటం!' ఏకాదశిరోజు అన్నం తినకుండా ఉండటము, నిర్జల-ఏకాదశి నాడు నీరు త్రాగకుండా ఉండటమంటే మనస్ఫూర్తిగా బాధను సహించగలగటము లేదా కష్టమును ఓర్చుకొనగలగటము. అదే తపస్సంటే. ఇది తెలుసుకోవాలి.

మనం చేసిన తప్పుల వల్లనో, అకర్మణ్యత్వం వల్లనో, చెడు పనుల వల్లనో మనం సహించలేనటువంటి దుఃఖ పూరితమైన కష్టములు మనమీద వచ్చిపడతాయి. అవి మన కళ్ళవెంట దుఃఖాశ్రువులను కురిపిస్తాయి. కానీ ఉపవాసం చెయ్యటమూ, నీరు త్రాగకుండా ఉండటమూ మొదలైనవి మనం (భగవంతుని పట్ల భక్తితో) ఇష్టపూర్వకముగా సంతోషముగా స్వీకరించే కష్టములు. వీటిని మీరు అభ్యసించాలి. కానీ ఉన్నతమైన ఆదర్శముల కోసము, లక్ష్యముల కోసము కష్టములను సహించగలగటమనే అభ్యాసమును మేము మీచేత చేయిస్తున్నాము. శ్రేష్ఠమైన మార్గములో తప్పకుండా కష్టములను ఎదుర్కొనవల్సివస్తుంది. ఈ ప్రపంచములో ఎంతమంది శ్రేష్ఠ పురుషులు, మహామానవులు, యోగులు, జ్ఞానులు ఉన్నారో వారంతా చిఱునవ్వులు చిందిస్తూ భోగపూరితమైన, ఉల్లాస కరమైన జీవితమునేమీ గడపలేదు. సంపన్నులుగా, ఘనముగా జీవించలేదు. కష్టాలనే సుడిగుండాల నడుమ జీవితమును సాగించారు. వారు తెలిసి తెలిసీ కష్టములను తమ నెత్తిపైన వేసుకుని బ్రతకడానికి సంసిద్ధమైనారు. కాబట్టే వారు తపస్వులు అని పిలువబడ్డారు. తపస్వి అయితే ఫలితమేమిటి? తపస్సు అంటే వేడి లేదా ఉష్ణము. వేడి చెయ్యటము వల్ల ప్రతి వస్తువూ శక్తివంతమౌతుంది. పచ్చి ఇటుక చాలా బలహీనముగా ఉండి ఎండకూ, వానకూ తట్టుకొనలేక త్వరగా పాడయిపోతుంది. అలాకాక ఇటుకలను బట్టీలో పెట్టి కాలిస్తే అవి గట్టిపడి దృఢముగా తయారవుతాయి. ఎండావానలకు చెక్కుచెదరకుండా ఏళ్ళ తరబడి మన్నుతాయి.

## తపించడాన్నే 'తపస్సు' అంటారు

వైద్యులు ఇనుమును కాల్చి భస్మముగా చేస్తారు. అప్పుడు అది చాలా శక్తివంతముగా తయారవుతుంది. కాబట్టి దాని వెల కూడా అధికముగానే ఉంటుంది. గనిలోనుండి వెలికి తీయబడిన ముడి ఇనుము మట్టితో కలిసుంటుంది. దానిని కొలిమిలో వేసి అత్యధికమైన ఉష్ణోగ్రత వద్ద వేడిచేస్తారు. ఆ వేడిలో లోహం కరిగి మట్టి వేరైపోతుంది. శుభ్రమైన ఇనుమును వేరుచేసి ఇంకా రెండు మూడుసార్లు అధిక ఉష్ణోగ్రత వద్ద వేడిచేస్తారు. అప్పుడది శుభ్రమైన, స్వచ్ఛమైన ఇనుముగా తయారై అవసరమునకు తగినట్లు తయారవుతుంది. అదేవిధముగా నీటిని వేడిచెయ్యడం ద్వారా శక్తి ఉత్పన్నమౌతుంది. చల్లనినీటికి శక్తి ఉండదు. పచ్చిమామిడికాయ పుల్లగా ఉంటుంది. దానిని గడ్డిలో పెట్టి వేడిగా ఉన్న ప్రదేశములో ఉంచితే అది పండి తియ్యగా తయారవుతుంది. అదేవిధముగా రెండు ఇనుప ముక్కలను సమాంతరముగా ఉంచి విద్యుత్తు-నిప్పు లేదా వాయువు... వీటిలో దేనితోనైనాసరే మండిస్తారు. అప్పుడు లోహం కరిగి, రెండు ముక్కలూ అతుక్కొని ఒక ముక్కగా మారిపోతుంది. దీనినే వెల్డింగ్ అంటారు. దీనిద్వారా ఆ రెండు ముక్కలూ ఎంత దృఢముగా అతుక్కుంటాయంటే తిరిగి వాటిని చేతితో వేరుచెయ్యటం అసాధ్యము. వెల్డింగ్ అంటే వేడి చెయ్యటము. ఇందులోని ఉద్దేశ్యమేమిటో మీకు ఈ యోగ సాధనా శిబిరములో తెలియజెప్పాలనుకుంటున్నాము. మేము మిమ్మల్ని వేడిచేసి అధిక ఉష్ణోగ్రత వద్ద తపింపజేసి కష్టముల లోనికి త్రోసివెయ్యాలనుకుంటున్నాము. అవి ఎలాంటి కష్టము లంటే మీ ప్రారబ్ధకర్మల ఫలితముగా కాక; బలవంతముగా కాక; మీరు ఇచ్ఛాపూర్వకముగా ఆహ్వానించిననాడు మీకు భగవంతునితో ఏకత్వము ఏర్పడుతుంది. ఆత్మ-పరమాత్మలు రెండూ ఏకమౌతాయి. మాకు సంపదలు, ఐశ్వర్యములు, సుఖ భోగములు, కీర్తిప్రతిష్ఠలు అవసరము లేదు. మాకు కష్టములను ప్రసాదించమని మీరు వేడుకున్నప్పుడు మీరు తాపసులౌతారు. తత్ఫలితముగా శక్తిసంపన్నులు కాగలరు.

**జీవితం ఒక క్రీడగా భావిస్తే అంతా ప్రశాంతతే!**

## తపస్సు యొక్క మహిమ అపారము

తపస్సు యొక్క ప్రాముఖ్యత భారతీయ సాహిత్యము నిండా వివరించబడియున్నది. ఆధ్యాత్మికతలో తపస్సు తప్ప మరేమీ లేదు. సప్తఋషులు, ధ్రువుడు, పార్వతీదేవి అందరూ తపస్సు చేసినవారే. తపస్సు ద్వారా ప్రచండమైన అగ్ని సృజించ బడుతుంది. భగీరథుడు తపశ్శక్తి చేతనే గంగను భూమిమీదకు అవతరింపజేశాడు. దధీచి తీవ్రమైన తపస్సు చేసి తన ఎముకలను శక్తివంతము గావించుకున్నాడు. ఆయన ఎముకలతో తయారైన వజ్రాయుధముతో రాక్షసులు హత మార్చబడినారు. అంతటి శక్తి తపస్సు ద్వారా మాత్రమే సాధ్యం కాగలిగింది. అగస్త్యమహర్షి మూడుసార్లు ఆచమనం చేసి మొత్తం సముద్రమునంతటినీ త్రాగివేశాడు. ప్రపంచములో సమర్థులు, ఆత్మబలసంపన్నులు, శక్తివంతులు అని చెప్పబడే వారందరి దగ్గరా ఉన్నది 'తపస్సు' అనబడే ఒకే ఒక ఆయుధము!

తపస్సులో వెయ్యవల్సిన మొదటి అడుగు, తొలిగా గురి పెట్టవల్సినది మన ఇంద్రియములపైన. ఇంద్రియములు మన శక్తిని హరించి, నాశనము చేసివేస్తున్నాయి. చిల్లులున్న పాత్ర లోకి ఆవుపాలను పిండుతుంటే ఆ పాలన్నీ చిల్లుల ద్వారా బయటకు ప్రవహించిపోతాయి. ఒక్క చుక్క కూడా పాత్ర లోపల మిగలవు. మనం చేష్టలుడిగి చూస్తూ ఉండవల్సినదే. ఇదేవిధముగా మనం జీవాత్మను శక్తివంతం చేసుకోవాలంటే ముందర ఈ జీవాత్మలో నున్న రంధ్రములనన్నింటినీ మూసి వెయ్యాలి. ఆ రంధ్రములను మూసివెయ్యకపోతే మనం ఎంతో శ్రమపడి భగవంతుడిని సేవించి, భజించి, అర్చించు కొనడము ద్వారాగానీ లేదా మరెన్నో ఇతర ధర్మకార్యముల ద్వారాగానీ సంపాదించుకున్న శక్తి వ్యర్థంగా ఖర్చుయిపోతుంది. ఇంద్రియ సుఖములకు చెందిన రంధ్రములు స్థూలశరీరముతో సంబంధము కలిగి ఉంటాయి. మనకు కనిపించే ఈ దేహములో స్థూల-సూక్ష్మ-కారణ శరీరములనబడే మూడు శరీరములు ఉంటాయి. ఈ మూడు శరీరములనూ మనం తపింపజెయ్యాలి. అప్పుడే 'యోగం యొక్క లక్ష్యం నెరవేరగలదు. తద్వారా మనం యోగముతో సరియైన రీతిలో లీనం కాగలము. యోగము, తపస్సులలోని ఉద్దేశ్యము ఇదే!

*- అఖండజ్యోతి, ఏప్రిల్ 2015*
*అనువాదం: శ్రీమతి కృష్ణకుమారి*

---

## స్నేహ బంధం

*నిమాయీ, రఘునాథ్... ఇద్దరూ సహపాఠులు. ఇద్దరి మధ్యా మంచి స్నేహ బంధం ఉన్నది. రఘునాథుడు ఒక గ్రంథం వ్రాసి, సమీక్షించమని నిమాయికి ఇచ్చాడు. కొన్ని రోజులు గడచిన పిదప, రఘునాథుడు తన గ్రంథ రచన ఎలా ఉన్నదని నిమాయిని ప్రశ్నించగా, నిమాయి "అద్భుతం! ఒక్క తప్పు కూడా లేదు" - అని ప్రశంసించాడు. తరువాత నిమాయి తాను న్యాయశాస్త్రంపై వ్రాసిన భాష్యాన్ని పరిశీలించమని రఘునాథుడికి ఇచ్చాడు. "రఘునాథుడు నాలుగు పంక్తులు చదవగానే, అతడి కన్నుల వెంట అశ్రువులు జాలువారాయి. అందుకు కారణం చెప్పమని నిమాయి పదే పదే ప్రశ్నించిన మీదట, రఘునాథుడు, "మిత్రమా! నీ పుస్తకం ముందు నా గ్రంథం ఏ పాటిది? అసలు దానిని చదవాలని ఎవ్వరూ అనుకోరు కూడా!" అన్నాడు.*

*"చాలు, ఇంకేమీ చెప్పవద్దు" - అని అంటూ, నిమాయి తాను రచించిన పుస్తకంపైన తన పేరు కొట్టివేసి, రఘునాథుడి పేరు లిఖించాడు. అందుకు రఘునాథుడు ఎంత మాత్రము అంగీకరించలేదు. అప్పుడు, "ఇది నా కానుకగా భావించి స్వీకరించు" - అని చెప్పి అతనిని ఒప్పించాడు.*

*మిత్రుని ఔన్నత్యానికి, ఔదార్యానికి రఘునాథుడు పరవశించాడు. (గద్గదుడైనాడు). కాలక్రమంలో "నిమాయి" చైతన్యప్రభువుగా ప్రఖ్యాతిగాంచినాడు. రఘునాథుడు వ్రాసిన ఎన్నో కృతులు ప్రజల హృదయాలకు మార్గదర్శనం చెయ్యటంలో అగ్రభాగాన నిలచినాయి.*

*- అనువాదం: శ్రీమతి కృష్ణకుమారి*

---

**మనస్సు స్థిరంగా ఉంటే గ్రహణ శక్తి పెరిగి బుద్ధిపరిపూర్ణంగా పనిచేస్తుంది**

నావారితో నా మాట

# కుటుంబ సమేత పిక్నిక్‌గా జరుపుకునే పండగ దీపావళి



## మన వాళ్ళ మధ్య సంతోషాన్ని పంచుకునే పండుగ

మన అన్న వాళ్ళందరి మధ్య కాస్త సమయం గడిపినా ఎంతో ఆనందంగా ఉంటుంది. పండగ రోజుల్లో, ముఖ్యంగా దీపావళినాడు పెద్దలు, పిన్నలు, బంధువుల, స్నేహితులు, చుట్టుపక్కల వాళ్ళు అందరూ కలిసి మెలిసి ఒక చోట కబుర్లు చెప్పుకుంటూ, నవ్వుతూ, ఆడుతూ పాడుతూ, సరదాగా పిండివంటలన్నీ లాగిస్తుంటే ఆ ఆనందం వెయ్యి రెట్లు పెరుగుతుంది.

దీపావళికి ఇంట్లో పెద్దలకీ, పిల్లలకీ అందరికీ సెలవులు వస్తాయి. అలాంటప్పుడు అందరూ కలసి సరదాగా ఎక్కడికైనా పిక్నిక్‌లాగా వెళితే ఆనందం మధురానుభూతిగా మిగిలి పోతుంది. పరమ పూజ్య గురువుగారు శాంతికుంజ్‌లో సశరీరంగా ఉన్న రోజుల్లో సంవత్సరానికి ఒకటి రెండు సార్లు ప్రేరేపిస్తూ ఉండేవారు. అప్పుడప్పుడూ ఇలా పిక్నిక్‌కి బైటికి వెళితే ఇంట్లో ఆడవారికి విశ్రాంతిగా, ఉల్లాసంగా ఉంటుంది అంటూండేవారు.

దీపావళి సమయంలో సాధారణంగా వాతావరణం ఆహ్లాద కరంగా ఉంటుంది. ఇట్లాంటప్పుడు కుటుంబంలో అందరూ కలిసికట్టుగా పిక్నిక్‌కి వెళితే చాలా బావుంటుంది. ఒకరితో ఒకరు మనసు విప్పి మాట్లాడుకుంటారు. చిక్కు ముళ్ళు విప్పుకుంటాయి. బాంధవ్యాలపై పేరుకున్న ధూళి తొలగి పోతుంది. ఒకరిపట్ల ఒకరి ప్రేమ మళ్ళీ చిగురించి, బాంధవ్యం గట్టిపడుతుంది. పిక్నిక్ అనగానే ఒక అందమైన, ప్రాకృతిక ప్రదేశం కళ్ళల్లో మెదులుతుంది. పచ్చని గడ్డి మీద దుప్పటి పరిచి, బోలెడన్నీ తినే పదార్థాలు, పానీయాల మధ్యలో పెట్టుకుని అందరూ చుట్టూ కూర్చున్న దృశ్యం గుర్తొస్తుంది.

ఎందుకు మారింది అనే ఆలోచన పక్కనపెడితే, ఒకప్పుడు పిక్నిక్కులంటే నగరానికి కాస్త దూరంలో, ఆకాశం కనిపించేలా, పచ్చదనం మధ్య, ప్రకృతి సాన్నిధ్యంలో అయిన వాళ్ళందరితో కలిసి తింటూ ఆనందంగా గడపడం. నగరానికి దూరంగా, పెద్దగా జనాభా లేని చోటకి వెళ్ళడానికి ఇష్టపడతారు, అక్కడ భోజన సదుపాయాలు ఉండే అవకాశం తక్కువ. కాబట్టి ఇంటి నుండి అన్ని ఏర్పాట్లు చేసుకుని తీసుకుని వెళ్ళాలి. కుటుంబమే కాకుండా స్నేహితులు, సన్నిహితులు కూడా వస్తూంటారు. వారిలో కొందరు కలసి డబ్బు కూడబెట్టి అవసరమైన వస్తువులు, తిను బండారాలు అన్నీ కొని అమరుస్తుంటారు.

## నేటి పిక్నిక్ వేరుగా ఉంటుంది

ఆధునికత వైపు పయనిస్తున్న మనం ఇప్పటికీ పిక్నిక్ అంటే ఇష్టపడతాం. మునుపటి కన్నా ఇప్పుడు చాలా తక్కువ సార్లు వెళ్తున్నా, వెళ్ళడానికి మాత్రం ఇష్టపడతాం. ఆధునిక సౌకర్యాలు, అభిరుచులకు విడిగా ఖర్చు పెట్టే స్థోమత లేని మధ్యతరగతి, నిమ్న తరగతి కుటుంబాలు మాత్రమే చాలా వరకు ఇంకా పిక్నిక్‌లకు వెళ్ళడానికి ఉవ్విళ్ళూరుతున్నారు. ఇటువంటివారు, లేదా చిన్న నగరాల్లో ఉన్నవారు, తమ అందుబాటులో పెద్ద షాపింగ్ మాళ్ళు, మల్టీపెక్సులు, అందులో ఖర్చుపెట్టేంత డబ్బు ఉంటే మాత్రం పిక్నిక్‌ను పనికిరానిదానిగానే అనుకున్నా అనుకుంటారు.

డబ్బున్నవాళ్ళు పిక్నిక్‌ని వేరేవిధంగా జరుపుకుంటారు. వారు పర్యటనకు మహత్తునిస్తారు. స్థోమతను బట్టి వేరే ఊరు, రాష్ట్రం లేదా దేశానికి వెళ్ళి అక్కడి సౌకర్యాలను ఆస్వాదిస్తూం టారు. అక్కడి చారిత్రక లేదా ప్రాకృతిక ప్రదేశాలను చూసి, అక్కడి వంటలను రుచి చూసి దాన్నే పిక్నిక్‌గా ఆనందిస్తారు.

ఒకరకంగా ఇది కూడా మారిన పిక్నిక్ స్వరూపం. 20–30 సంవత్సరాల కిందటి పిక్నిక్ స్వరూపం అవతరించిపోతోంది కాబట్టి దాని చరిత్ర గురించి కొంత తెలుసుకుందాం.

1692లో దీని గురించి చరిత్రలో రాసున్నట్టు తెలుస్తోంది.

**నీ గురించి ఇతరులు ఏమనుకొనుచున్నారు అనేడిది "ఆలోచన" నీ గురించి నీవు ఏమనుకుంటున్నావు అనేడిది "ఆత్మశోధన"**

అప్పట్లో కొంతమంది కలిసి ఏ రెస్టారెంట్‌లాంటి స్థలంలో చేరి కలిసి భోంచేసేవారు. దాన్నే పిక్నిక్ అనేవారు. చాలా సంవత్సరాలు ఇలానే కొనసాగింది. మెల్లిమెల్లిగా కొన్ని మార్పులు వచ్చాయి. పిక్నిక్‌కి వెళ్ళేవారు కొంత డబ్బు సమకూర్చుకుని ఆహార పానీయాల వస్తువులు కొనుక్కుని వెంట తీసుకువెళ్ళేవారు, కలిసి తినేవారు.

పిక్నిక్ అంటే అర్థం చిన్న చిన్న ముఖ్య విషయాలు. 1823 తరువాత బైటికెళ్ళి పిక్నిక్ జరుపుకునే ఆనవాయితీ మొదలైంది. ఈ అలవాటు రైతులు మొదలుపెట్టారని చెబుతారు. వారి పొలాల్లోనే అందరూ చేరి కలిసి భోంచేసి, ఆడుతూ, పాడుతూ ఆనందంగా గడిపేవారు. దీంతో వారి నెలల తరబడి అలసట తీరేది.

1789లో జరిగిన ఫ్రాన్స్ విప్లవం తరువాత పిక్నిక్ సర్వజనీనమైంది. ఈ విప్లవం తరువాత రాజరికపు పార్కులన్నీ సామాన్య ప్రజల కోసం తెరవడం ప్రారంభించారు. అప్పట్నుంచి అందరూ పార్కుల్లో విహరించడంతోపాటు ఆహార పానీయాలు కూడా తెచ్చుకుని కలిసి భోంచేసేవారు. పెద్ద సంఖ్యలో ప్రజలు కుటుంబ సమేతంగా వచ్చి రోజంతా ఆనందంగా గడిపేవారు.

మెల్లిమెల్లిగా పిక్నిక్‌లకు అందరూ వెళ్ళడంతోపాటు పెద్ద స్థాయిల్లో ఏర్పాటు చేసుకోవడం కూడా మొదలుపెట్టారు. 19వ శతాబ్దానికల్లా పిక్నిక్ సర్వసాధారణమైపోయింది. ప్రతి కుటుంబం వారి స్తోమతకు తగ్గట్టుగా నెలకొకసారైనా కలిసి బైటికి వెళ్ళడం మొదలుపెట్టారు. కొంతమంది కలిసి పిక్నిక్ సమాజాన్ని కూడా స్థాపించారు. ఈ సమాజం పనల్లా వారానికొకసారి పిక్నిక్ ఏర్పాట్లుచేసి, సభ్యులను ఆహ్వానించటం. పిక్నిక్ జరుపుకునే స్థలాల ఎంపికలో కూడా మెల్లిగా మార్పులు రాసాగాయి. పార్కుల్లో, రెస్టారెంట్లలోనే కాక ప్రాకృతిక సౌందర్య ఉట్టిపడే స్థలాలను ఎంచుకోవడం మొదలుపెట్టారు. ఈవిధంగా చాలాకాలం పిక్నిక్ అంటే అందరికీ ఇష్టమైన అంశంగా ఉండేది.

ఇప్పుడు కాలం మారింది. పిక్నిక్‌కి వెళ్ళడం అంటే సమయం వ్యర్థం చేసుకోవడం అనుకుంటున్నారు. పెద్ద పెద్ద షాపింగ్ మాళ్ళు, అక్కడక్కడా ఏర్పాటు చేసే ఫన్ ఎండ్ ఫుడ్ విలేజ్‌లలోనూ పిన్నల నుండి పెద్దల వరకు ఆడుకోడానికి, తినడానికి, తాగడానికి, ఆహ్లాదంగా గడపడానికి కావలసిన సామాగ్రి అంతా అందుబాటులో ఉంటుంది. ఈ మధ్య పిక్నిక్ స్పాట్లు కూడా ఏర్పడుతున్నాయి. అక్కడ తగిన రుసుము చెల్లిస్తే ఆ రోజంతటికి అవసరమైయ్యేవన్నీ ఏర్పాటు చేయబడుతుంది. కాని ఇవన్నీ అందరికీ సులభంగా అందుబాటులో ఉండవు.

అయినా రాను రాను ఆధునికీకరణ పేరుతో పెద్ద పెద్ద భవనాలు, అపార్టుమెంటులు నిర్మించడం వల్ల ప్రశాంతంగా, పచ్చగా ఉండే పరిసరాలు కనుమరుగవుతున్నాయి. వికాసం పేరు చెప్పి ఖాళీ స్థలాలు, రమణీయ స్థలాలన్నిటినీ మింగేయడం వల్ల కూడా పిక్నిక్ అంతరించిపోతోంది.

### కుటుంబాలుంటే కద, పిక్నిక్‌కి వెళ్ళేది!

మారుతున్న జీవిత విధానాల వలన ఉమ్మడి కుటుంబాలు అంతరించిపోతున్నాయి. ఒంటరిగా, చిన్న చిన్న కుటుంబాలలో ఉండడానికి మొగ్గు చూపుతున్నారు. తీరిక లేకుండా పోతోంది. ఎవరికి వారే స్వీయ అభిరుచులకు, ఆశయాలకే ప్రాముఖ్యత నిస్తున్నారు. ఎవరి ప్రపంచం వారిదైపోయింది. పిల్లలకి వినోదం అంటే ఇంటర్నెట్టే గుర్తుకొస్తుంది. పెద్దలు ఎంత వీలైతే అంత పేరు, ఆస్తి కూడబెట్టే పరుగులాటలో మునిగిపోయారు. ఆధునిక యుగం అంటే ఇదే.

పొరపాటున ఎప్పుడైనా అందరికీ సమయం దొరికితే, ఏ మల్టిప్లెక్స్‌లో సినిమా చూడడమో, పెద్ద షాపింగ్ మాళ్ళ కెళ్ళడమో చేస్తారు. ఢిల్లీనగరంలోని ఒక ప్రముఖ సొసైటీలో 100-150 కుటుంబాలుంటాయి. అక్కడ వారిని మీరు చివరగా కుటుంబంతో పిక్నిక్‌కి ఎప్పుడెళ్ళారని అడిగితే అందరూ మొహాలు చూసుకున్నారు. పెద్దలకైతే చిన్నప్పటి పిక్నిక్ గుర్తులు తప్ప తాజాగా ఏవీ గుర్తులేదు. పిల్లలు స్కూల్లో తోటివారితో వెళ్ళింది తప్ప కుటుంబంతో కలిసెళ్ళిన గుర్తులేదు.

ఇది పెద్దల, పిన్నల పరిస్థితైతే, యువకుల అభిప్రాయ మడిగితే, పిక్నిక్కులనేవి పాతకాలపు పద్ధతులన్నారు. వారి దృష్టిలో అవి సమయం వ్యర్థం చేసుకోవడమే. ఇది వరకు ఎవ్వరికీ ఊహకందని ఉత్సాహకరమైన వస్తువులెన్నో వారికి అందుబాటులో ఉన్నాయి. మొబైల్ ఫోన్లు, ఇంటర్నెట్టు, నెట్వర్కింగ్ సైట్లు, సోషల్ సైట్లు ఇవి వారికి పిక్నిక్కులకన్నా ఎక్కువైపోయాయి. బయటకు వెళ్ళి, స్నేహితులతో గంతులేయడ మనేది ఇప్పుడు రాత్రి పార్టీల్లోనే కనిపిస్తుంది. పైగా ఇటువంటి

**ఆలోచన అలవంటిది - ఆత్మ సముద్రం వంటిది**

పాతకాలపు ఐడియాలు మాకివ్వద్దంటూ నవ్వుతున్నారు. పిక్నిక్కులకెళ్ళి సీతాకోకచిలుకల్ని పట్టుకోవడానికి మేము పిల్లలం కాదంటున్నారు. నిజంగా ఇది సమయం వృథా చేసేదా? కాలమదే అంటోంది. విజ్ఞానం ప్రకృతిని ఓడిస్తోంది. అంతరించిపోతోంది పిక్నిక్ కాదు, కుటుంబంలో పరస్పర ప్రేమాభిమానాలు. సంబంధాల్లో మాధుర్యం మళ్ళీ నింపాలంటే మళ్ళీ ప్రకృతివైపు అడుగులేయాల్సిందే.

మన కుటుంబంతో కలిసి ప్రకృతి వడిలో గడపడం కన్నా ఇంటర్నెట్టుతో గడపడంలోనూ, గోలగోలగా ఉండే షాపింగ్ మాళ్ళలోనూ, పార్టీలలోనూ ఉండవనే విషయం అందరూ అర్థం చేసుకోవాలి. పండగలొచ్చేదే అందరూ అన్ని చేదు భావాలను మర్చిపోయి మళ్ళీ కలిసిమెలిసి హాయిగా ఆనందంగా గడపడానికి, బాంధవ్యాలు బలపడడానికే. ఇదంతా ప్రకృతి సన్నిధిలో నవ్వుతూ, నవ్విస్తూ, ఆడుతూ పాడుతూ జరిగితే ఇంకెంత ఆహ్లాదకరంగా ఉంటుందో!

దీనికి వస్తువులు కాదు సమకూర్చాల్సింది. ఆలోచనలు. సౌకర్యాలను మెరుగుపరచుకోవడం వల్ల కాదు, జీవితం పట్ల దృష్టిని వికసింపచేసుకోవాలి. ఒకరిపట్ల ప్రేమ భావనలు వికసిస్తే అంతర్చైతన్యంలోని చీకటి తొలగిపోతుంది. ఈ దీపావళికి ఇంట్లోనే కాదు, ఇలా మనసుల్లో కూడా వెలుగులు నింపుకుందాం. మిఠాయిలతో పాటు బంధాల్లో మాధుర్యం నింపుకుందాం. మన జీవితాలు, మన వాళ్ళ జీవితాలు ప్రకృతి వైపు పయనించాలి. ఆలోచనలు బాగుపడితే, జీవితం మెరుగు పడుతుంది. అందరం కలిసిమెలిసి మన వారితో సంతోషాలు, ఆనందాలు పంచుకోవడం మొదలపెడదాం.

*– అఖండజ్యోతి, నవంబరు 2015*
*అనువాదం: ఎం.వి. ప్రసాద్*

---

## పరమాత్మ - అంతర్యామి

*పరమాత్మ చీమ నుండి ఏనుగు వరకు సృష్టించినప్పుడు, అవి ఏవీ ఆయనకు కోరటంగాని, లేక ఫిర్యాదు చేయటం గాని చేయనందున ఆయన నిశ్చింతగా ఏ ఇబ్బంది లేకుండా ఉండేవాడు. కాని ఏనాడు మనిషిని సృష్టించాడో ఆరోజు నుండి ఆయకు ఇబ్బందులు మొదలయ్యాయి. వారు చేయు ఫిర్యాదులు, కలహాలు, పోట్లాటలు తీర్చటంతోటే, ఇతర పనులు మానుకొని చేసినా రోజంతా సరిపోయేది కాదు. దాంతో విసుగు చెంది పరమాత్మ ఒకనాడు దేవతలనందరిని సమావేశపరచి – "నేను రచించిన ఎన్నో జీవులు హాయిగా జీవిస్తూ, నాకు ఏ సమస్యను కలిగించనందున నేను నిశ్చింతగా ఉంటున్నాను. కాని ఏనాడు ఈ మానవ సృష్టి చేసానో, ఆనాటి నుండి నాకు వారు చేయు ఫిర్యాదులు పరిష్కరించలేక విసుగెత్తి పోయి ఉన్నాను... అందువల్ల వీరికి నేను కనిపించకుండా ఉండే ఏదైనా ఒక రహస్య స్థానం మీరు చూపితే ఆ స్థానంలో దాగి ఉంటాను! అని వారిని కోరాడు. అందుకు ఒక దేవత – తమరు పాల కడలిలో దాగితే మంచిదని, మరొక దేవత హిమాలయా పర్వతాలు అనువుగా ఉంటాయని అంటే, ఇంకో దేవత ఆకాశంలో చంద్రునిలో దాగితే ఎవ్వరూ కనుక్కోలేరని ఇలా రకరకాల ఉపాయాలను ఏకరువు పెట్టారు. అన్నీ విన్న పరమాత్మ వారితో "నేను ఆకాశంలో ఉన్నా, పాతాళంలో దాగినా మానవులకున్న తీక్షణమైన తెలివితో నన్ను తప్పకుండా కనుగొనగలరు. అందువల్ల మీ సలహాలేవీ మానవుల ముందు పని చేయవని తన నిస్సహాయతను తెలిపాడు. ఇంతలో దేవ ఋషి ముందుకు వచ్చి ఎవరికి వినిపించని స్వరంతో పరమాత్ముని చెవిలో ఒక రహస్య స్థావరాన్ని తెలుపుతూ – "తమరు మానవుల హృదయాల్లో దాగి ఉంటే సరి. మనిషి నేత్రాలు ఎంతవరకు బయటకు నాలుగువైపులకు మాత్రమే వెదకుతాయి. తప్పు తమలోనికి ఎన్నడూ చూడజాలవు. అప్పటి నుండి పరమాత్మ మానవ హృదయంలో దాగి ఉన్నాడని అంటారు. ఎవరు ఈ రహస్యాన్ని తెలుసుకొంటారో వారు మాత్రమే ఆయనను కనుగొంటారు.*

*– అఖండజ్యోతి, ఫిబ్రవరి 1990*
*అనువాదం: జి. చెన్నకేశవరావు*

---

**అల సముద్ర ఉపరితలంపై పడుతుంది - ఆలోచన మనస్సులో పుడుతుంది**

ఆయుర్వేద వైద్యం-8

# ఆయుర్వేదగుణ పత్రాలు-2

*(గతసంచిక తరువాయి...)*

## బదరీపత్రం

పవిత్ర యాత్ర స్థలమైన బదరీనాథ్‌కు ఈ పేరు రావటానికి కారణం అక్కడి నరనారాయణ ఆశ్రమానికి దగ్గర ఉన్న రేగు (బదరీ) పళ్ళతోటలే.

**ఉపయుక్తభాగాలు:** పోషకాంశాలకు రేగు పళ్లు పుట్టినిల్లు. ఇందులో ఆపిల్ కంటే ఎక్కువగా పోషకాంశాలు ఉంటాయి. వేర్లు, ఆకులు, కాండం, బెరడు, పండు, విత్తనం పండులోని గుజ్జులోనూ ఔషధ లక్షణాలున్నాయి.

**ఔషధగుణాలు:** వాంతులయ్యేవారికి రేగుపళ్ళు, మిరియాలు చేర్చి కషాయం చేసి అందులో కలకండ కలిపి తాగించాలి. నరాల బలహీనతను నివారించుటకు రేగుపళ్ళు ఉత్తమ ఔషధం. మొటిమలు ఉన్నవారు రేగు విత్తనాలను పొడిచేసి, అందులో కాస్త పసుపు కలిపి ముఖానికి రాసుకుంటే మొటిమలు మాయమవుతాయి. రక్తశుద్ధికి రేగుపళ్ళు ఉత్తమం. శరీరంలోని ఏ భాగంలోనైనా వాపు ఉంటే రేగు ఆకులను దంచి ఆ రసాన్ని రాయండి.

రేగుపళ్ళు, ఆకులను మెత్తగా నూరి తలకు రాసుకుని, అరగంట తరువాత తలస్నానం చేస్తే జుట్టురాలడం తగ్గిపోతుంది. జ్వరంగా ఉన్న వారికి రేగుచెట్టు వేరును పొడిచేసి, తేనె లేదా పాలతో కలిపి ఇవ్వాలి.

రేగు బెరడు కషాయం విరేచనాలను తగ్గిస్తుంది. మలబద్ధకానికి రేగుపళ్ళు తింటే చాలు. చర్మరోగాలకు రేగు బెరడు కషాయం రోజుకు 2 లేదా 3 సార్లు రాస్తే చాలు. రేగుపళ్ళు ఆకలి కలిగిస్తాయి. జీర్ణశక్తిని పెంపొందిస్తాయి. హృద్రోగులకు రేగుపళ్ళు మంచి టానిక్.

రేగుపళ్ళతో జ్యూస్, చట్నీ, మురబ్బా, క్యాండీ తయారు చేయవచ్చు. జెల్లీ కూడా తయారు చేయవచ్చు. రేగుపళ్ళను ఎండబెట్టి కావాలనుకున్నపుడు తినవచ్చు.

## అపామార్గపత్రం

అపామార్గ లేక ఉత్తరేణి గురించి యజుర్వేదంలో చెప్పబడింది. ఈ ఉత్తరేణిని పాపనాశిని, దుస్స్వప్ననాశిని, మృత్యునాశిని అని కూడా అంటారు. అథర్వణవేదంలోనూ దీనిని వర్ణించారు. ఇందులో ఎరుపు, తెలుపు అని రెండు రకాలు ఉన్నాయి.

**ఉపయుక్తభాగాలు:** మొత్తం చెట్టులోని అన్ని భాగాలు ముఖ్యంగా ఆకులు, విత్తనాలు, వేర్లు.

**ఔషధగుణాలు:** ఎరుపు ఉత్తరేణి వేరును అరగదీసి తేలుకుట్టినచోట రాస్తే నొప్పి తగ్గుతుంది.

మూలవ్యాధితో బాధపడేవారు ఎరుపు ఉత్తరేణి ఆకులు, ఉల్లిపాయ చిన్నగా తరిగి నేతిలో వేయించి రోజుకు మూడుసార్లు తినడమేగాక, ఆ మిశ్రమాన్ని నొప్పి ఉన్నచోట కాపడం పెడితే త్వరగా తగ్గుతుంది. రక్తహీనతగలవారు ఎరుపు ఉత్తరేణి ఆకుల రసాన్ని, పాతబెల్లంతోపాటు ఖాళీ కడుపుతోనే రోజుకు రెండుసార్లు తీసుకోవాలి.

అధిక రక్తస్రావమవుతున్నవారు ఎరుపు ఉత్తరేణి ఆకుల రసాన్ని గోరువెచ్చటి నీళ్ళతో కలిపి తాగాలి.

గాయాలపై ఉత్తరేణి ఆకురసాన్ని రాస్తే త్వరగా తగ్గిపోతుంది. జలుబు, దగ్గు ఉన్నవారు ఉత్తరేణి వేరును కాల్చి భస్మంచేసి నాలుగు చిటికెల భస్మాన్ని తేనెతో కలిపి తీసుకుంటే ఉపశమనం కలుగుతుంది.

ఎరుపు ఉత్తరేణి పుల్లను పసుపు మరియు గోమూత్రంలో గంధం తీసి రాస్తే చర్మరోగాలు నయమవుతాయి. విరేచనాలకు ఉత్తరేణి ఆకురసం, పెరుగు కలిపి తీసుకోవాలి. అలా చేస్తే విరేచనాలు తగ్గుతాయి.

మలవిసర్జన సమయంలో రక్తం పడేవారు బియ్యం కడుగునీళ్ళతో ఉత్తరేణి విత్తనాన్ని గంధం తీసి తాగాలి. ఉత్తరేణి కషాయం తాగితే నిద్రలేమిగలవారికి ఉపశమనం కలుగుతుంది. ఉత్తరేణి ఆకురసం తాగితే మూత్రవిసర్జన సమయంలో సమస్య ఉండదు.

**అలలు సముద్ర గర్భాన్ని కదిలించవు - ఆలోచనలు ఆత్మను కదిలించవు**

## తులసీపత్రం

సాధారణంగా ప్రతి ఇంటి ముంగిట్లో కనిపించే తులసి పూజార్హమైన పవిత్రమైన మొక్క. దీనికి 'సర్వరోగ నివారిణి' అన్న బిరుదు కూడా ఉంది. తులసి రుచికి చేదుగా, వగరుగా ఉన్నప్పటికీ అగ్నిప్రదీపకం. గుండెకు బలాన్నిస్తుంది. ఉష్ణ, పిత్తాలను ప్రకోపింపజేస్తుంది. తులసి పవిత్రమైనది, సుగంధభరితమైనది తన చుట్టూ ఉన్న గాలిని శుద్ధపరుస్తుంది.

సూర్యోదయానికి ముందే (బ్రాహ్మీముహూర్తంలో) దీని సేవనం ప్రయోజనకరం.

తులసి ఉన్న ప్రాంగణం శాంతి, ధర్మం, శ్రద్ధలాంటి సద్గుణాలను కలిగి ఉంటుందని భావిస్తారు.

**తులసిలో రకాలు:** తులసిలో శ్రీ తులసి, కృష్ణ తులసి అని రెండు రకాలున్నాయి. కాని రెండింటిలోనూ సమానమైన ఔషధ లక్షణాలున్నాయి.

**ఉపయుక్త భాగాలు:** ఆకులు, వేర్లు, విత్తనాలు.

తులసిమొక్కలోని అన్ని భాగాలలోను ఏదో ఒక ఔషధగుణం ఉంది. ఆకులలో ఉన్న సుగంధం క్రిమికీటకాలను, రోగాణువులను అరికడుతుంది.

అందువలన ఇంటిచుట్టూ తులసిమొక్కలు ఉంటే దోమల బాధ ఉండదు. తులసీదళాలను నీటిలో వేస్తే నీటిలో ఉన్న సూక్ష్మక్రిములు నాశనమవుతాయి.

గ్రహణకాలంలో ఇంట్లో ఉన్న నీటిలో తులసి ఆకులను వేసే ఆచారం కూడా ఉంది.

**ఔషధ గుణాలు:** జలుబు, దగ్గు ఉన్నప్పుడు రెండు పెద్ద స్పూన్లు పరిమాణంలో తులసి రసాన్ని తీసుకొని, తగినంతగా తేనె చేర్చి 2,3 సార్లు తాగితే తగ్గుతుంది. తులసి ఆకులను కూడా నమలవచ్చు.

గొంతునొప్పి, స్వరం సరిగా పలకని సమయంలో (బొంగురు గొంతు) కొంచెం నీళ్ళలో తులసి ఆకులను వేసి ఉడికించి ఆ నీటితో పుక్కిలించాలి. నీళ్ళు వెచ్చగా ఉన్నప్పుడే చేయాలి. పైత్యం, అలర్జీ లేదా ఏదైనా పురుగు కొరికినప్పుడు తులసి రసాన్ని రాయాలి. రెండు స్పూన్లు తులసిరసాన్ని కొద్దిగా తేనె కలిపి తాగించాలి.

తులసి ఆకులలో చెమట పట్టించే గుణం ఉంది. అందుకే అన్ని రకాల జ్వరాలలోను తులసి రసాన్ని తేనెతో కలిపి నాలుగు గంటలకు ఒకసారి ఇస్తారు.

మూత్ర విసర్జనలో మంటతో బాధపడేవారు తులసి ఆకులను దంచి, ఆ రసాన్ని కొద్ది పాలు, చక్కెరతోపాటు తీసుకోవాలి. లేదా తులసి విత్తనాలను ఒక గంటపాటు నీటిలో నానబెట్టి బాగా పిసికి, వడగట్టి తాగాలి.

గజ్జి మొదలైన చర్మవ్యాధులలో దురద ఎక్కువగా ఉంటే తులసి ఆకుల రసాన్ని రాసి తులసి కషాయాన్ని తాగించాలి. లివర్ సమస్య ఉన్నటువంటివారికి తులసి ఆకుల కషాయం చాలా మంచిది.

ప్రతిరోజూ భోజనానికి ముందుగా తులసి ఆకుల రసాన్ని కొద్దిగా తీసుకుంటే రోగనిరోధక శక్తి పెరుగుతుంది. పాము, తేలు కుట్టినప్పుడు తులసి ఆకులు, పూలు, వేర్లు మెత్తగా నూరి రాయాలి. అలాగే కొద్దిగా తినిపించాలి. వాంతులు, విరేచనాలకు తులసి విత్తనాలను కొద్దిసేపు నీటిలో నానబెట్టి దానికి కలకండ చేర్చి రోజుకు రెండు లేదా మూడుసార్లు తాగాలి.

తులసి ఆకులతో తయారుచేసిన తైలానికి బ్యాక్టీరియా నిరోధక గుణం ఉంది. అందుకే దగ్గు, చర్మరోగాలు, ఎసిడిటీ మొదలైన వాటికి చేసే అరోమా థెరపీలో ఉపయోగిస్తారు. తులసి రసంలో చిటికెడు మిరియాల పొడి, తేనె కలిపి తాగితే జీర్ణశక్తి పెరుగుతుంది. *(సశేషం)*

*సేకరణ:* ఎ. వేణుగోపాలరెడ్డి

## లెనిన్

*రష్యా దేశంలో 'లెనిన్' మీద ఆక్రమణదారులు జరిపిన దాడితో గాయపడగా, హాస్పిటల్‌లో చికిత్స నిమిత్తం చేర్చారు? ఆ రోజుల్లో సమీపంలోనే ఒక రైల్వేలైను క్రొత్తగా నిర్మాణం జరుగుతుంది. లెనిన్ మౌనంగా ఎవరికి తెలియకుండా హాస్పిటల్ నుండి బయటకొచ్చి శ్రామికులతో కలసి పనిచేసి, తిరిగి హాస్పిటల్‌కి చేరేవాడు. 'సంఘర్షణ పరాయణత్వమున్న యోధుడు ఎన్నడూ విశ్రమించడు.*

– *అనువాదం:* జి. చెన్నకేశవరావు

**ఆలోచన (మనస్సు) వేరు - ఈ ఆలోచనను పరిశీలించి చూస్తున్న యజమాని (ఆత్మ) వేరు**

# స్ఫూర్తిదాయక గాయత్రీపరివార్ సభ్యులు - 19

## శ్రీ బోయపాటి చంద్రశేఖర నాయుడు

**మదనపల్లి, చిత్తూరు**



కీ॥శే॥ బోయపాటి లక్ష్మణస్వామి మరియు శ్రీమతి కమలమ్మ దంపతులకు నవంబరు 1955లో మదనపల్లి పట్టణము, చిత్తూరు జిల్లాలో శ్రీ బోయపాటి చంద్రశేఖరనాయుడు జన్మించారు. హైస్కూలు విద్యాభ్యాసము వరకు మదనపల్లిలో పూర్తిచేసి పురుషార్థాన్ని నెరవేర్చుటకై దేశసేవను మార్గంగా ఎంచుకొని మాతృదేశ సంరక్షణను ఎంచుకొని భారతసైన్యంలో ఆర్టిలరీ విభాగములో 1976లో చేరారు. సైన్యంలో పనిచేస్తూ బి.ఎ.డిగ్రీని ఓపెన్ యూనివర్సిటీ ద్వారా పొందారు. 17 సంవత్సరములపాటు సైన్యంలో పనిచేసి స్వచ్ఛంద పదవీ విరమణ చేసి మదనపల్లి చేరుకున్నారు. కృషి స్వచ్ఛంద సేవా సంస్థలో 9 సంవత్సరాలపాటు, వశిష్టా స్కూలులో 6 సంవత్సరాలు చేశారు. 1980లో వివాహం జరిగింది.

కృష్ణా పుష్కరాల సమయంలో 2004లో అమరావతి తీర్థస్థలాన్ని సందర్శించి, అచ్చటి గాయత్రీ యజ్ఞములో పాల్గొన్నారు. అచ్చటనే పూజ్యగురుదేవుల సాహిత్యాన్ని ఖరీదు చేసి, స్వాధ్యాయం ద్వారా గాయత్రీ సంస్థ పట్ల, సంస్కారాల పట్ల అభిరుచిని పెంచుకున్నారు. క్రమక్రమంగా పూజ్య గురుదేవుల పట్ల సమర్పణ, భక్తి శ్రద్ధలు పెరుగుటతో 2008లో గాయత్రీ తీర్థ్, శాంతికుంజ్, హరిద్వార్‌ను సందర్శించి సంజీవని శిబిరంలో పాల్గొన్నారు.

తదుపరి 2011లో జన్మశతాబ్ది సమయంలో తిరిగి శాంతికుంజ్‌ను దర్శించి, గురుదేవులకు, గాయత్రీ పరివార్‌కు మరింత చేరువయ్యారు.


పూజ్యులు డా॥ మారెళ్ళ శ్రీరామకృష్ణ మాష్టారి శిష్యురాలైన శ్రీమతి మారెళ్ళ విజయా విశ్వనాథ్‌గారి ద్వారా గాయత్రీ మంత్రదీక్షను తీసికొని ఆనాటి నుండి క్రమం తప్పక గాయత్రీ మంత్రాన్ని జపించుచున్నారు. గాయత్రీ పరివార్ ప్రముఖ కార్యకర్తలలో ఒకరైన శ్రీ వెంకటేశ్వర్లు బోరబండ, హైదరాబాద్ వారి ద్వారా పిండతర్పణ సంస్కారాలను నేర్చుకొన్నారు.

అటుపిమ్మట కొంతకాలం పాటు గాయత్రీ చేతనా కేంద్రములో సమయదానమిచ్చారు.

కన్యాకుమారిలో జరుగుచున్న అశ్వమేధ గాయత్రీ యజ్ఞం ప్రచారరథయాత్రను పురస్కరించుకొని మదనపల్లిలో నవంబరు 7,8 తేదీలలో పంచకుండీ గాయత్రీ హోమాలను శ్రీ కన్యాక పరమేశ్వరి అమ్మవారి మందిరంలో మరియు తన స్వగృహంలో నూతనంగా నిర్మించిన గాయత్రీ ప్రజ్ఞాపీఠము మదనపల్లిలో చక్కగా నిర్వహించారు. వీరి అర్థాంగి శ్రీమతి విజయమ్మగారు భర్తకు చేదోడు వాదోడుగా నిలచి యజ్ఞ సఫలతకు తోడ్పడినారు. మదనపల్లిలో పూజ్యగురుదేవుల సాహిత్యంతోపాటు దాదాపు 100 యుగశక్తి గాయత్రి మాసపత్రికలు పంపిణీ జరుగుచున్నది.

వీరికి వీరి కుటుంబానికి పూజ్య గురుదేవులు వందనీయ మాతాజీల దివ్యాశీస్సులు సదా లభించాలని కోరుచూ ఆ గురుయుగ్మాన్ని చేతనాకేంద్రం ప్రార్థించుచున్నది.

## శ్రీ భూమిరెడ్డి వేణుగోపాలరెడ్డి, అనంతపురం



శ్రీ భూమిరెడ్డి మల్లారెడ్డి – వెంకట రమణమ్మ దంపతులకు జూన్ 1966లో ప్రొద్దుటూరు పట్టణము, కడప జిల్లాలో శ్రీవేణుగోపాలరెడ్డి జన్మించారు. ప్రొద్దుటూరు పట్టణములోనే బి.కాం. డిగ్రీ వరకు చదువుకున్నారు. తదుపరి తండ్రి నుండి అబ్బిన వ్యాపార మెళకువలకు పరీక్షపెట్టి తన కాళ్ళపై తాను నిలచి జీవించాలనెడి తపనతో అర్థాంగి తోడురాగా అనంతపురం పట్టణానికి 1991లో వలసవచ్చారు. ఇచ్చటనే వ్యాపారం ప్రారంభించి నెమ్మదినెమ్మదిగా ఎదుగుచూ వచ్చారు.

ఆర్థికంగా కుదుట పడ్డ మనస్సు ఆధ్యాత్మికతవైపు ఆలోచనల సారించింది. అదే సమయంలో శ్రీరామకృష్ణ మిషన్

**మనస్సుకు - ఆత్మకు మధ్య అంతరం (దూరం) పెరిగినప్పుడు, ఆత్మ నుండి వెలువడెడి శక్తిని మనస్సు అందిపుచ్చుకోలేదు**

వారు భక్త సమేమళనాన్ని అనంతపురంలో ఏర్పాటు చేయగా శ్రీ వేణుగోపాలరెడ్డి దృష్టి దానిపై పడింది. దీనితో భక్తిశ్రద్ధలు ముప్పిరిగొనగా సంస్థపట్ల సమర్పణ పెరిగి రామకృష్ణ మాసపత్రికను అనంతపురం జిల్లాలో అధిక సంఖ్యలో పంపిణీకి కంకణం కట్టారు. దీని ఫలితమే నేడు 1100 పై చిలుకు పత్రికలు ప్రతినెలా పంపిణీ జరుగుచున్నది.

శ్రీ వేణుగోపాలరెడ్డిలోని శ్రద్ధానిష్టల గమనించిన శ్రీ లక్ష్మీపతి అడ్వొకేట్‌గారు శ్రీ రెడ్డిగారికి గాయత్రీ పరివార్ పట్ల అవగాహన కల్పించి వీరిలో గాయత్రీ మంత్ర బీజాన్ని నాటారు.

గాయత్రీ పట్ల శ్రద్ధాసక్తులు పెరిగి ఒంటరిగానే గాయత్రీ తీర్థ్, శాంతికుంజ్, హరిద్వార్‌ను 4 సంవత్సరాల క్రితం సందర్శించి 5 రోజుల పాటు అచ్చట గడిపారు. అచ్చటనే గాయత్రీ మంత్రదీక్షను తీసికొన్నారు.

కాలక్రమేణా గాయత్రీ పట్ల, పూజ్యగురుదేవుల పట్ల శ్రద్ధ పెరిగి మాసపత్రిక అయిన యుగశక్తి గాయత్రిని అనంతపురం పట్టణంలో ప్రచారం చేయసంకల్పం తీసికొన్నారు. గత సంవత్సరం నెలకు 108 చొప్పున తీసికొని పూజ్యగురుదేవుల సందేశాన్ని ఇంటింటికి చేర్చుచున్నారు. దీనితోపాటు ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణాలోని జైళ్ళకు యుగశక్తి గాయత్రీ మాసపత్రికను నెలనెలా 500 పై చిలుకు పంపిణీ చేయుటలో చక్కని సూచనలను, మార్గాన్ని చేతనా కేంద్రానికి అందించారు. ఈ రీతిగా నేరస్థులను కూడా సంస్కరించాలనెడి సంకల్పానికి కార్యరూపాన్ని అందించిన ఆదర్శవాది. కార్యశీలి శ్రీ రెడ్డిగారు.

అట్టి వీరికి, వీరి కుటుంబానికి పూజ్య గాయత్రీమాత మరియు పూజ్యగురుయుగ్మం ఆయురారోగ్యాలను, సిరి సంపదలను ప్రసాదించి ఆదర్శమూర్తులనుగా తీర్చిదిద్దుగాక.

---

## న్యాయార్జిత ధనమే అక్కరకు వస్తుంది

*బర్మా దేశములో హేలాక్ అను నామం గలిగిన ఒక ధనికుడు నివసిస్తున్నాడు. ఇతడు అత్యంత లోభి మరియు మోసకారి. ఇతని కోడలు మిగుల ధర్మ పరాయణురాలు. అన్యాయంగా ఆర్జించిన ధనం అక్కరకు రాదు, పైగా వ్యర్థమవుతుందని, న్యాయపూర్వకంగా ఆర్జించినది మాత్రమే మనకు దక్కి ఫలితాన్నిస్తుందని ఆమె విశ్వాసం. ఆమె, తన మామగారైన హేలాక్‌కు ఎంతగా చెప్పినా, ఆయనపై ఎట్టి ప్రభావం పడలేదు. పట్టు వీడని కోడలు, మామగారికి బహువిధాలా హితాన్ని బోధిస్తూ వస్తున్నది.*

*ఒకనాడు కోడలి హితవచనాలలోని సత్యాన్ని పరీక్షింప నెంచి, హేలాక్ న్యాయమార్గంలో లభించిన ధనంతో ఒక బంగారు నాణాన్ని తయారుచేయించి, దానిపై తన గుర్తును వేయించి, దానిని ఒక వస్త్రములో చుట్టి నాలుగు రోడ్ల కూడలిలో విడిచిపెట్టి వచ్చాడు. కొన్ని రోజులు ఎవ్వరూ దానిని ముట్టలేదు. తదుపరి ఒకరోజున దానిని దారిన పోయే వ్యక్తి వస్త్రముతో సహా నదిలో విసిరివేశాడు. దీనిని ఒక చేప మ్రింగింది. కొన్ని రోజుల తరువాత ఈ చేప మత్స్యకారులకు చిక్కింది.*

*మత్స్యకారులు దీనిని చేప పొట్టను చీల్చగా ఈ బంగారు నాణెం బయటపడింది. నాణెంపైనున్న పేరును చూచిన మత్స్యకారులు దానిని తిరిగి హేలాక్‌కు అందజేశారు. దీనిని చూచిన ధనికుడు హేలాక్ మిగుల ఆశ్చర్యానికి గురియైనాడు. న్యాయార్జితమైన సంపద తిరిగి ఆ న్యాయ పరుని వద్దకు వచ్చి చేరతుందనెడి దానికై ధనికుడైన హేలాక్ విశ్వాసం కుదిరింది. దీనితో కోడలి మాటలపై పరిపూర్ణ విశ్వాసాన్ని పెంపొందించుకున్న హేలాక్ తన జీవన గమనాన్ని మంచి మార్గం వైపు మరలించుకున్నాడు. తన సామర్థ్యంపైన ఆధారపడి మంచి మార్గాన ధనార్జన గావిస్తూ జీవించాడు.*

*– హిందీమూలం: అఖండజ్యోతి, సెప్టెంబర్ 2015*

*తెలుగు అనువాదం: ఎ. శారద*

**మనస్సు పెట్టి ధ్యాన ప్రక్రియ చేపట్టినప్పుడు హృదయజ్యోతి అఖండంగా వెలుగుతుంది**

వార్తలు

# రాష్ట్రంలో జరిగిన వివిధ కార్యక్రమాలు

## విజయనగరం జిల్లా కురుపాంలో

2015 అక్టోబరు మాసము 23 నుండి 25వ తేది వరకు జరిగిన 108 కుండముల గాయత్రీ మహాయజ్ఞముపై ఒక నివేదిక.

గత దశాబ్దకాలముపైగా పరమపూజ్యగురుదేవులు పండిత శ్రీరామశర్మ ఆచార్య మరియు పరమవందనీయ మాతా భగవతీదేవిశర్మల సూక్ష్మ సంరక్షణలో వారి నుండి ప్రేరణ పొందుచూ గాయత్రీ మాతను ఆరాధిస్తూ, నిరంతరం గాయత్రీ మంత్రాన్ని జపిస్తూ అనేకానేక చోట్ల జరిగిన గాయత్రీ యజ్ఞాలలో పాల్గొని, 108 కుండముల గాయత్రీ మహా యజ్ఞాన్ని కురుపాం గ్రామంలో జరపాలనెడి సంకల్పాన్ని గైకొన్న ముల్వురి శ్రీ గురుమూర్తి, శ్రీ శంకరరావు, శ్రీ ఆది నారాయణ తీవ్ర కృషి ఫలితమే ఈ యజ్ఞము. వీరు చిన్న చిన్న వ్యాపారాలు నిర్వహిస్తూ తమ కుటుంబపోషణ గావించు కొంటూ, కొంత సమయాన్ని పూజ్యగురుదేవుల యుగనిర్మాణ కార్యక్రమాలు వ్యాప్తికై వెచ్చిస్తూ తమ భావి జీవితాలకు అనగా మానవ జీవన లక్ష్యసాధనా మార్గంలో పయనిస్తున్న నిత్య భౌతిక మరియు ఆధ్యాత్మిక సాధకులు.

కురుపాం గ్రామంలో గాయత్రీమాత (సద్బుద్ధికి జనని) ఆలయాలను నిర్మించాలనెడి సంకల్పాన్ని గైకొని, అదే గ్రామ నివాసియైన ఒకరు వారిని ప్రేరేపించి వారి నుండి స్థలాన్ని దానంగా అందిపుచ్చుకొని భూమిపూజ గావించారు. ఆనాటి నుండి కురుపాంను చుట్టి ఉన్న 100 గ్రామాలలో ప్రచారాన్ని చేపట్టి నిర్విరామంగా కృషి చేశారు. 1008 ఇళ్ళలో దేవ స్థాపనతో కలశస్థాపన చేసి వారిద్వారా గాయత్రీ మంత్రజపాన్ని నాలుగు కోట్లకు పైగా చేయించి, ఈ పరిజనులనందరిని 108 కుండముల గాయత్రీ యజ్ఞానికి సంసిద్ధులచేశారు.

దీనికి పూర్వము 108 పరిజనులను కురుపాం ప్రాంతము నుండి గాయత్రీతీర్థ్, శాంతికుంజ్, హరిద్వార్‌నకు తోడ్కొని పోయి గాయత్రీతీర్థ్ పెద్దల ఆశీస్సులనందుకొని, ఆదరణీయ డాక్టర్ ప్రణవ్ పండ్యా – శైలబాలా పుణ్య దంపతుల పవిత్ర హస్తాల మీదుగా శక్తి కలశాన్ని అందిపుచ్చుకొని కురుపాం తిరిగి వచ్చారు.

కురుపాం గ్రామ గాయత్రీ పరిజనులలోని సంకల్ప తీవ్రతను లక్ష్యశుద్ధిని పసిగట్టిన శాంతికుంజ్ వరిష్ఠ కార్యకర్తలైన ఆదరణీయ డాక్టర్ బ్రిజ్‌మోహన్ గౌడ్‌జీ మరియు ఆదరణీయ కాళీచరణ్ శర్మగార్లు, శాంతికుంజ్ టోలీతోపాటుగా విచ్చేసి పూజ్యగురుదేవుల సందేశాన్ని అందించారు.

తొలుత డాక్టర్ బ్రిజ్‌మోహన్‌గౌడ్‌జీగారు, శ్రీ కాళీచరణ్‌శర్మ గారిని సభికులకు పరిచయం చేస్తూ ఇలా చెప్పారు.

"కాళీచరణ్ శర్మగారు భిలాయ్ ఉక్కు కర్మాగారంలో ఉన్నత పదవిలో పనిచేసెడి సమయంలో పూజ్యగురుదేవుల సంపర్కము లోనికి వచ్చుట జరిగింది. తన ఉద్యోగ బాధ్యతల నిర్వహిస్తూ పూజ్యగురుదేవుల కార్యక్రమాలలో పాలుపంచుకుంటూ ఉండే వారు. వీరిలోని శ్రద్ధానిష్ఠల, నిజాయితీ పట్ల ఆకర్షితులై పని చెయ్యమని కోరారు. కుటుంబ బాధ్యతలెంత పెద్దవైనా లెక్కించక, పిల్లలు చిన్నవారన్న విషయాన్ని కూడా మదిలోనికి రానివ్వక మరో ఆలోచన లేకుండా పూజ్య గురుదేవులు వందనీయ మాతాజీల పట్ల సంపూర్ణ విశ్వాసంతో, భారాన్ని వారిపైన మోపి, గురుదేవులు అప్పగించిన బాధ్యతల స్వీకరించిన సమర్పణాశీలి. ఆ విధంగా శాంతికుంజ్‌లో తమ సంపూర్ణ సమయాన్ని, ప్రతిభలను, సంపదలను వెచ్చిస్తూ పనిచేయుచున్న దీక్షా తత్పరుడు.

ఇట్టి ఆదర్శపురుషుడు నేడు మన మధ్యకు వచ్చి మనందరికి గురుమంత్రదీక్షనందించి పూజ్యగురుదేవుల సందేశాన్ని అందించుట మన భాగ్యము" అని పరిచయం చేశారు.

ఆదరణీయ కాళీచరణ్ శర్మగారు ప్రవచిస్తూ ఈ విధంగా చెప్పారు. "మానవునికి తన జీవిత కాలంలో రెండు జన్మలను అనుభవిస్తాడు. మొదటి జన్మ తల్లిగర్భము నుంచి పొందుతాడు. రెండవ జన్మ గురుమంత్రదీక్షను పొందుటద్వారా జరుగుతుంది. భగవాన్ శ్రీకృష్ణుడు పుట్టగానే మధురకు చేరుట మొదటి జన్మ. గీతా ప్రవచనంతో రెండవ ఘటన పూర్తి అవుతుంది. అట్లే

**పూవులను అందరూ ప్రేమిస్తారు, ఆనందాన్నిస్తారు - ఇదే జీవించేకళ**

ఋషులు, మునులు కూడా తమ తమ గురుమంత్ర దీక్షలతో ద్విజత్వాన్ని పొందారు. మహాపురుషుల జీవితాలను అవలోకిస్తే యేసుక్రీస్తు శిలువను ధరించిన పిదప ద్విజత్వాన్ని పొందాడు. తొలుత మనిషి జన్మనిచ్చిన తల్లి మోహపాశానికిలోనై ఉంటాడు. గురుమంత్ర దీక్షద్వారా ఈ మోహపాశాలను త్రెంచుకొని మనిషి దేవతగా మారతాడు. ఇప్పుడు ఈ గాయత్రీ మంత్ర దీక్షను తీసికొనే వారంతా కన్నతల్లి మోహబంధాల వదల్చుకొని, గాయత్రీమాత అనగా వేదమాత, దేవమాత, సంరక్షణలోనికి చేరి దేవమానవులుగా ఎదిగెదరు. నా గురువు నా మనస్సంతా నిండిపోయాడు. మీ సంశయాలనన్నింటిని నివృత్తిగావించి మిమ్ముల వెలుగుమార్గంలో పయనింపజేసి మిమ్ముల కల్ప వృక్షం, పారస్‌మణి, కామధేనువుల చెంతకు చేర్చుతాడు. మీలో సంతోషాన్ని సమృద్ధిని, సంతృప్తిని నింపుతాడు. బుద్ధిలో ఆత్మ జ్ఞానం ఉదయిస్తుంది. నేటి నుండి మీ జీవితంలో ఒక నూతన ఉత్సాహం, నూతన శక్తి, నూతన జీవన విధానం, నూతన కాంతి, తేజస్సు ఆవిర్భవించుట అనుభవంలోనికి తెచ్చుకుంటారు.

దీనికై మీలో చిన్నవారు నిత్యం ఒక్క మాల గాయత్రీ మంత్రాన్ని జపించాలి. పెద్దలు 3 నుండి 6 మాలలు జపించాలి. సూర్యోదయవేళ స్నానమాచరించి ఉతికిన దుస్తులు ధరించి, సూర్యాభిముఖంగా కూర్చొని జపాన్ని చేయండి. జపానంతరం సూర్యార్ఘ్య దానాన్ని తులసిచెట్టుకు లేక రావిచెట్టుకు అర్పించండి. ఇట్టి జపమాచరించుట అన్ని మతాల వారిలో ఉంది. ముస్లింలు నిత్యం మూడు కాలాల్లో నాలుగు లైన్ల మంత్రాన్ని (కల్మా) చేయగా, క్రైస్తవులు నాలుగు లైన్ల మంత్రాన్ని పఠిస్తారు. మన గాయత్రీమంత్రం కూడా అంతే. ఛత్రపతి శివాజీ గురువైన శ్రీ సమర్థగురురాందాస్ నిత్యం నడుం లోతు నదీ ప్రవాహంలో నిలచి ప్రతి ఉదయం గాయత్రీ జపాన్ని 12 సంవత్సరాల పాటు జపించారు. దీనితో ఆయన శరీరం లోని నడుం క్రింది భాగం తెల్లని రంగు సంతరించుకుంది. మిగిలిన పై భాగం సూర్యకాంతి తాకుటచే నల్లపడింది. నీటిలో చేపలు కొరికిన మచ్చలు కూడా ఆయన శరీరంపై నిలిచిపోయాయి. శ్రీకృష్ణుడు నిత్యం గాయత్రిని జపించి, యజ్ఞం చేసి నూరుగోవుల దానమిచ్చిన తదుపరి తన దినసరి కార్యక్రమాల చేపట్టెడి వాడట. శ్రీరాముడు కూడా గాయత్రిని ఉపాసించి రావణ సంహారం గావించాడు.

గాయత్రీ మంత్రాన్ని బ్రహ్మ, వశిష్టుడు మరియు విశ్వామిత్ర మహర్షి కీలితం (తాళం) గావించారు. దీనితో సామాన్యులు గాయత్రీ మంత్రాన్ని జపించుట కష్టసాధ్యమైంది. బ్రహ్మ తన జ్ఞానంతో, వశిష్ఠుడు తన తపశ్శక్తితో, విశ్వామిత్రుడు తన లోకహిత కార్యాలతో కీలితం గావించిన గాయత్రీ మంత్రాన్ని, మూడింటిలో నిష్ణాతులైన పూజ్యగురుదేవులు పండిత శ్రీరామశర్మఆచార్య గాయత్రీ మంత్రాన్ని వికీలితం గావించి, దీనిని సర్వులకు అందుబాటులోకి తెచ్చారు. ఆరు గాయత్రీమంత్ర పురశ్చరణలు గావించిన వశిష్టుడు బ్రహ్మర్షి పదవిని పొందగా, 24 పురశ్చర పూర్తిగావించిన పూజ్య గురు దేవులు నలుగురి వశిష్టులతో సమానమైనారు. దీనిని బట్టి గురుదేవుల శక్తి ఎంత గొప్పదో మనం అర్థం చేసికోవచ్చు. ఇంతటి గొప్ప తపశ్శక్తిని సంపాదించుకొన్న పూజ్యగురుదేవులు తన ఒక్క జీవితకాలంలో 400 సంవత్సరాలలో కూడా ఒక మనిషి చేయజాలని పనిని అనగా అనితరసాధ్యమైన కావ్యరచన, తపోసాధన, ఆధ్యాత్మిక సాధనను ఎన్నింటినో సాధించి సాక్షాత్తు విశ్వమాత గాయత్రీ రూపాన్ని సంతరించుకున్నారు.

పిల్లలు ప్రతినిత్యం ఒక మాల, పెద్దలు మూడు మాలల చొప్పున గాయత్రీ మంత్రాన్ని జపించుట అత్యంత శ్రేయో దాయకం. ఈ యుగానికి మాతృశక్తి గాయత్రీ మరియు ఆధ్యాత్మిక శక్తి కూడా గాయత్రియే. జపానంతరం ఆ అర్ఘ్య జలాన్ని రావి చెట్టుకు కాని తులసి చెట్టుకు కాని ఇస్తూ సూర్యునికి అర్ఘ్యదానం చెయ్యాలి. మూడు మాలలు చేయలేనివారు 24 మార్లు గాయత్రీ మంత్రాన్ని జపించుట ద్వారా “ఉపాంశం” పూర్తిచేయవచ్చు. స్నానము చేయకుండా మంత్రజపం చేయుట మధ్యమం. అటువంటప్పుడు బట్టలు మార్చుకొని జపమా చరించుట మేలు.

అటు తరువాత యజ్ఞశాలలోనున్న వారికి సామూహికంగా గాయత్రీ మంత్ర దీక్షను అందజేశారు. ఈ రీతిగా మంత్రదీక్షను పొంది వారు అంశదానంగా రూ. 10,000/-లు యజ్ఞానికి సమర్పించారు. ఈ రీతిగా శ్రీ కాళీచరణ్‌గారు ప్రవచనం ముగిసింది. అదే రోజు రాత్రి దీపయజ్ఞం 5116 దీపాలతో అలంకరించి నిర్వహించుట జరిగింది.

ఇట్టి శుభ సమాయన పూజ్యులు కాళీచరణ్‌గారు ప్రవచనం చెప్పుతూ ఇలా మాట్లాడారు. “మిత్రులారా! యుగనిర్మాణ

**భక్తి జ్ఞానంతో బ్రాహ్మణత్వం సిద్ధిస్తుంది - జన్మతో కాదనెడిది యదార్థము**

యోజనలో పాలుపంచుకొనుచున్న, పంచుకోనున్న వారి జీవితాలు ధన్యం. రామాయణకాలంలో అసుర సంహారవేళ రామునితో చేతులు కలిపిన వానరుల, భల్లూకాల జీవితాలు ధన్యమైనాయి. తనను తాను సంపూర్ణంగా రామునికి సమర్పించుకొన్న హనుమంతుని జీవితం మరింత ధన్యం. రామ మందిరాల కన్న హనుమంతుని మందిరాలు సంఖ్య పరంగా చాలా ఎక్కువ. దీనిని బట్టి తన కార్యక్రమాలలో పాలుపంచుకొనెడివారిని భగవంతుడు ఎంతగా ఆదరించి అందలమెక్కించెదరో మనం అర్థం చేసికొనవచ్చు. అట్లే అస్త్రం పట్టని యుగపురుషుడైన శ్రీకృష్ణుడు తనకు సమర్పణ గావించు కొన్న అర్జునునికి కేవలం 11 అక్షౌహిణుల సైన్యంతో అరవీర భయంకరులైన 18 అక్షౌహిణుల కౌరవసైన్యంపై విజయాన్ని చేకూర్చి పెట్టాడు. దైవీకృప వరించిన వారి జీవితాలు ఇలా చరితార్థమవుతాయి. అట్లే దేశ స్వాతంత్ర్య సంగ్రామంలో ముఖం చూయించిన వారు సైతం నేడు ఫించన్లు, భూములు, ప్రయాణ ఖర్చులో రాయితీలు వగైరా ఫలాలను అందిపుచ్చు కొనుచున్నారు.

గాయత్రీమాత అందరికీ మాతయే. గతంలో స్త్రీలు గాయత్రీమంత్రాన్ని ఉపాసించరాదు, బ్రాహ్మణులు తప్ప అన్య కులాల వారు గాయత్రీ ఉపాసన చేయరాదనెడి నియమము ఉన్నది. ఈ స్థితిని మార్చి మానవజాతికంతటికి స్త్రీ పురుష భేదం లేకుండా, జాతివర్ణ కులభేదాలు లేకుండా సర్వులు గాయత్రీమంత్రాన్ని చేయవచ్చని ప్రకటించి పూజ్యగురుదేవులు పండిత శ్రీరామశర్మఆచార్య గాయత్రీ మంత్రాన్ని సార్వజనీనం చేశారు. అందులకే సూర్యుడే గాయత్రీకి ప్రతిరూపమని, సవితా శక్తి అని ప్రకటించారు. సూర్యోదయవేళ గాయత్రీ మంత్ర జపాన్ని చేపట్టి, నిర్ణీతమాలల జపం పూర్తి కాగానే ఆ సూర్య భగవానునికి అర్ఘ్యమియ్యండి. సామూహికంగా ఈ జపసాధన చేపట్టి సమాజ కళ్యాణానికై తోడ్పడండి. సముద్రతీరం వెంట నివసించెడి మీరంతా తప్పక ఈ సామూహిక గాయత్రీజప సాధనను చేపట్టినచో ప్రకృతి ఉపద్రవాలైన ఉప్పెనలు, తుఫానులు వంటివాని నుండి రక్షణను పొందవీలున్నది.

పూజ్యగురుదేవులు ఒక పర్యాయం శాంతికుంజ్‌లో సందర్శకుల బాధలను వినసాగారు. అనేకులు వారికి గల కుటుంబ సమస్యలను, సామాజిక సమస్యలను ఆర్థికలేమి మున్నగు వానిని గూర్చి ఏకరువు పెట్టారు. అన్నింటినీ విన్న గురుదేవులు, వీటన్నింటికి కారణం అజ్ఞానమని తేల్చి చెప్పారు. దీనికై అందరూ గాయత్రీ మంత్రజపంతోపాటుగా గురుదేవుల సాహిత్యాన్ని చదువుట తప్పనిసరి. ఈ స్వాధ్యాయం ద్వారా ఆలోచనా పరివర్తన, భావ పరివర్తన, తద్వారా జీవన పరివర్తన కలగాలి. దీనికై మహిళామండలి, ప్రజ్ఞామండళ్ళు, వ్యాప్తి చెందాయి. ఇచ్చటి కురుపాం గ్రామంలో నిర్మితం కానున్న గాయత్రీ ప్రజ్ఞాపీఠము సమాజానికి దిక్సూచిలా మారాలి.

సముద్రం తీరం వెంట నివసించెడి జ్ఞానులు సముద్రునిలా గంభీరతను సంతరించుకొని ఉండాలి. కొన్ని శతాబ్దాల క్రితమే వివేకానందుడు ఇలా సెలవిచ్చారు. రానున్న కాలంలో ఎలకలే సింహాల్లా పనిచేస్తాయి. అనగా అతి సాధారణ మానవులు అమిత సామర్థ్యంతో పనిచేస్తారు. ఇదే నేడు కురుపాం గ్రామంలో నిజం కానున్నది. మీ అందరి సహకారంతో ఇచ్చట త్వరలో గాయత్రీ మందిర నిర్మాణం జరుగుతుంది. ప్రజల దృఢ సంకల్పబలంతో అంశదానం లభించి ఇచ్చట గాయత్రీ శక్తి పీఠములో త్వరలో నిర్మింపబడుతుందని ఆశిస్తున్నాను అంటూ తన ప్రసంగాన్ని ముగించారు.

**డా॥ బ్రిజ్‌మోహన్‌గౌడ్‌జీగారి ప్రవచనం:** గాయత్రీ పరివార్‌ను ఉద్దేశించి డా॥ బ్రిజ్‌మోహన్‌గౌడ్‌జీగారు ఇలా ప్రవచించారు. భారతీయ సంస్కృతికి, సనాతన ధర్మానికి వేదాలు ప్రమాణం. ఋగ్వేదంలో “అగ్ని మీళే పురోహితం ...... అనెడి మంత్రం ద్వారా యజ్ఞ ప్రాశస్త్యాన్ని మన ఋషులు మనకు వివరించారు. కావున మనమంతా నిత్యం యజ్ఞం చేయుట మంచిది. యజ్ఞం ద్వారా మనము భక్తి శ్రద్ధలతో అందించెడి నిత్య యజ్ఞం ద్వారా హవిస్సులతో దేవతలు సంతృప్తి జెంది, తిరిగి మనకు పాడి పంటలు తదితర సంపదల రూపంలో ప్రతిఫలాలను అందిస్తారు. దీనినే ఋజువు చేస్తూ మన పూజ్యగురుదేవులు మాతాజీలు గాయత్రీజపంతోపాటు గాయత్రీ యజ్ఞాన్ని చేసి మనకు మార్గదర్శకులుగా నిలిచారు. మానవ జీవనం యజ్ఞ విధానంతో ముడిపడి ఉంది. అప్పుడే మానవుడు సంపూర్ణ మానవునిగా సిద్ధిని పొందగలడు.

## మదనపల్లి పట్టణములో

తమిళనాడు రాష్ట్రములోని కన్యాకుమారి వద్దనున్న వివేకానంద స్మారక స్థలములో 2016 జనవరి 28 నుండి 31 వరకు నిర్వహింపతలపెట్టిన 41వ అశ్వమేధ మహాయజ్ఞ

**శిఖ అనేది మన ఆదర్శముల, సిద్ధాంతాలపై అంకుశము**

ప్రచారంలో భాగంగా, రథయాత్ర 28.09.2015న తెలుగువారి ఇష్టదైవము తిరుమల తిరుపతి సప్తగిరులపై కొలువుతీరియున్న శ్రీ శ్రీనివాసుని పాదాల వద్ద ప్రారంభమై ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల చుట్టి 8వతేది నవంబరు 2015న తిరిగి చిత్తూరు జిల్లాలోని మదనపల్లి పట్టణములో కొలువుతీరియున్న శ్రీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆశీస్సులందుకొని కన్నడిగుల రాష్ట్ర రాజధాని బెంగుళూరుకు పయనమై వెళ్ళింది.

ఇరు రాష్ట్రాలలోని తెలుగువారు అత్యంత భక్తిశ్రద్ధలతో అశ్వమేధ యజ్ఞ కలశాన్ని దర్శించుకొని, పరమపూజ్య గురుదేవులు మరియు పరమవందనీయ మాతాజీల ఆశీస్సుల పొంది తరించారు.

గాయత్రీ పరివార్ కార్యక్రమాలలో గత దశాబ్ద కాలము నుండి పాలుపంచుకొంటూ అవిరళ కృషి చేయుచున్న శ్రీచంద్ర శేఖర్‌గారి నాయకత్వంలో మదనపల్లి పట్టణములోని శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవాలయ యాజమాన్యం 7వ తేది నవంబరు 2015న పంచకుండీ గాయత్రీ యజ్ఞాన్ని ఏర్పాటు చేసింది. దీనిలో దాదాపుగా 200 మంది, అధిక సంఖ్యలో స్త్రీలు 70% మంది పాల్గొన్నారు. కన్యాకుమారి యజ్ఞ ప్రాశస్త్యాన్ని శ్రీ జుజ్జూరి సాంబశివరావు సభకు తెలియజెప్పగా యజ్ఞాన్ని శ్రీమతి హైమవతీగారు నిర్వహించుట జరిగింది.

సాయంత్రం 5 గంటల నుండి మదనపల్లి పట్టణ ప్రధాన వీధుల గుండా ప్రచారరథయాత్ర ఊరేగింపు మంగళవాద్యాలతో మరియు కృష్ణ భజనలతో సాగింది.

మరుసటిరోజు అనగా 8 నవంబరు 2015 ఉదయం మదనపల్లిలో ప్రప్రథమంగా ప్రారంభింపబడిన గాయత్రీ ప్రజ్ఞామండలి ప్రాంగణములో పంచకుండీ గాయత్రీ యజ్ఞము నిర్వహించారు. శ్రీ చంద్రశేఖర్‌గారు నూతనంగా నిర్మించిన తన గృహంలో మొదటి అంతస్తులో దీనిని ప్రారంభించారు.

సాయంత్రం 108 దీపాలతో దీపయజ్ఞం నిర్వహించారు.

అదేరోజు ప్రచార రథము కర్నాటక రాష్ట్రములో ప్రచారానికి బెంగుళూరు నగరానికి బయలుదేరగా, భక్తులు భక్తిశ్రద్ధలతో రథానికి వీడ్కోలు పలికారు.

ప్రచార రథయాత్రను అంటిపెట్టుకొని 42 దినములు తమ సయయదానాన్ని ఏకధాటిగా ఇచ్చిన శ్రీ జుజ్జూరి సాంబ శివరావు, గుంటూరు (పట్టణవాసి) గారికి గాయత్రీ చేతనా కేంద్రము హృదయపూర్వకంగా వారిని అభినందించుచున్నది.

అట్లే రథయాత్ర సఫలతకై ఆయా ప్రాంతాలలో పట్టణాలలో, నగరాలలో తమ తమ సేవలనందించి, రథ పరివారానికి కావలసిన సేవలనందిస్తూ రథయాత్ర సఫలతకై పాటుపడిన గాయత్రీ పరివార్ సభ్యులందరికీ గాయత్రీ చేతనా కేంద్రము హృదయపూర్వక అభినందనలు తెలుపుచున్నది.

## గాయత్రీ చేతనాకేంద్రములో ప్రేరణాత్మక, స్ఫూర్తిదాయక, సామూహిక స్వాధ్యాయ సత్సంగాల సాధనల ప్రారంభము

గాయత్రీ చేతనా కేంద్రము, మూసాపేట, హైదరాబాద్‌లో మహాలక్ష్మీ సామూహిక సాధనను 9 వారాలపాటు ప్రతి గురువారము మధ్యాహ్నం 3 గం॥ల నుండి 4 గం॥ల వరకు ఒక గంట పాటు జరిగింది. దీనిలో భాగంగా ఈ క్రింది వానిని పారాయణ చేయుట జరిగింది.

(1) మహాలక్ష్మీ సాధన - శ్రీ సూక్తం (2) యుగశక్తి గాయత్రి మాస పత్రిక స్వాధ్యాయం

తొమ్మిది వారాలు పూర్తియైన తదుపరి, దీపావళి మరునాడు అనగా 12 నవంబరు 2015న ఈ సాధన పూర్ణాహుతిని చేతనా కేంద్రములో జరుపుకొనుట జరిగింది.

శ్రీమతి మారెళ్ళ విజయావిశ్వనాథ్‌గారు ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టి సాధకురాండ్రలకు తగిన ప్రేరణను అందించారు. వీరిలో శ్రీమతి లక్ష్మిగారు, శ్రీమతి భానుమతిగారు, శ్రీమతి వాణి, శ్రీమతి అచ్చాయమ్మగారు, శ్రీమతి రత్నకుమారి మున్నగు 14 మంది ఉత్సాహంగా భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు.

రాష్ట్రములో పనిచేయుచున్న గాయత్రీ ప్రజ్ఞాపీఠాలు, శక్తి పీఠాలలో ఈ విధమైన స్వాధ్యాయ, సాధనాపూర్వక సత్సంగాలకు ఇది ప్రేరణాత్మకంగా నిలుస్తుందని. ఇట్టి కార్యక్రమంలో పాల్గొన్న వీరినందరికి పరమపూజ్యగురుదేవులు, పరమ వందనీయ మాతాజీల ఆశీస్సులు లభించాలని, గాయత్రీ చేతనా కేంద్రము ప్రార్థించుచున్నది.

19.11.2015 నుండి కల్పసాధనా స్వాధ్యాయం ప్రారంభింపబడింది. ఇది ప్రతి గురువారం మ॥ 3 గం॥ల నుండి సా॥ 4 గం॥ల వరకు జరుగును. అందరూ ఆహ్వానితులే.

**బట్టలు మాస్తే ఎక్కడైనా కూర్చుంటాడు - అదే నడత మారితే ఏ పనైనా చేస్తాడు**

# గో ఆధారిత వ్యవసాయంతో "రైతేరాజు"

"గోవు ఆధారిత" వ్యవసాయంతో ప్రతిపంటను లాభసాటిగా పండించి, వర్షపు లేమిని (అనావృష్టి)ని ఎదుర్కొన్న శ్రీఆలపాటి వీరయ్య, తండ్రి వెంకటేశ్వర్లు గురవాయపాలెం గ్రామం, నర్సరావు పేట పట్టణ రూరల్ మండలం, గుంటూరు జిల్లా వారి విజయంతో కూడిన స్ఫూర్తిదాయక వ్యవసాయ విధానాన్ని తెలుసుకుందాం.

నేడు వార్తా పత్రికలలో అనునిత్యము గత రెండు మాసాల నుండి వ్యవసాయం చేసి పంటలు చేతికి రాక కనీసం పెట్టిన పెట్టుబడి కూడా చేతికందక నష్టపోయి అప్పులపాలై నిరాశా నిస్పృహలకులోనై జీవితంపై ఆశచచ్చి ఆత్మ హత్యలకు పాల్పడుచున్న రైతు కుటుంబాల గాథలు చదువుచున్నాం. – దీనికి తోడు ఈ సంవత్సరం, అనావృష్టి పరిస్థితులు సంప్రాప్తమై, నాటిన విత్తులు మొలవలేదు. పలుచోట్ల (మొలచిన చోట్ల) వర్షాభావంతో పైర్లు ఎండి పోయాయి. బావులు, బోర్ల క్రింద, చెరువుల క్రింద లభించిన కొద్దిపాటి నీటివసతితో ధైర్యము చేసి, ఆశతో పండించిన పంటలు, అననుకూల వాతావరణంతో దిగుబడులు తగ్గి, వ్యవసాయ పెట్టబడులు పెరిగి, కనీసం తమ శ్రమకు తగ్గ కూలీ డబ్బులు మరలని హృదయవిదారక పరిస్థితులు నెలకొనగా దిక్కు తోచని సమాజ అన్నదాతల జీవనం అగమ్యగోచరంగా మారింది. దారీతెన్నూ తెలియక బ్రతుకు భారమై, ధైర్యము, ఆశ నశించి తమకు మరణమే శరణము అనెడి మార్గాన్ని అయిష్టం గానే ఎంచుకొని ఆ మృత్యు దేవతను ఆశ్రయించుట అత్యంత దయనీయం మరియు శోకమయం. మార్గదర్శనం చేసి, అన్నదాతకు వెన్నుదన్నుగా నిలచి, అతనికి ధైర్యాన్ని అందించి, జీవితంపై ఆశను కల్పించి, ఎంతో భరోసానిచ్చి కాచి కాపాడ వలసిన ప్రభుత్వం అతని చావుకు నగదు వెలకట్టి చేతులు దులుపు కొనుచుండుట మిగుల శోచనీయం.

సామూహికశక్తి లోపించి ఎవరికి వారే అనెడి రీతిగా జీవితాలను కొనసాగించుచున్న అన్నదాతల గోడును పట్టించుకొనే ప్రభుత్వం లేదు. ఆరు గాలం పనిచేసి భూమిని నమ్ముకొని, ప్రకృతికి సలాము కొడుతూ దాని దయాదాక్షిణ్యాలపై బ్రతుకుతూ సమాజానికి ఆహారాన్ని అందించుచున్న రైతన్న గోడును పట్టించుకొనక వారి కర్మకు వారే బాధ్యులు అని విడచిపుచ్చుట అమానుషం.

ఇట్టి దయనీయ బాధాకర పరిస్థితులలో అంధకారము అలుము కున్న అన్నదాతల జీవితానికి వెలుగు చూపుతుందనెడి ప్రగాఢ విశ్వాసంతో ఈ క్రింది "గో ఆధారిత" వ్యవసాయ విధానాన్ని అనుసరించి పంటల సాగుచేసి చక్కని ఫలితాల సాధించిన ఇరువురి అన్నదాత విజయగాథలను అందిస్తున్నాం.

**ఆలపాటి వీరయ్య, సెల్: 80966 21454**



తండ్రి వెంకటేశ్వర్లు, గురవాయపాలెం గ్రా॥, నరసరావుపేట రూరల్ మం॥, గుంటూరు జిల్లా వాసి ఈ క్రింది విధంగా తనకున్న పొలంలో 2 ఎకరాల 30 సెంట్లు విస్తీర్ణంలో ఒక చోట, గోఆధారిత పద్ధతిలో, మరోచోట 2 ఎకరాలు 30 సెంట్లు విస్తీరంలో మామూలు రసాయనిక ఎరువులు వాడిన పద్ధతిలో ప్రతి పంటను పండించారు. మొదటిచోట గోఆధారిత వ్యవసాయ పద్ధతిలో కేవలం ఆవుపేడను, మూత్రాన్ని వగైరా వాడి అత్యధిక లాభాన్ని ఆర్జించాడు.

రెండవ భాగములో రసాయనిక ఎరువులు పురుగు మందులు వాడి కొద్దిపాటి లాభాన్ని చవిచూశాడు.

దీనికి సంబంధించిన పూర్తి వివరాలను ఈ ప్రక్కపేజీలో మీకు అందించుట జరిగినది. ఈ వివరాలనన్నింటిని శ్రీఆలపాటి వీరయ్యగారు (రైతు) స్వయంగా వారి ముఖతః అందించగా సేకరించి నమోదు చేయుట జరిగింది.

**బొడ్డపాటి శ్రీనివాసరావు, సెల్: 96527 44717**



తండ్రి వెంకటేశ్వర్లు, నర్సరావుపేట రూరల్ మం॥, గుంటూరు జిల్లా (గాయత్రీ పరివార్). 2014 డిసెంబరులో కాకివాయి గ్రా॥, నెల్లూరు జిల్లాలో 10 ఎకరాల విస్తీర్ణంలో బూడిద గుమ్మడి సాగును రసాయనిక ఎరువులు వాడి చేపట్టుట జరిగింది. 2015 ఆగస్టులో నర్సరావుపేట సమీపంలో ఎకరం 50 సెంట్ల విస్తీర్ణంలో గోఆధారిత సాగు పద్ధతిలో బూడిద గుమ్మడి పంటను పండించారు. దీనికి సంబంధించిన పూర్తి వివరాలను ఈ ప్రక్కపేజీలో మీకు అందించుట జరిగినది.

**శరీరమే తానుగా భావించేవారికి ఇంద్రియ తృప్తితో మాత్రమే ఆనందం పరిమితం**

| రైతు - శ్రీ ఆలపాటి వీరయ్య | గో ఆధారిత వ్యవసాయ సాగు | రసాయనిక ఎరువుల వ్యవసాయ సాగు |
|---|---|---|
| 1. ప్రత్తి రకం | ఫస్టు క్లాస్-బాయర్ కంపెనీ | ఫస్టు క్లాస్-బాయర్ కంపెనీ |
| 2. విస్తీర్ణం | 2 ఎకరాల 30 సెంట్లు | 2 ఎకరాల 30 సెంట్లు |
| 3. దున్నుటకు - ట్రాక్టరుతో నాగలికి | రూ. 3,000 | రూ. 3,000 |
| గొర్రు తోలకం - 2 సాళ్ళు | రూ. 2,300 | రూ. 2,300 |
| 4. విత్తనం ఖరీదు - 6 ప్యాకెట్లు | రూ. 4,980 | రూ. 4,980 |
| 5. అంతర సేద్యం - ట్రాక్టరుతో | రూ. 4,600 | రూ. 10,000 |
| 6. కలుపు తీయుటకు కూలీ | రూ. 1,000 | రూ. 10,000 |
| 7. ఎరువులు - 20:20:0 - 4 బస్తాలు | రూ. 00 | రూ. 3,800 |
| 14:35:14 - 4 బస్తాలు | రూ. 00 | రూ. 4,900 |
| యూరియా - 3 బస్తాలు | రూ. 00 | రూ. 1,050 |
| 8. పురుగు మందుల ఖర్చు | రూ. 00 | రూ. 3,000 |
| 9. జీవామృతం తయారీ + చల్లుట | రూ. 1,500 | రూ. 00 |
| 10. నీటితడికి ఖర్చు (డీజిల్) | రూ. 00 | రూ. 800 |
| 11. ప్రత్తి తీయుటకు కూలీ | రూ. 6,000 | రూ. 6,000 |
| వెరసి ఖర్చు | రూ. 23,380 | రూ. 49,970 |
| ప్రత్తి దిగుబడి | 20 క్వింటాళ్ళు | 16 క్వింటాళ్ళు |
| అమ్మకం రూ. 3500 చొప్పున క్వింటాకి | రూ. 70,000 | రూ. 56,000 |
| నికర లాభం | రూ. 46,620 | రూ. 6,100 |

| రైతు - శ్రీ బొడ్డపాటి శ్రీనివాసరావు | గో ఆధారిత వ్యవసాయ సాగు | రసాయనిక ఎరువుల వ్యవసాయ సాగు |
|---|---|---|
| 1. విస్తీర్ణం | 1 ఎకరాల 50 సెంట్లు | 10 ఎకరాలు |
| 2. విత్తనం ఖర్చు | రూ. 1,500 | రూ. 13,000 |
| 3. దున్నుటకు - ట్రాక్టరుతో | రూ. 4,500 | రూ. 30,000 |
| 4. అంతర సేద్యం - ట్రాక్టరుతో | రూ. 2,200 | రూ. 10,000 |
| 5. కలుపు తీయుటకు కూలీ | రూ. 5,000 | రూ. 40,000 |
| 6. కాంప్లెక్స్ ఎరువు | రూ. 00 | రూ. 50,000 |
| 7. పురుగు మందులు | రూ. 00 | రూ. 10,000 |
| 8. ఆవు ఎరువు | రూ. 4,000 | రూ. 00.00 |
| 9. జీవామృతం తయారీ + చల్లుట | రూ. 2,000 | రూ. 00.00 |
| 10. నీటి తడికి ఖర్చు | రూ. 2,000 | రూ. 8,000 |
| 10. కౌలు | రూ. 4,500 | రూ. 30,000 |
| వెరసి ఖర్చు | రూ. 25,700 | రూ. 1,91,000 |
| దిగుబడి | 23 టన్నులు | 80 టన్నులు |
| అమ్మకం | రూ. 85,000 (దఫా దఫాలుగా వివిధ ధరలలో అమ్మకం) | రూ. 1,65,000 |
| నికర లాభం | (+) రూ. 59,300 | (–) రూ. 26,000 (20 టన్నులు కొనుగోలు కాలేదు) |

## రెండు సాగు విధానాలపై విశ్లేషణ

ఎరువుల వాడకం ద్వారా అంతరసేద్యం ఖర్చు ఇబ్బడి ముబ్బడి. ఎరువుల ఖర్చు జీవామృతం కన్నా 5-6 రెట్లు హెచ్చు. పంట నాణ్యత రసాయనిక ఎరువుల వాడకంలో కన్నా గోఆధారిత ద్వారా నాణ్యమైన పంట లభించింది. వాతావరణ కాలుష్యం రసాయనిక పద్ధతిలో హెచ్చు. మరియు భూసారం తగ్గిపోతుంది. గోఆధారితలో వాతావరణ కాలుష్యం శూన్యం మరియు భూసారం మెరుగవుతున్నది. పంట గోఆధారితం ద్వారా దిగుబడి పెచ్చు మరియు లాభం కూడా పెచ్చు.

**అసంతుష్టి ఒక ప్రవృత్తి. ఇది సాధనాలతో సంబంధంలేనిది - తృష్ణతో కూడినది**

# ఒక సామాన్యుడు దేవమానవునిగా ఎదిగి, వేలాది తెలుగువారిని ఆధ్యాత్మిక బాటలో నడిపించి తరింపజేసిన వాస్తవిక గాథ



**శ్రీ రామానంద స్వామి**
**అమలాపురం**

| ప్రథమ శ్వాస: | అంతిమశ్వాస: |
| --- | --- |
| 28.06.1952 | 12.11.2015 |

శ్రీ మల్లిడి వీర వెంకట సూర్యనారాయణ రెడ్డి – శ్రీమతి కుసుమ పుణ్యదంపతులకు ప్రథమ సంతానంగా పసలపూడి గ్రామము రామ చంద్రాపురం మండలం, తూర్పు గోదావరి జిల్లాలో **శ్రీ రామిరెడ్డి ఉరఫ్ శ్రీ రామానంద స్వామి** 1952 జూన్ 28న జన్మించారు.

ప్రాథమిక విద్యను 5వతరగతి వరకు కుతుకులూరు, దొంతమూరు మరియు సంద్రేడు గ్రామాలలో పూర్తిచేశారు. వీరి తండ్రి వీరవెంకట సూర్యనారాయణరెడ్డి ఆధ్యాత్మిక చింతనాపరుడు మరియు సంస్కారవంతుడు, హైందవ ధర్మము, సంస్కృతి పట్ల ఎనలేని గౌరవ ప్రపత్తులు కలిగి ఉండుటచే తన సంతానానికి కూడా చక్కని విద్యా బుద్ధులతోపాటుగా చక్కని సంస్కారాల అందించనెంచి, కుమారుని వన్నెచింతల పూడి గ్రామములో నెలకొని ఉన్న ఆశ్రమంలో చేర్చారు. ఈ ఆశ్రమాన్ని పూజ్యులు, ఆదర్శవాది, స్వాతంత్ర్య సమరయోధుడు కీ॥శే॥ నడింపల్లి సుబ్బరాజు (సాధుగారు) నడిపించేవారు. నిగర్వి, నిరాడంబర జీవితాన్ని గడుపుతూ ఉతికిన నేత దుస్తుల ధరిస్తూ, క్రమశిక్షణతో మౌనవ్రతాన్ని ఆచరిస్తూ జీవించేవారు. తన గురువు శ్రీ సుబ్బరాజుగారి జీవనశైలి, బాల్యము నుండి శ్రీ రామిరెడ్డి గారిపై తీవ్ర ప్రభావాన్ని చూపింది. ఆశ్రమ జీవన విధానంతో గురువు యొక్క మితభాషణ, గంటలకొలది మౌనవ్రతం రామిరెడ్డిగారిపై బలమైన ముద్రను వేశాయి. ఆయనలో నిబిడీకృతమైయున్న ఆధ్యాత్మిక బీజాలు రామిరెడ్డి చిన్ననాటనే గురువు శ్రీ సుబ్బరాజుగారి పోషణలో మొలకెత్తి, చిగురుటాకులు తొడిగాయి. శ్రమయే సుఖానికి వారధి, నిరాడంబర జీవనమే మనిషికి, మనస్సుకు అలంకారాన్ని ఇస్తుందని, మౌనంతో మానవాళిని సంస్కరించుట, దైవాన్ని చేరుకొనుట అత్యంత కఠినమైనదైనా, శాశ్వతము, దృఢతరము అయినదని గాఢంగా నమ్మి అదే మార్గాన్ని ఎంచుకొని తన జీవితాంతము అదే మార్గములో పయనించిన ధీరోదాత్తుడు– కఠోర దీక్షాబద్ధుడు.

శారీరక సౌందర్యం కన్న మానసిక సౌందర్యం, శారీరక సుఖం కన్నా ఆత్మానందము మిన్నయని తన జీవనశైలి ద్వారా ఆచరించి చూపిన ఆచరణశీలి – నడుము చుట్టూ ఒక అంగ వస్త్రాన్ని, పైన ఒక అంగ వస్త్రాన్ని మాత్రమే కప్పుకొని పాదరక్షలు ధరించక వేలకొలది మైళ్ళు కాలినడకన పయనిస్తూ తన నిరాడంబరతతో, మౌనముతో కూడిన అత్యంత మిత భాషణ ద్వారా వేలాదిమంది తెలుగువారిని సంస్కరిస్తూ వారి జీవనంలో వెలుగునింపి, సుఖాల నింపి వారిలోని అజ్ఞానాన్ని, అంధకారాన్ని, కష్టాలను తనవిగా చేసికొని ఒక జ్ఞానజ్యోతిలా కరిగిపోయిన త్యాగశీలి, క్రాంతి దాత.

తనకు యుక్తవయస్సు ప్రవేశించగనే తన ఆజ్ఞాచక్ర స్థానములో ప్రకాశిస్తున్న జ్యోతిని స్వామి వివేకానందునిలా దర్శించిన ఈయన, ఒక ఆధ్యాత్మిక జ్ఞానప్రకాశిక. ఆశ్రమంలో విద్యాభ్యాసము గావించుచున్న సమయంలో వీరు ప్రకృతి సిద్ధమైన పాలు, పండ్లు, పచ్చికూరలు, ఉడికించిన కూరలను తినుటలో ఎక్కువ ఆసక్తిని చూపేవారు. వండిన ఆహారాన్ని సాధ్యమైనంత మేర తినేవారు కాదు, దీనితో వీరిలో సాధు, సత్వగుణాలు అధికంగా పెంపొందాయి. కీడుచేసిన వారికి మేలుచేయి, ద్వేషించిన వారిని ప్రేమించు, విమర్శలను శాంతచిత్తంతో మౌనంగా స్వీకరించు, హింసకు ప్రతిహింస జవాబు కాదు, హింసను భరించుట సహించుట అలవరచుకో. ఇవే మనిషిని దేవమానవునిగా ఎదుగుటకు తోడ్పడతాయి అని ప్రబోధించి ఆచరించి చూపిన మానవతావాది, ప్రేమ మూర్తి.

పై లక్షణాలతో కూడిన జీవన విధానంతో రామిరెడ్డిగారిలో భవిష్యత్తు దర్శించగల్గెడి ఋషిసత్తా మొగ్గ తొడగసాగింది.

**ఒకే లక్ష్యంపై కేంద్రీకరించిననాడు ఆశ్చర్యజనకమైన ఉత్సాహం ఉరకలు వేస్తుంది**

అమలాపురం ఎస్.కె.బి.ఆర్. కళాశాలలో బి.ఎస్.సి. డిగ్రీని పూర్తిచేశారు. ఆశ్రమం నుండి కాలేజికి నిత్యము వచ్చెడి మార్గంలో ప్రస్తుతము అమలాపురంలోని ఎఱ్ఱవంతెన వద్ద ఉన్న ఆశ్రమస్థలం ఒకప్పుడు వ్యవసాయ భూమి - అచ్చట ఆశ్రమం త్వరలో నిర్మితమవుతుందని భవిష్యవాణిని వినిపించిన భవిష్యద్రష్ట శ్రీరామిరెడ్డిగారు. అచిరకాలంలోనే అచ్చట గీతా ప్రచార విద్యా నిలయం పేరుతో ఒక చిన్న ఆశ్రమం ప్రారంభ మయింది. ఇచ్చటికి సుప్రసిద్ధ నిర్విషయానంద స్వామీజీ వచ్చి చాతుర్మాస్యదీక్షను ప్రారంభించారు. అప్పటి నుండి గీతా పారాయణ, లలితా పారాయణ 1992 వరకు జరిగింది. అప్పుడే శ్రీరామిరెడ్డిగారి పేరును శ్రీరామానంద స్వామిగా మార్చివేయుట జరిగింది.

అప్పటికే అమలాపురం పట్టణంలో గాయత్రీ పరివార్‌తో జోడింపబడి గాయత్రీ యజ్ఞాలను శ్రీ శ్యామలరావుగారు చేయిస్తూ ఉండేవారు. శ్రీరామానందస్వామి యజ్ఞవిద్యను, శ్రీ శ్యామలరావుగారి నుండి నేర్చుకొనుట జరిగింది. దీనికి తోడుగా పూజ్యులు డాక్టర్ మారెళ్ళ శ్రీరామకృష్ణ మాష్టారితో, శ్యామలరావుగారి ద్వారా పరిచయం కాగా వారిద్వారా గాయత్రీ యజ్ఞ వ్యాప్తికై మరింతగా కృషి చేయసాగారు. 108 కుండముల గాయత్రీ యజ్ఞాలు నిర్వహించారు. ఆనాటి నుండి గాయత్రీ మంత్ర విశిష్టతను, గాయత్రీ యజ్ఞ విశిష్టతను గుర్తించి రామానందస్వామిగారు, తమ ధ్యాసను, ధ్యానాన్ని సమయాన్ని గాయత్రీ మంత్రముపై మరియు గాయత్రీ యజ్ఞముపై కేంద్రీకరించి ఆనాటి నుండి వీని వ్యాప్తికై అవిరళ కృషి చేయ సాగారు. దీనిలో భాగంగా హవన సామాగ్రిని, గాయత్రీ హవనవిధి సాహిత్యాన్ని ఊరూరా ఉచితంగా పంచుట ప్రారంభించారు. దీనికై శిక్షణా తరగతుల ప్రారంభించి అనేక మందికి గాయత్రీ మంత్రానుష్ఠానాన్ని గాయత్రి యజ్ఞవిద్యను నేర్పించారు. దీనితో ప్రభావితులైన అనుచర కార్యకర్తలు 12 ప్రదేశాలలో గాయత్రీ పీఠాలను స్థాపించాలనెడి పిలుపునివ్వగా ఈ క్రింది ప్రదేశాలలో పీఠాలు కొన్నిచోట్ల ప్రారంభింపబడగా మరికొన్ని చోట్ల స్థలసేకరణ, నిర్మాణదశలోనున్నాయి.

1) వన్నె చింతలపూడి 2) రంగాపురం 3) అమలాపురం 4) మామిడాడ 5) పల్లకడియం 6) మాగం 7) కొమరగిరి పట్టణం 8) విజయనగరం 9) హంసవరం 10) తొత్తరమూడి 11) సబ్బవరం 12) అనపర్తి

తదుపరి హరిద్వార్‌లోని శాంతికుంజ్ గాయత్రీ తీర్థాన్ని శ్యామలరావుగారితో కలిసి సందర్శించుట జరిగింది. ప్రకృతి వైద్యముతోపాటు యోగాను కూడా వ్యాప్తిలోనికి తీసికొని వచ్చారు. దీనికితోడు సంస్కృత భాషను కూడా నేర్పించసాగారు. విశ్వహిందూ పరిషత్‌వారి సహకారంతో బాలల విద్యాశాలను అమలాపురం ఆశ్రమ ప్రాంగణంలో ప్రారంభించారు. ఉచిత హోమియో వైద్యశాలను కూడా ఆశ్రమంలో నెలకొల్పారు.

జీర్ణదశలోనున్న కొన్ని దేవాలయాలు వీరి పాదస్పర్శతో తిరిగి పునర్జీవితాన్ని పొందాయి. జీర్ణోద్ధరణ జరిగింది. వీనిలో ప్రముఖమైనవి పల్ల కడియం గ్రామంలోని రెండు రామాలయాలు అనపర్తిలోని లక్ష్మీదేవాలయం పునరుద్ధరింపబడ్డాయి.

దత్తాత్రేయుని అవతార పరంపరలో ఒకానొక శక్తి అంశంగా భాసిల్లిన శ్రీ విఠలానంద బాబా (వల్లభాపురం ఆశ్రమ వ్యవస్థాపకుడు, మహబూబ్‌నగర్ జిల్లా) ప్రభావం కూడా శ్రీరామానందులవారి జీవితంలో ప్రగాఢ ముద్రను వేసింది. దత్తాత్రేయ పరంపర మరియు గాయత్రీ పరంపర రెండింటికి మూలపురుషుడైన శ్రీశ్రీశ్రీ సర్వేశ్వరానందులవారు ఒక్కరేనని కావున గాయత్రీ వ్యాప్తిని చేయమని శ్రీ రామానందులవారిని ప్రోత్సహించారు. దీనితో అనేకచోట్ల యజ్ఞాలు నిర్వహించారు.

"గంగ, గోవు, గాయత్రి, గీత" అనెడి నాలిగింటిని పట్టుకొని ప్రజలలో వీనిపట్ల చైతన్యాన్ని నింపి ఆ జ్ఞానాన్ని వారికి అందించి వీని విశిష్టతల తెలిపి భారతీయ జ్ఞానానికి, సంస్కారాలకు తిరిగి ప్రాణం పోసిన సంస్కృతీ ప్రదాత.

గాయత్రీపట్ల శ్రీరామానంద స్వామిగారికి గల భక్తి తత్పరతలను, విశ్వాసాన్ని, సమర్పణను దర్శించిన సూక్ష్మ శరీర ధారియైన శ్రీరామశర్మ ఆచార్య, వీరికి స్వప్న దర్శనమిచ్చి శాంతికుంజ్‌ను దర్శించి, పరమవందనీయ మాతాజీ నుండి గాయత్రీ మంత్రదీక్షను పొందమని ఆదేశించిరని రామానంద స్వయంగా నుడివిరి. తన జ్ఞాన గురువైన శ్రీరామశర్మ ఆదేశాన్ని అనుసరించి, శాంతికుంజ్‌ను దర్శించి సామూహిక మంత్ర దీక్షలో ఒకరిగా 1993లో మాతాజీ నుండి మంత్రదీక్షను పొందానని ప్రకటించారు. అట్లే వినాయక చతుర్దశి మరునాడు ఋషిపంచమి రోజున వీరికి స్వప్నదర్శనమిచ్చి పరమపూజ్య

**మనస్సును నిలకడగా ఉంచిన అది పారదర్శకంగా ఉంటుంది**

గురుదేవులు శ్రీరామశర్మ ఆచార్య వీరికి భవిష్యత్ మార్గదర్శనాన్ని చేసినారని వెల్లడించారు. తదుపరి గురు పాదుకాస్థవనాన్ని మరియు గురువు అష్టోత్తర శతనామావళిని పాడించుకొని తన గురువైన శ్రీరామశర్మ పాదుకలకు పాదపూజనం చేశారు. అనేకమార్లు అనేకచోట్ల జ్ఞానయజ్ఞం చేయించారు.

తన ఆయుర్దాయం 51 సంవత్సరములేనని, దీనిని తన గురుదేవులైన పరమపూజ్య పండిత శ్రీరామశర్మ ఆచార్యవర్యులు మరో 12 సంవత్సరాలు పొడిగించారని, తత్ఫలితంగానే ఈ పొడిగించిన వయస్సులోనే మరికొన్ని గాయత్రీ పీఠాలకు అంకురార్పణ చేయగలిగానని చాటుకున్నారు శ్రీరామానందుల వారు.

తాను తన శరీరాన్ని విడచిపెట్టుచున్నానని ప్రకటిస్తూ నేటి తన అనుచరులంతా వృక్షారోపణ ఉద్యమాన్ని చేబూని కోనసీమనంతా ఆకుపచ్చని సీమలా తయారు చేయాలని కోరారు. భూమిపై వాక్ ప్రదూషణతోపాటు, వాయు ప్రదూషణ, వాతావరణ ప్రదూషణల తొలగించుటకై వృక్షారోపణ కార్యక్రమాన్ని చేపట్టవలసిందిగా కోరారు.

దేవమానవునిగా ఎదిగి వేలాదిమందికి జ్ఞానమార్గాన్ని అందించి వారి జీవితాలలో వెలుగు నింపి సన్మార్గం వైపు నడిపించిన మార్గదర్శి. కోనసీమలో గాయత్రీ వ్యాప్తికై లక్షలాది కుటుంబాలను మేల్కొల్పిన మానవతామూర్తి, నిష్కళంకుడు, నిరాడంబరుడు, నిగర్వి, నిత్యసంతోషి, నిరుపమాన నిరంతర కృషీవలుడు, నిత్యసాధనాపరుడు పరమపూజ్య గురుదేవులు పండిత శ్రీరామశర్మ ఆచార్యులకు అత్యంత ప్రీతిపాత్రంగా తనను తాను మలచుకొన్న సమర్పణాశీలి. ఇట్టి మహనీయుడు తన శరీరాన్ని 12 నవంబర్ 2015న విడిచిపెట్టారు. కోనసీమ ఆధ్యాత్మిక చింతనాపరుల హృదయాలలో గాయత్రీ పరివార్ హృదయాలలో తనదైన ముద్రను వేసి తదుపరి తన లక్ష్యాల సాధనకై పయనమై వెళ్ళారు.

---

## గాయత్రీ పరివార్ - 2016 వార్షిక క్యాలెండర్

గత ఐదు సంవత్సరముల నుండి గాయత్రీ పరివార్ వార్షిక క్యాలెండర్‌ను ఆదరించి, పరమపూజ్య గురుదేవులు మరియు పరమ వందనీయ మాతాజీల వాణిని, ఉభయ తెలుగు రాష్ట్రాల నలుచెరగులా మరియు వివిధ రాష్ట్రాలలోనున్న తెలుగువారికి అందించుటలో మీరంతా అందించుచున్న సహాయసహకారాలకు, ప్రోత్సాహానికి, గాయత్రీ చేతనా కేంద్రము తొలుత మీకు ధన్యవాదములు తెలుపుకొనుచున్నది.

ఈ సంవత్సరము 2016 వార్షిక క్యాలెండర్‌ను మరింత సందేశాత్మకంగా మనందరి హృదయాల కదిలించి, మన ఆలోచనల మథింపజేసి తద్వారా లభించెడి నవనీతాన్ని పూజ్య గురుయుగ్మం ఆశయాలకు అనుగుణంగా సమకాలీన సమాజానికి అందించి, సత్యయుగ నిర్మాణానికై చేసెడి కృషిలో మనలను మరియొక ముందడుగు వేయించుటలో మార్గదర్శనం ఇవ్వగలదని మా ప్రగాఢ విశ్వాసం. క్యాలండరు సైజు 31 సెం.మీ. (పొడవు) × 22 సెం.మీ. (వెడల్పు)

1) ఎప్పటిలాగే మీ పేర్లను / మీ సంస్థల పేర్లను గాని మీ కోరిక మేరకు ముద్రించి అందించగలం. (ప్రకటన స్థలం సైజు: 3.5 సెం.మీ. (పొడవు) × 22 సెం.మీ. (వెడల్పు)
2) మీ పేర్లు ముద్రించి అందించుటకు కనీసం 500 కాపీలను ఆర్డరు చేయవలెను.
3) 50 కాపీలకు తగ్గకుండా కొనుగోలు ఆర్డరు ఇచ్చినవారికి పోస్టు ద్వారా పంపబడతాయి.
4) కేవలం సద్వాక్యాలతో కూడిన క్యాలండర్ కాపీ ధర రూ.15/-. పేరుతో ముద్రించిన కాపీ ధర రూ. 18/-. రవాణా ఖర్చులు అదనం.

మీ ఆర్డరును డిశంబరు 10వ తేదిలోగా పంపించగలిగితే డిశంబరు 25వ తేదికి అందించగలము.

**ఇతర వివరాలకు సంప్రదించండి :**

**గాయత్రీ చేతనాకేంద్రం, అశ్విని హౌస్ దగ్గర, హెచ్.పి.రోడ్, మూసాపేట, హైదరాబాద్ - 500 018.**

**ఫోన్: 040-23700722, సెల్: 9949111175**

---

**ఆలోచనలతో మనస్సు బహిర్ముఖం అవుతుంది**